సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+16 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 149
సోమవారం 19-8-2019
SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'



**'ఐటీ రిటర్న్స్‌' ఆలస్యమైతే..**
నష్టాలకు క్యారీ ఫార్వర్డ్ ఉండదు. జరిమానా చెల్లించాల్సి రావొచ్చు -బిజినెస్‌లో



**నిరీక్షణ ఫలించేనా?**
నేటి నుంచి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్. -స్పోర్ట్స్‌లో

దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నాం. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. తెలంగాణలో పరిశ్రమలు మూడు షిఫ్టులు పనిచేస్తున్నాయి. దీనివల్ల ఉపాధి పెరిగింది. రాష్ట్ర ఆదాయం పెరిగింది. లో వోల్టేజీ లేకుండా ఉండేందుకు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలి పోకుండా ఉండేందుకు పంపిణీ, సరఫరా వ్యవస్థలను మెరుగుపరిచాం. ప్రస్తుతం 20 వేల మెగావాట్ల విద్యుత్‌ను వాడుకోవడానికి అనుగుణమైన వ్యవస్థ సిద్ధమైంది.
– ముఖ్యమంత్రి కేసీఆర్

పీఎఫ్‌సీ సీఎండీ రాజీవ్‌శర్మతో సీఎం కేసీఆర్



# అన్నీ 'వెలగాలి'

**దేశంలో సమగ్ర విద్యుత్ విధానం రావాలి**
- నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం
- పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సీఎండీతో కేసీఆర్
- రాష్ట్ర పర్యటనలో భాగంగా సీఎంతో రాజీవ్‌శర్మ మర్యాదపూర్వక భేటీ
- దేశ, రాష్ట్ర విద్యుత్‌రంగ పరిస్థితులపై ఇరువురి చర్చ

సాక్షి, హైదరాబాద్

అన్ని రంగాలకు అన్ని వేళలా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడం లక్ష్యంగా దేశంలో సమగ్ర విద్యుత్ విధానం రావాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖ ర్‌రావు అభిప్రాయపడ్డారు. దేశంలో ప్రస్తుతమున్న స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో సగం కూడా ఉపయోగించుకోవడం లేదని, ఇంకా చాలా ప్రాంతాలు చీకట్లోనే మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా విద్యుత్ కోతలు అమలవుతున్నాయని, ఈ పరిస్థితి పోవాల్సిన అవసరముందన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా పవర్ ప్లాంట్లు, కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) సీఎండీ రాజీవ్‌శర్మ ఆదివారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర విద్యుత్ రంగ పరిస్థితిపై చర్చ జరిగింది. 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తీవ్ర విద్యుత్ సంక్షోభం నెలకొంది. రాష్ట్ర ప్రగతికి ఆనాడు విద్యుత్ సమస్యే తీవ్ర అవరోధంగా నిలిచింది. విద్యుత్ సమస్యను పరిష్కరించనిదే రాష్ట్ర పురోగతి సాధ్యం కాదని భావించాం. విద్యుత్ రంగాన్ని తీర్చిదిద్దడానికి సమగ్ర వ్యూహం అనుసరించాం. 6 నెలల్లో విద్యుత్ కోతలు ఎత్తేశాం. ఇప్పుడు అన్ని రంగాలకు 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా వ్యవసాయానికి 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నాం. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. తెలంగాణలో పరిశ్రమలు 3 షిఫ్టులు పనిచేస్తున్నాయి. దీనివల్ల ఉపాధి పెరిగింది. రాష్ట్ర ఆదాయం పెరిగింది. లో వోల్టేజీ లేకుండా ఉండేందుకు,

మిగతా 2వ పేజీలో ▶



ఆదివారం సిమ్లాలో కొండచరియలు విరిగిపడటంతో ఇళ్లపై పడ్డ వాహనాలు

**హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా ఆదివారం 22 మంది మృతి చెందగా, 12 మందికి గాయాలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా రూ.490 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. సహాయక చర్యలు అందించేందుకు రావాల్సిందిగా జాతీయ విపత్తుల సహాయక బృందాలను కోరినట్లు తెలిపారు.**

- వివరాలు 5లో

హైదరాబాద్ సభలో ప్రసంగిస్తున్న నడ్డా



ఆయుష్మాన్ భారత్ పథకాన్ని వరల్డ్ హెల్త్ అసెంబ్లీ కీర్తించింది. అలాంటి పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని కోరితే కేసీఆర్ పట్టించుకోవడంలేదు. కేవలం ప్రధాని మోదీకి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే పక్కనపెట్టారు. ఈ పథకం కింద రాష్ట్రంలో 24 లక్షల మంది అర్హులు కేసీఆర్‌కు అక్కర్లేదట. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని సక్రమంగా అమలు చేస్తున్నారా అంటే అదీ లేదు. రూ. 1,500 కోట్ల బకాయిల కారణంగా ఆస్పత్రులు సమ్మె చేస్తున్నా పట్టించుకోవడంలేదు. ఇదేనా కేసీఆర్ ప్రజల ఆరోగ్యంపట్ల చూపిస్తున్న శ్రద్ధ?
– జేపీ నడ్డా

# 2023లో మేమే

**రాష్ట్రంలో అధికారంలోకొస్తాం.. రూపురేఖలు మారుస్తాం**
- బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా
- సచివాలయానికి వెళ్లని సీఎంకు కొత్త సెక్రటేరియట్ ఎందుకు?
- హైదరాబాద్‌లో సభ.. బీజేపీలో చేరిన పలువురు టీటీడీపీ నేతలు

సాక్షి, హైదరాబాద్:

రాష్ట్రంలో అందరి సహకారంతో 2023లో అధికారంలోకి వస్తామని, తెలంగాణ రూపురేఖలు మారుస్తామని బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా ధీమా వ్యక్తంచేశారు. ఇప్పటికి 17 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నామని, అప్పటికి 25 రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తామని, అందులో తెలంగాణ ఉంటుందని స్పష్టంచేశారు. ఎంపీ గరికపాటి మోహన్‌రావు నేతృత్వంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీకి చెందిన రాష్ట్ర నేతలు, జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గఇన్‌చార్జిలు ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఇక్కడి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 'నెక్స్ట్ తెలంగాణ' పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో నడ్డా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ''నేను బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక మొదటిసారిగా దక్షిణ భారత ముఖ ద్వారమైన తెలంగాణకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. మీ అందరి ఆశీర్వాదం మా పార్టీపై ఉంటుందనే విశ్వాసం నాకు ఉంది'' అని తెలుగులో ప్రసంగం ప్రారంభించిన నడ్డా.. అనంతరం హిందీలో కొనసాగించారు. బాసర, యాదగిరిగుట్ట వంటి పుణ్యక్షేత్రాలు, బమ్మెర పోతన వంటి కవులు, కొమురం భీం, సమ్మక్క సారలమ్మ వంటి పోరాట యోధులు నడయాడిన గడ్డకు రావడం సంతోషంగా ఉందన్నారు. రజాకార్లపై పోరాడిన వీరభూమికి వచ్చినందుకు సంతోషంగా ఉందని, ఈ సమయంలో తెలంగాణకు విముక్తి కల్పించిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. అలాంటి తెలంగాణలో కేసీఆర్ నిరంకుశ, కుటుంబ పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు.

**ఇక్కడ అంతా కేసీఆర్ ఇష్టమే..**

సచివాలయానికి వెళ్లని సీఎం కేసీఆర్ ఒక్కరేనని, ఇంతవరకు తాను ఎవరినీ అలా చూడలేదని, అలాంటి ముఖ్యమంత్రికి

మిగతా 3వ పేజీలో ▶










## ఇదీ సంగతి




మన పార్టీలో ఉన్నంత అంతర్గత ప్రజాస్వామ్యం మరే పార్టీలో ఉండదనుకుంటా సార్!

ఇది మీ ప్రభుత్వం..

# ఆనందంగా రండి

- పెట్టుబడులు పెట్టండి.. అన్ని రకాలుగా మీకు తోడుంటాం
- అమెరికాలోని డల్లాస్ వేదికగా ఎన్‌ఆర్‌ఐలకు పిలుపునిచ్చిన ఏపీ సీఎం వైఎస్ జగన్
- నా చరిత్రాత్మక విజయం వెనుక మీ కృషి చాలా ఉంది
- మీ ప్రేమాభిమానాలకు సెల్యూట్ చేస్తున్నా.. మార్టిన్ లూథర్ కింగ్‌లాగే నాకూ ఓ కల, లక్ష్యం ఉంది
- అవినీతి, లంచగొండితనం లేని ఆంధ్రప్రదేశ్ నిర్మించాలనేది నా డ్రీమ్
- అన్నం పెట్టే రైతన్నలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి రాకూడదు..
- నిరక్షరాస్యత శాతాన్ని సున్నాకు తేవాలి

2లో

ఇది మీ ప్రభుత్వం అనే విషయాన్ని గుర్తుపెట్టుకోండి. మీ కుటుంబాలతో రండి. మీ తల్లిదండ్రుల్ని, అవ్వాతాతల్ని, స్నేహితుల్ని చూడ్డానికి సంవత్సరానికి కనీసం ఒకట్రెండు సార్లయినా రండి. ఆ తర్వాతే పారిశ్రామికంగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రండి. అన్ని రకాలుగా మీకు తోడుగా ఉంటాం.
- వైఎస్ జగన్





అమెరికా డాలస్‌లోని హచిసన్ కన్వెన్షన్‌లో జరిగిన సభకు భారీగా హాజరైన ప్రవాసాంధ్రులు. సభలో ప్రసంగిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

# కొనసాగుతున్న 'ఆరోగ్యశ్రీ' బంద్

**ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందక పేదల అవస్థలు**
**గాంధీ, నిమ్స్‌కు పెరుగుతున్న తాకిడి**
**నేడు నెట్‌వర్క్ ఆసుపత్రుల అసోసియేషన్ భేటీ**
**ప్రభుత్వ తీరు, తాజా పరిస్థితులపై చర్చించి కార్యాచరణ**



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం సేవలు నిలిచిపోవడంతో ఖరీదైన చికిత్సలను ఉచితంగా పొందేందుకు ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వరుసగా మూడో రోజు కూడా రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోగా ఈ విషయం తెలియని గ్రామీణప్రాంత రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చి ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. డయాలసిస్ మొదలు కొని గుండెకు సంబంధించిన చికిత్సల కోసం నిత్యం వేల మంది రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తుంటారు. వారికి ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చికిత్సలు అందు తుంటాయి. కానీ ప్రైవేటు ఆసుపత్రులకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించక పోవటంతో ఆసుపత్రుల యాజమాన్యాలు సేవలను నిలిపేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 240 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశారు. బకాయిలను విడుదల చేస్తే తప్ప సేవలను అందించేది లేదని ఆసుపత్రులు

మిగతా 2వ పేజీలో ▶



# ట్రాఫిక్ చిక్కులు తీర్చే దిక్కులు..!

14లో

**హైదరాబాద్ నలువైపులా నయా హబ్స్..**
మంగల్‌పల్లి, బాటసింగారంలో శరవేగంగా లాజిస్టిక్ హబ్ పనులు
మియాపూర్‌లో ఐసీబీటీ నిర్మాణంపై హెచ్‌ఎండీఏ ప్రత్యేక దృష్టి
పటాన్‌చెరులోనూ కొనసాగుతున్న లాజిస్టిక్ హబ్ పనులు

## యువత అద్భుతాలు చేయగలదు: మోదీ

- భూటాన్‌ను యువత సరికొత్త ఎత్తుకు తీసుకెళుతుంది
- హిమాలయదేశం త్వరలోనే సొంత ఉపగ్రహం సమకూర్చుకోబోతోంది
- 'రాయల్ యూనివర్సిటీ ఆఫ్ భూటాన్'లో ప్రధాని మోదీ

- వివరాలు 5లో

## పెళ్లిలో పేలిన మానవబాంబు

అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో భారీ ఆత్మాహుతి దాడి సంభవించింది. పెళ్లి వేడుకను లక్ష్యంగా చేసుకుని పాల్పడిన పేలుడులో 63 మంది ప్రాణాలు కోల్పోగా 180 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘోరానికి పాల్పడింది తామేనని ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ప్రకటించుకుంది.

- వివరాలు 5లో

## సమాజంపై మహిళా సాహితీవేత్తల ప్రభావం

**ఢిల్లీ సాహితీ సమ్మేళనంలో మాడభూషి శ్రీధర్**

**సాక్షి, న్యూఢిల్లీ:** రుగ్వేద కాలం నుంచి ఆధునిక కాలం వరకు మహిళా సాహితీవేత్తలు సమాజంపై ఎంతో ప్రభావం చూపారని కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు కొనియాడారు. నాటి కాలంలో గార్గి, మైత్రేయి నుంచి ఆధునిక కాలంలో కౌసల్యాదేవి, జానకీరాణి వరకు తమ రచనలతో సమాజాన్ని ప్రభావితం చేశారని అన్నారు. ఢిల్లీలో తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఆంధ్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాహితీవేత్తల సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ ఆచార్యులు మాట్లాడుతూ.. నాటకం, కథ, కథనం, ఆధ్యాత్మికం వంటి సాహిత్యంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఆచార్య ఎల్చూరి మురళీధర్‌రావు మాట్లాడుతూ.. ముప్పాళ్ల రంగనాయకమ్మ, బండారు అచ్చమాంబ వంటి వారు సాహిత్యంపై ప్రత్యేక ముద్ర వేశారన్నారు. సమ్మేళనంలో పలువురు మహిళా సాహితీవేత్తలు ప్రసంగించారు.



## ● కుంబీపాకం.. కోడి రక్తం..

**ఆ**విడెందుకు అలా మొహం పెట్టింది అని అడక్కండి.. ఎందుకంటే.. బతికున్న బురద చేపని తినమంటే.. మీరైనా అలాగే మొహం పెడతారు... అప్పుడే అయిపోలేదు.. వేడివేడి కోడి రక్తం ఇంకా వెయిటింగ్‌లో ఉంది.. చైనాలోని గ్వియ్‌జోలో ఉన్న ఓ సేల్స్ కంపెనీ టార్గెట్స్ పూర్తి చేయని ఉద్యోగులకు విధించిన శిక్ష ఇది.. ఇలా దాదాపు పాతిక మందికి ‘అపరిచితుడు’ సినిమాలోని కుంబీపాకం టైపు శిక్షలను అమలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు అగ్గిమీద గుగ్గిలమయ్యారు.. అటు అధికారులూ ఈ ఘటనపై విచారణ మొదలుపెట్టారు.. ఇంతకీ దీనిపై వివరణ ఇచ్చిన కంపెనీ ప్రతినిధి ఏమంటాడో తెలుసా? వీళ్లంతా స్వచ్ఛందంగానే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారట.. అంతేనా.. భవిష్యత్తులో లక్ష్యాలను పూర్తి చేయడానికి ఇది ప్రేరణగా ఉంటుందని సెలవిచ్చాడు..

**ఇలాంటోడ్ని ఏం చేయాలంటారు??**



## ● సూరీడు ఆన్ సిక్ లీవ్..

**కో**డి నోరు ఎవరో కట్టేసినట్లు.. సూర్యుడేదో సిక్ లీవ్ పెట్టినట్లు.. గత శుక్రవారం సైబీరియాలోని వెర్కోయాన్స్‌లో తెల్లవారనే లేదు.. ఉదయం 8 అవుతున్నా.. చిమ్మచీకటి ఆకాశంలో కుర్చీ వేసుకుని కూర్చుంది.. తొలుత బిత్తరపోయినా.. తర్వాత అక్కడి జనం నెమ్మదిగా సర్దుకున్నారట.. ఎందుకంటే.. గతేడాది జూలైలో కూడా ఇలాగే అయిందట. తర్వాత పరిస్థితి మారినప్పటికీ.. ఇలా ఎందుకు జరిగిందన్న దానిపై అధికారికంగా ఎలాంటి వివరణ వెలువడలేదు. కాకపోతే.. సైబీరియాలో కొన్ని చోట్ల అడవులు తగలబడటం వల్ల వాతావరణంలో కార్బన్ మోనాక్సైడ్ ఎక్కువగా వెలువడిందని.. దీని వల్ల దట్టమైన మేఘాలు ఏర్పడి.. అవి సూర్యుడిని కప్పేసి ఉంటాయని వాతావరణ నిపుణులు చెప్పారు. అయితే, ఆ రోజున వాతావరణంలో పరిమితికి మించి కార్బన్ మోనాక్సైడ్ శాతం ఉన్నప్పటికీ.. అది మరీ ఇలా సూర్యుడిని ముంచేసేంత స్థాయి కాదని తాజాగా తేలింది.

**ఇంతకీ ఎలా జరిగిందంటారు??**

# ఇది మీ ప్రభుత్వం.. ఆనందంగా రండి

- **పెట్టుబడులు పెట్టండి.. అన్ని రకాలుగా మీకు తోడుంటాం**
- **అమెరికాలోని డల్లాస్ వేదికగా ఎన్‌ఆర్‌ఐలకు పిలుపునిచ్చిన ఏపీ సీఎం వైఎస్ జగన్**

**డాలస్ (అమెరికా):** ప్రవాసాంధ్రులు మన (ఆంధ్రప్రదేశ్) రాష్ట్రానికి వచ్చి ఆయా రంగాల్లో విరివిగా పెట్టుబడులు పెట్టాలని, అందుకు అన్ని విధాలా తమ ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఇది మీ ప్రభుత్వంగానే భావించాలని కోరారు. తెలుగువారి ఆత్మగౌరవం దశ దిశలా వ్యాప్తి చెందేలా, ఇనుమడించేలా పరిపాలనలో విప్లవాత్మకమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రవాసాంధ్రులు తమ గ్రామాల్లోని ఆసుపత్రులు, స్కూళ్ల పునర్నిర్మాణంలో, బస్టాపుల ఏర్పాటులో భాగస్వాములు కావాలన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ డాలస్‌లోని హచిసన్ సెంటర్‌లో భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు వేలాది మంది ప్రవాసాంధ్రులను ఉద్దేశించి ఉత్తేజ భరితంగా ప్రసంగించారు. ఇటీవలి ఎన్నికల్లో 22 ఎంపీ సీట్లు, 151 అసెంబ్లీ సీట్లు దక్కించుకుని చరిత్రాత్మక విజయం సాధించిన రెండున్నర నెలల తన పాలనలో తీసుకున్న విప్లవాత్మకమైన చర్యలను ప్రవాసుల ముందుంచారు. సామాజిక న్యాయం కోసం తీసుకున్న నిర్ణయాలను వివరించారు. దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలపాలన్న తన తపనకు ప్రవాసులు కదలి రావాలని, మీరు, మనము అందరమూ కలిసి ఏపీ పునర్నిర్మాణంలో భాగస్వాములమవుదామని వారందరినీ కోరారు. ఈ సమావేశంలో జగన్ ప్రసంగం ఇలా సాగింది.

**ఈ విజయంలో మీ పాత్రా కీలకం**

‘‘ఏపీలో మొన్న జరిగిన ఎన్నికల్లో ఇక్కడి (అమెరికా) తెలుగు వారు పోషించిన పాత్ర ఎంత గొప్పదో నాకు బాగా తెలుసు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 151 స్థానాలు గెలిచాం. 25 లోక్‌సభ స్థానాల్లో 22 చోట్ల గెలిచాం. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో 50 శాతం ఓటు బ్యాంకును సాధించాం. ఇందులో అమెరికా నుంచి తెలుగు వారు చేసిన కృషి ఎంతో ఉందని చెప్పడానికి నేనే మాత్రం సంకోచించడం లేదు. మీరు ఖండాలు దాటి వెళ్లినా ఆంధ్రప్రదేశ్ మీద, తెలుగు రాష్ట్రాల మీద, మన దేశం మీద, అన్నింటికీ మించి నాన్న మీద, నామీద చెక్కు చెదరని మీ ప్రేమాభిమానాలకు మరొక్కసారి జగన్ సెల్యూట్ చేస్తున్నాడు. అమెరికాతో పాటు వారికి మించి కూడా ఎదుగుతున్న మీ అందర్నీ చూసి మన రాష్ట్రంలో అక్కడ మేం ఎంతో గర్వపడుతున్నాం. మా దేశానికి భారతీయులు ఎంతో సేవ చేశారని, అమెరికా అధ్యక్షుడు స్వయంగా మన తెలుగువారి గురించి, మన భారతీయుల గురించి ప్రస్తావిస్తున్నప్పుడు ఎంతో గర్వంగా భావిస్తుంటాం. అమెరికాలో ఉన్న దాదాపు 41 లక్షల మంది భారతీయుల్లో 4 లక్షల మంది తెలుగువారే ఉన్నారు. మన రాష్ట్రాన్ని విడిచిపెట్టి వచ్చి ఇక్కడ స్థిరపడి, రాణిస్తున్నారంటే నిజంగా ఈ ప్రతిభను చూసి ముచ్చట వేస్తోందని గర్వంగా చెబుతున్నాను.

**ఏ దేశ చరిత్ర చూసినా..**

ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం, నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం’ అని శ్రీశ్రీ అన్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి అమెరికాలో కూడా ఇక్కడో మనిషి గతంలో తన ప్రాణాలను పణంగా పెట్టిన చరిత్రనూ మనం చూశాం. గాంధేయ మార్గం, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం మన దేశభక్తుల్ని నిరంతరం ప్రభావితం చేస్తే, అమెరికాలో మానవ హక్కులు, సమాన హక్కుల కోసం, వర్ణ వివక్షలేని సమాజం కోసం పోరాటం చేసిన యోధుడు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్. ఆయన్ను మనదేశంలో కూడా అనేక మంది స్ఫూర్తిదాయకంగా తీసుకుంటారు. ఐ హేవ్ ఎ డ్రీమ్.. అంటూ ఆయన చేసిన ప్రసంగాన్ని ఎప్పటికీ మరిచిపోలేం. 56 సంవత్సరాల క్రితం 1953 ఆగస్టు 27న ఆయన చేసిన ఈ ప్రసంగం అమెరికా ప్రజల్లోనే కాకుండా అమెరికాలోని ప్రభుత్వ విధానాల్లో కూడా ఎంతో గొప్ప మార్పు తీసుకువచ్చిందని చరిత్ర చెబుతోంది. కారణం ఒక్కటే. అధికారంలో ఉన్న వ్యక్తులు ఎవరైనా కూడా, ఆయన భావాలే వారికి వేదాలు అయ్యాయి కాబట్టి ఆ మార్పును తీసుకురాగల పరిస్థితి వచ్చింది. ఈ విషయం నేను ఎందుకు చెబుతున్నానంటే పాలకులు ధ్యాసపెడితే మార్పు అనేది తీసుకురావడం సులభం అవుతుంది.



**డాలస్‌లో వేదికపై వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్. చిత్రంలో వైవీ సుబ్బారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీ భరత్ తదితరులు**

**అవినీతి, లంచగొండితనం లేని రాష్ట్రం నిర్మించాలన్నది నా కల**

‘ఐ హేవ్ ఏ డ్రీమ్ ...’ అన్న మార్టిన్ లూథర్ కింగ్ మాటలు నిజంగా స్ఫూర్తిదాయకం. నాకూ ఓ కల ఉంది. బ్రిక్స్ దేశాలతో మనం ఎప్పుడూ పోల్చుకుంటుంటాం. బ్రిక్స్‌లో మన దేశం కూడా ఉంది. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి అంటే 18 నుంచి 23 సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్న వాళ్లు కాలేజీల్లో ఎంత మంది చేరుతున్నారని లెక్కగట్టేది. బ్రిక్స్ దేశాల్లో దీన్ని చూస్తే రష్యా 81 శాతం, బ్రెజిల్ 50 శాతం, చైనా 48 శాతం అయితే మన దేశం కేవలం 25 శాతం మాత్రమే. దీన్ని మన రాష్ట్రంలో 95 శాతానికి తీసుకెళ్లాలన్నది నా కల. పల్లెలు కళ కళ లాడాలని, అక్కడి ప్రభుత్వ బడుల్లో మంచి చదువులు ఉండాలన్నది నాదొక కల. అక్కడ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం గొప్పగా ఉండాలన్నది నాదొక కల. జబ్బు ఎలాంటిది అయినా, ఏ ఒక్క పేదవాడు వైద్యం ఖర్చు భరించలేక, చనిపోయే పరిస్థితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎప్పటికీ రాకూడదన్నది నాదొక కల. ఏ ఒక్క పేదవాడు సొంత ఇల్లు లేదనే పరిస్థితి లేకుండా అందరికీ సొంతిల్లు నిర్మించాలన్నది నా కల. ఏ తల్లీ తన పేదరికం వల్ల తన బిడ్డలకు చదువు చెప్పించలేని పరిస్థితి ఉండకూడదన్నది నా కల. ఎంత పెద్ద చదువైనా చెప్పించగలిగితే.. తరతరాలుగా అన్యాయానికి గురవుతున్న కులాల వారి బతుకులు సంపూర్ణంగా మారుతాయని, దాన్ని మార్చాలనేది నా డ్రీం. ఏ ఒక్కరూ నిరుద్యోగంతో పస్తులు ఉండకూడదన్నది నా కల. ఏ ఒక్క కుటుంబం మద్యం కారణంగా విచ్ఛిన్నం కావడానికి వీల్లేదన్నది, ఆంధ్రప్రదేశ్‌ను ఆనందాల రాష్ట్రంగా మార్చాలన్నది నా కల. అవినీతి, లంచగొండితనం లేని రాష్ట్రం నిర్మించాలన్నది నా కల. పెన్షన్స్ కావాలన్నా, రేషన్‌కార్డు కావాలన్నా, ఇల్లు కావాలన్నా, ఆరోగ్యశ్రీ కావాలన్నా, ఫీజు రీయింబర్స్‌మెంట్ కావాలన్నా, ఇలా ఏ గవర్నమెంట్ పథకమైనా గ్రామాల్లోనే.. ప్రభుత్వ సేవలన్నీ కూడా లంచాలు లేకుండా, వివక్ష లేకుండా ప్రతి పేదవాడికీ అందుబాటులోకి రావాలన్నదే నా కల. కులాలు, మతాలు, వర్గాలు, ప్రాంతాలు, రాజకీయాలు వీటిలో ఏదానికీ తావు లేకుండా వివక్ష లేని పరిపాలన అందించాలన్నది నా కల.

**గ్రామ స్థాయిలో విప్లవం**

నేను పెట్టుకున్న ఈ లక్ష్యాలు, నవరత్నాలు, నేనిచ్చిన ఎన్నికల మేనిఫెస్టో.. వీటన్నింటికీ ప్రేరణ మన ప్రజలే. వారి కష్టాలను చూశాక, వారి బాధలను విన్నాక వారందరికీ కూడా నేను చెప్పిన మాట ఒక్కటే. నేను విన్నాను అని చెప్పాను. ఈ రోజు అధికారంలోకి వచ్చాం. వచ్చిన తర్వాత.. నేను ఇది వరకే చెప్పాను. పాలకులు మనసు పెడితే చేయలేనిది ఏమీ ఉండదని. ఆ మనసుపెట్టి మీ అందరి చల్లని దీవెనలు, దేవుడి దయతో కచ్చితంగా మంచి చేస్తానని, సంపూర్ణ విశ్వాసం నమ్మకం ఉన్నాయని కచ్చితంగా ఈ వేదిక మీద నుంచి చెబుతున్నాను. ఈ దిశగానే అడుగు వేస్తూ రెండున్నర నెలల పరిపాలనలోనే ఏకంగా చరిత్రను మార్చే దిశగా అడుగులు వేశాం. మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో 19 బిల్లులను తీసుకు వచ్చాం. పెన్షన్లకు గతంలో సంవత్సరానికి ఇచ్చే సొమ్మును లెక్కవేస్తే, మూడింతలు ఇచ్చే దిశగా అడుగులు వేస్తున్నాం. మొదటి రెండున్నర నెలల్లోనే అమ్మ ఒడి, రైతు భరోసా, ఆరోగ్యశ్రీ, ఇల్లులేని నిరుపేదకు సంతృప్తికర స్థాయిలో ఏకంగా 25 లక్షల ఇళ్ల స్థలాలు ఏడాదిలోగా ఇవ్వబోతున్నామని చెబుతున్నాను. పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, యుద్ధ ప్రాతిపదికన జలయజ్ఞం కింద ప్రాజెక్టులు, బెల్టుషాపులన్నవి ఎక్కడా కూడా లేకుండా చేస్తూ మద్య నిషేధానికి నాంది పలికామని చెబుతున్నా. గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయాలతో గ్రామ స్థాయిలో విప్లవం తీసుకువచ్చే దిశగా అడుగులు వేస్తున్నాం. అణగారిన వర్గాలైన బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకు గతంలో ఎన్నడూ జరుగని విధంగా నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ పనుల్లో 50 శాతం ఇచ్చేలా చట్టం తీసుకువచ్చి అమలుకు పూనుకుంటున్నామని గర్వంగా చెబుతున్నా. ఆంధ్రప్రదేశ్‌లో నామినేటెడ్ పనులు, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టాన్నే తీసుకు వచ్చామని సగర్వంగా చెబుతున్నాను.

**మన రాష్ట్రానికి రండి..**

మన రాష్ట్రానికి, మన ఆంధ్రప్రదేశ్‌కు రండి అని మిమ్మల్నందరినీ ఆహ్వానిస్తున్నాను. ఇది మీ ప్రభుత్వం అని గుర్తుంచుకోండి. పారిశ్రామిక పెట్టుబడులు పెట్టడానికి ముందడుగులు వేస్తూ రండి. మేం అన్ని రకాలుగా చూసుకుంటాం, తోడుగా ఉంటామని చెబుతున్నాను. మీ గ్రామాల బాగును కోరుకున్న వాళ్లు, మీ గ్రామాల్లో మీరు చదువుకున్న బడులను మార్చాలని ఆరాట పడే వారు, మీ గ్రామాల్లో మీ వైద్యశాలలు మార్చాలి అని తపన ఉన్న వాళ్లు, మీమీ గ్రామాల్లో బస్టాపులు మార్చాలనుకునే వాళ్లు, అందరూ రావాలని కోరుతున్నాను. మీ సహాయంతోనే అభివృద్ధి చేసి వాటికి మీ పేరు పెడతాము. ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది. ఇద్దరమూ కలిసి మన గ్రామాలను బాగు పర్చుకుందామని అందరినీ కోరుతున్నాను. గ్రామాలను అభివృద్ధి చేయాలనుకున్న వారు, పెట్టుబడులు పెట్టాలనుకునే వారందరికీ అనుకూలంగా ఉండేలా ఒక వెబ్ పోర్టల్‌ను తెరవబోతున్నాం. ఆ పోర్టల్ నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి అనుసంధానమై ఉంటుంది. నేరుగా ఒక అధికారి దానిని పర్యవేక్షిస్తారు. ఆ పోర్టల్‌లోకి వచ్చి ఎవరైనా నేను పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నానని రిజిస్టర్ చేసినా, లేదా మా గ్రామంలో ఫలానా పనికి సాయం చేయాలనుకుంటున్నాను అని చెప్పి మీరేదైనా ఫీడ్ చేస్తే.. వెంటనే నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మా అధికారులు మీకు టచ్‌లోకి వస్తారని, మీకు అన్ని రకాలుగా సహకరిస్తారని ఇదే వేదిక నుంచి మీ అందరికీ పిలుపునిస్తున్నాను.’’ అని వైఎస్ జగన్ తన ప్రసంగం ముగించారు. ఈ సమావేశానికి అమెరికాలోని స్థానిక, జాతీయ తెలుగు సంఘాల ప్రతినిధులు, నేతలు హాజరయ్యారు.

## కొనసాగుతున్న ‘ఆరోగ్యశ్రీ’ బంద్

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఉన్నఫళంగా పేద రోగులు నిమ్స్, గాంధీ ఆసుపత్రులకు వెళ్తుండటంతో ఆయా ఆసుపత్రుల్లో రద్దీ ఏర్పడుతోంది.

**భవిష్యత్తు కార్యాచరణ...**

బకాయిల విషయంలో ప్రభుత్వం, నెట్‌వర్క్ ఆసుపత్రులు చెబుతున్న లెక్కకు పొంతన కుదరక చర్చలు ముందుకు సాగడం లేదు. సమస్య పరిష్కారానికి ఈ మూడ్రోజుల్లో అడుగు కూడా ముందుకు పడలేదు. బకాయిల వివరాలను ప్రభుత్వం పూర్తిగా అందించలేదని నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు. రెండ్రోజుల్లో మరోసారి చర్చలకు పిలుస్తామని చెప్పిన ప్రభుత్వం... ఇప్పుడు రెండు నెలల దాకా డబ్బు ఇవ్వలేమని చెబుతోందని అసోసియేషన్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. రోగులు ఇబ్బంది పడుతున్నా, సేవలు నిలిపివేసినా ప్రభుత్వం ఇలా వ్యవహరించడం సరికాదంటున్నారు. సోమవారం తమ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. ప్రభుత్వ తీరు, ప్రస్తుత పరిస్థితిపై చర్చించి సమావేశం అనంతరం కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

## రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీపై బదిలీ వేటు

- **సీనియర్ ఐఏఎస్ సోమేశ్‌కుమార్‌కు బాధ్యతల అప్పగింత**
- **పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌గా రఘునందన్‌రావు**



**రాజేశ్వర్ తివారీ**



**సోమేశ్‌కుమార్**

**సాక్షి, హైదరాబాద్:** రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీపై రాష్ట్ర ప్రభుత్వం వేటు వేసింది. ఆయన్ను రాష్ట్ర అటవీశాఖకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారి సోమేశ్‌కుమార్‌ని నియమించారు. ప్రస్తుతం కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న సోమేశ్‌కుమార్ ఇకపై రెవెన్యూశాఖ బాధ్యతలను కూడా చూడనున్నారు. దీంతోపాటు భూపరిపాలనా విభాగం ప్రధాన కమిషనర్(సీసీఎల్‌ఏ), రెరా ఇన్‌చార్జి చైర్మన్‌గా అదనపు బాధ్యతలను కూడా ఆయనకే అప్పగించారు. ఇప్పటివరకు అటవీశాఖ అదనపు బాధ్యతలు చూస్తున్న ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రాను ఆ శాఖ నుంచి రిలీవ్ చేశారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ నీతూకుమారి ప్రసాద్‌ను బదిలీ చేస్తూ.. ఆ స్థానంలో రఘునందన్‌రావును నియమించారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉంచిన నీతూ కుమారికి త్వరలోనే ప్రభుత్వం మంచి పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది. రెవెన్యూ శాఖలో అవినీతి అక్రమాలను నిర్మూలించడంతో పాటు పారదర్శకత తీసుకురావడానికి ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టానికి రూపకల్పన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అకస్మాత్తుగా ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీపై వేటు వేయడం ప్రాధన్యత సంతరించుకుంది.

## అక్టోబర్ 27 నుంచి ఢిల్లీ సర్వీసు పునఃప్రారంభం

**వెల్లడించిన ఎయిరిండియా**

**గన్నవరం:** ఎయిరిండియాకు చెందిన న్యూఢిల్లీ–హైదరాబాద్–విజయవాడ విమాన సర్వీస్ అక్టోబర్ 27 నుంచి పునఃప్రారంభం కానుంది. ఈ మేరకు ఎయిరిండియా వైబ్‌సైట్‌లో అధికారికంగా ప్రకటించి టికెట్ బుకింగ్ కూడా ప్రారంభించింది. 2011లో ఢిల్లీ నుంచి హైదరాబాద్ మీదుగా ఇక్కడికి సాయంత్రం రాకపోకలు సాగించే విధంగా ఎయిరిండియా ఈ సర్వీస్‌ను ప్రారంభించింది. ప్రయాణికుల ఆదరణ పెరగడంతో అనంతరం ఢిల్లీ–విజయవాడ మధ్య ఉదయం, రాత్రి వేళల్లో అదనంగా 2 డైరెక్ట్ విమాన సర్వీస్‌లను నడుపుతోంది. అనివార్య కారణాలతో జూన్‌లో సాయంత్రం సర్వీస్‌ను ఎయిరిండియా రద్దు చేసింది. దీనివల్ల ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు వైఎస్సార్‌సీపీ ఎంపీలు, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రితో పాటు ఎయిరిండియా సంస్థ దృష్టికి తీసుకువెళ్లి సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరారు. స్పందించిన ఎయిరిండియా రద్దు చేసిన ఆ సర్వీస్‌ను అక్టోబరు 27 నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది.

## అన్నీ ‘వెలగాలి’

▶ మొదటి పేజీ తరువాయి

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ఉండేందుకు పంపిణీ, సరఫరా వ్యవస్థలను మెరుగుపరిచాం. ప్రస్తుతం 20 వేల మెగావాట్ల విద్యుత్‌ను వాడుకోవడానికి అనుగుణమైన వ్యవస్థ సిద్ధమైంది’’అని ముఖ్యమంత్రి వివరించారు.

**పీఎఫ్‌సీ సహకారం ఎంతో ఉపయోగపడింది..**

తెలంగాణలో విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం, ఇతర విద్యుత్ సంబంధ వ్యవస్థలను తీర్చిదిద్దడానికి పీఎఫ్‌సీ అందించిన ఆర్థిక సహకారం ఎంతో దోహదపడిందని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. విద్యుత్ ప్రాజెక్టులతోపాటు రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు కూడా ఆర్థిక సహకారం అందించినందుకు పీఎఫ్‌సీ చైర్మన్ రాజీవ్‌శర్మకు ముఖ్యమంత్రి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ సంక్షోభాన్ని చాలా తక్కువ సమయంలో పరిష్కరించుకొని మిగులు విద్యుత్ రాష్ట్రం దిశగా తెలంగాణ అడుగులు వేయడానికి పీఎఫ్‌సీ అందించిన సహకారం ఎంతో దోహదపడిందన్నారు. రాజీవ్ శర్మ దంపతులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా సన్మానించి మొమెంటోలు అందించారు.

**పీఎఫ్‌సీకి గౌరవం, గర్వం: రాజీవ్ శర్మ**

తెలంగాణలో దార్శనిక ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రికార్డు సమయంలో అటు పవర్ ప్లాంట్లు, ఇటు నీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నారని పీఎఫ్‌సీ సీఎండీ రాజీవ్‌శర్మ ప్రశంసించారు. పవర్ ప్లాంట్లయినా, నీటిపారుదల ప్రాజెక్టులయినా ఇంత తొందరగా పూర్తి కావడం తానెక్కడా చూడలేదన్నారు. అనుమతులు పొందడం, నిధులను సమీకరించడం, భూసేకరణ, ఇతర రాష్ట్రాలతో ఒప్పందాల వంటి ప్రక్రియల వల్ల ప్రాజెక్టుల నిర్మాణం సాధారణంగా ఆలస్యం అవుతుందన్నారు. కానీ తెలంగాణలో మాత్రం శరవేగంగా ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతున్నదన్నారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్లాంట్లు, నీటిపారుదల ప్రాజెక్టులకు తాము అందించిన ఆర్థిక సహకారం నూటికి నూరు పాళ్లు సద్వినియోగం కావడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధిలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ భాగస్వామి కావడం తమకెంతో గౌరవంగా, గర్వంగా ఉందని రాజీవ్ శర్మ అన్నారు. ‘‘మూడున్నరేళ్ల కింద హైదరాబాద్ వచ్చినప్పుడు కేసీఆర్ మాకు కాళేశ్వరం ప్రాజెక్టు గురించి చెప్పారు. ప్రాజెక్టు ఎలా ఉండబోతుందో స్క్రీన్‌పై చూపించారు. అది విన్న నేను ఆశ్చర్యపోయా. ఇది సాధ్యమేనా అనుకున్నా. కానీ నిన్న కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి బ్యారేజీలు, పంప్‌హౌస్‌లను కళ్లారా చూశా. గోదావరి నీటిని పంపింగ్ చేసే విధానం నిజంగా అద్భుతం. మూడున్నరేళ్ల కింద కేసీఆర్ నాకు ఏం చెప్పారో, అది కళ్ల ముందు కనిపించింది. ఇలాంటి ప్రాజెక్టును ఇంత త్వరగా నిర్మించడం మాటలు చెప్పినంత తేలిక కాదు. కేసీఆర్ కృషి ఫలించింది. కల నెరవేరింది. ఇవాళ కాళేశ్వరం ప్రాజెక్టు గురించి యావత్ దేశం చెప్పుకుంటోంది. అమెరికాలోని న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో కూడా కాళేశ్వరం ప్రాజెక్టు విజయగాథను ప్రదర్శిస్తున్నారు’’అని రాజీవ్‌శర్మ అభినందించారు.

**ట్రాన్స్‌కో సీఎండీపై ప్రశంసలు...**

రాష్ట్రంలో విద్యుత్ రంగం సాధించిన విజయాల వెనుక జెన్‌కో–ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు కృషి ఎంతో ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్, పీఎఫ్‌సీ సీఎండీ రాజీవ్‌శర్మ, సీఎస్ ఎస్కే జోషి ప్రశంసించారు. విద్యుత్ రంగంలో ఎంతో అనుభవం ఉన్న ప్రభాకర్‌రావు తమకు ఆదర్శమని, ఆయన నాయకత్వంలో తెలంగాణలో విద్యుత్ రంగం ఎంతో ప్రగతి సాధించిందని రాజీవ్‌శర్మ కొనియాడారు. పవర్ ప్లాంట్లు శరవేగంగా నిర్మితమవుతున్నాయని, ప్లాంట్లలో విద్యుదుత్పత్తి (పీఎల్ఎఫ్) పెరిగిందని, ఆయనపై పెట్టిన బాధ్యతను ప్రభాకర్‌రావు పూర్తిగా నెరవేర్చారని కేసీఆర్ పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో 50 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రభాకర్‌రావు విద్యుత్ రంగంలో భీష్మాచార్యుడు అని ఎస్కే జోషి కొనియాడారు. విద్యుత్ రంగంపై పూర్తి అవగాహన కలిగిన ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో, ఆయన మార్గదర్శకత్వంలో పనిచేయడం వల్లే మంచి ఫలితాలు వచ్చాయని ప్రభాకర్‌రావు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. విద్యుత్ సంక్షోభ పరిష్కారం ఘనత అంతా ముఖ్యమంత్రిదేనన్నారు.




**ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో విజేతలకు ఆదివారం హైదరాబాద్‌లోని హోటల్ ఐటీసీ కాకతీయ గ్రాండ్‌లో జరిగిన కార్యక్రమంలో పురస్కారాలు అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, సమాచార శాఖ కమిషనర్ అరవింద్ కుమార్. పురస్కారాలు అందుకుంటున్న సాక్షి ఫొటో జర్నలిస్టులు నోముల రాజేశ్‌రెడ్డి (హైదరాబాద్), ఎ.సురేశ్‌కుమార్ (హైదరాబాద్), కంది భజరంగ్ ప్రసాద్ (నల్లగొండ), దశరథ్ రజువా (భద్రాద్రి కొత్తగూడెం), కె.సతీశ్ (సిద్దిపేట), జి.వేణుగోపాల్ (జనగామ), కొల్లోజు శివకుమార్ (యాదాద్రి), అగిరిశెట్టి సుధాకర్ (నాగర్‌కర్నూల్)**



## ఫౌంటేన్ కాదు.. గేట్‌వాల్వ్ లీకేజీ

తిరుమలాయపాలెం: ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్ మండలాలకు సాగునీరు అందించే భక్త రామదాసు ఎత్తిపోతల పథకం నీరు గేట్‌వాల్వ్ (ఇస్లావత్ తండా సుబ్లేడు గ్రామాల మధ్య) లీకేజీతో ఎగిసిపడింది. ఆదివారం కావడంతో అధికారులు అందుబాటులో లేరని, సోమవారం గేట్‌వాల్వ్‌ను పరిశీలించి లీకేజీని సరిచేస్తామని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

## పోలీస్‌స్టేషన్‌కు బేడీలు!






నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ తలుపులకు పోలీసులు తాళం బదులు బేడీలు వేశారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోలీసులు కొందరు విధులకు వెళ్లగా, స్టేషన్‌లో ఉండాల్సిన స్టాఫ్ లంచ్‌కు వెళ్లారు. దీంతో స్టేషన్‌లో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో తలుపులకు బేడీలు వేశారు.

# టెన్త్ చదవకున్నా గెజిటెడ్ పోస్టు

- దేవాదాయ శాఖలో వింత వ్యవహారం
- అధికారికంగానే జరుగుతున్న అడ్డగోలు తంతు
- విద్యార్హత లేకుండా క్లర్క్‌గా చేరే వీలు
- ఆపై ఏకంగా డిప్యూటీ కమిషనర్ స్థాయికి చేరే వెసులుబాటు
- టీఎస్‌పీఎస్సీ ద్వారా అర్హత పరీక్ష నిర్వహించాలన్న డిమాండ్ బుట్టదాఖలు
- నిబంధనలు మార్చకుండా అడ్డుపడుతున్న అక్రమార్కులు

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి పాస్ కాకున్నా గెజిటెడ్ హోదా అధికారి అయిపోయే అవకాశం ఉంటుందన్న సంగతి ఎంతమందికి తెలుసు..? నకిలీ విద్యార్హత పత్రాలు సృష్టిస్తే సాధ్యమేనేమో, కానీ అసలు ధ్రువపత్రాల అవసరమే లేకుండానే ఆ హోదా సాధ్యం. కావాలంటే ఓసారి దేవాదాయ శాఖలోకి తొంగిచూడండి.. మీకే తెలుస్తుంది. అడ్డగోలు వ్యవహారాలకు చిరునామాగా మారిన ఈ శాఖలో, విద్యార్హతలతో ప్రమేయం లేకుండా గెజిటెడ్ హోదా అధికారి కుర్చీ ఎక్కేయచ్చు. బూజు పట్టిన విధానాలు మార్చేస్తానంటూ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు కొన్ని విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ, ఈ శాఖలో మాత్రం ఈ అడ్డగోలు వ్యవహారం నిరాటంకంగా సాగిపోతోంది.

### అదెలాగంటే..

ప్రభుత్వ ఉద్యోగమనగానే మనకు టీఎస్‌పీఎస్సీ గుర్తుకొస్తుంది. కానీ దేవాదాయశాఖలోకి మాత్రం గోడ దూకేసి దర్జాగానే వెళ్లొచ్చు. దేవాలయాల్లో క్లర్క్ ఉద్యోగంతో ఈ తంతు మొదలవుతుంది. దేవాలయ పాలకమండలి సభ్యులు, ఆ శాఖలో చక్రం తిప్పే అధికారుల 'చలవ'తో విద్యార్హతల ఊసే లేకుండా తొలుత జూనియర్ అసిస్టెంట్ హోదాలో ఉద్యోగంలో చేరిపోవచ్చు. ఇది స్వయంగా ప్రభుత్వం కల్పించిన అధికారిక వెసులుబాటే. కానీ ఆ దేవాలయానికి ప్రభుత్వం కేటాయించిన పోస్టుల ప్రకారమే ఈ రిక్రూట్‌మెంట్ ఉండాలి. కానీ అధికారుల చేయి తడిపితే మాత్రం కేడర్ స్ట్రెంథ్‌తో సంబంధం లేకుండా రిక్రూట్ అయిపోవచ్చు, ఇది వేరే విషయం. ఇక నేరుగా అధికారికంగానే జూనియర్ అసిస్టెంట్ అయిన వారు దేవాలయ కార్యనిర్వహణాధికారి (ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)గా పదోన్నతి పొందే వీలుంది. గ్రేడ్ 3 ఈవోల పదోన్నతుల్లో 40 శాతం, గ్రేడ్ 2, 1 ఈవోల పదోన్నతుల్లో 20 శాతం చొప్పున వీరికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇలా కార్యనిర్వహణాధికారులు అయిన వారు సీనియారిటీ ఆధారంగా సహాయ కమిషనర్లుగా పదోన్నతి పొందే అర్హత ఉంది. గ్రేడ్ 3 ఈవోలు గ్రేడ్ 2గానా, ఆ తర్వాత గ్రేడ్ 1 ఈవోగా పదోన్నతి పొంది ఆ తర్వాత అసిస్టెంట్ కమిషనర్‌గా ప్రమోట్ కావచ్చు. గరిష్టంగా తొమ్మిది సహాయ కమిషనర్ పోస్టులను భర్తీ చేసేలా గతంలో నిబంధనలను ఆ శాఖలో పొందుపరిచారు. ఇందులో గ్రేడ్ 1 ఈవోగా ఉన్నవారు పదోన్నతి ద్వారా ఈ పోస్టులు పొందొచ్చు. అలాంటి వారికి ఈ తొమ్మిది పోస్టుల్లో నాలుగు పోస్టులు కేటాయించారు. అంటే విద్యార్హతతో సంబంధం లేకుండా గ్రేడ్ 1 ఈవో అయిన వ్యక్తి ఏకంగా సహాయ కమిషనర్ అవుతాడన్న మాట. పదవీ విరమణ సమయం ఇంకా ఉంటే, సీనియారిటీతో ఆ తర్వాత డిప్యూటీ కమిషనర్ పోస్టు కూడా పొందొచ్చు. అలా పొందిన వారు కూడా ఆ శాఖలో ఉండటం విశేషం.

- ఆ శాఖలో వివాదాస్పద అధికారిగా పేరున్న ఓ వ్యక్తి అసిస్టెంట్ కమిషనర్ హోదాలో పలు కీలక ఆలయాల్లో పనిచేశారు. ఆయన విద్యార్హత ఆరో తరగతి. ఓసారి వయసు నిర్ధారణ కోసం పదోతరగతి మెమో కోరితే, నకిలీ పత్రం సృష్టించి సమర్పించారన్న ఫిర్యాదులొచ్చాయి. దీంతో ప్రస్తుతం దానిపై విచారణ జరుగుతోంది. అంటే ఆరోతరగతి విద్యార్హతతో ఆయన ఏకంగా గెజిటెడ్ హోదా ర్యాంకు పొందేశారు.
- దేవాలయాల్లో చిరుద్యోగంలో చేరి ఆ తర్వాత సహాయ కమిషనర్ స్థాయికి వెళ్లినవారి సంఖ్య దాదాపు 60 వరకు ఉంటుందని సమాచారం. ఇందులో ఐదారుగురు డిప్యూటీ కమిషనర్లుగా కూడా పనిచేశారు.

### టీఎస్‌పీఎస్సీ ద్వారానే నియమించాలి..

కార్యనిర్వహణాధికారులు, సహాయ కమిషనర్లని నేరుగా టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేసే వెసులుబాటు ఉంది. కానీ, దేవాలయ ఉద్యోగులకు ఆ కీలక పోస్టుల్లో కూడా పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం వారికి కొన్ని పోస్టులను కేటాయించింది. అంటే కొన్ని డైరెక్ట్ రిక్రూటీస్‌తో, మరి కొన్ని దేవాలయ ఉద్యోగుల పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారన్నమాట. ఇక్కడే అసలు సమస్య నెలకొంది. దేవాలయంలో చిరుద్యోగంలో చేరేప్పుడు టీఎస్‌పీఎస్సీ నిబంధనలేవీ వర్తించవు. దీంతో విద్యార్హతతో సంబంధం లేకుండా చేరిపోతున్నారు. చాలావరకు లంచాలు ముట్టచెప్పి వచ్చేవారే ఎక్కువ. ప్రభుత్వం కల్పించిన అవకాశంతో ఏకంగా గెజిటెడ్ పోస్టుల్లోకి చేరిపోతున్నారు. పదోన్నతుల ద్వారా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, గెజిటెడ్ హోదా పోస్టుల్లోకి వెళ్లేప్పుడు టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో అర్హత పరీక్ష నిర్వహించి నియమించాలనే సూచన చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది. కనీస విద్యార్హత ఆధారంగా ఆ ఎంపిక ఉండేలా చూడాలని, లేకుంటే కనీస పరిజ్ఞానం కూడా లేనివారు అసిస్టెంట్ కమిషనర్లు, ఆపై పోస్టుల్లో చేరిపోతున్నారని చాలాకాలంగా ఫిర్యాదులొస్తున్నా పట్టించుకోవటం లేదు.

### వసూళ్లు లక్షల్లోనే..

దేవాదాయశాఖలోని కొందరు ఉన్నతాధికారులు యథేచ్ఛగా వసూళ్ల పర్వం కానిచ్చేస్తున్నారు. పదోన్నతులు, నియామకాల్లో రూ.లక్షలు వసూలు చేయటం వారికి అలవాటుగా మారింది. తాజాగా ఓ అధికారి ఒక్కో పోస్టుకు రూ.3 లక్షల వరకు వసూళ్లకు పాల్పడ్డట్టు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. పై అధికారులకు వాటా ఇవ్వాలని చెప్పి మరీ వసూళ్లు చేశారని ఫిర్యాదులు అందుతున్నాయి. నిబంధనలు మార్చకుండా వారే అడ్డుపడుతున్నారు. దేవాదాయ శాఖలో ప్రక్షాళన చేపట్టకుండా వీరు రింగ్‌గా మారి మరీ అడ్డుకుంటున్నారన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి.



ఆదివారం జెండా ఊపి 10కే రన్‌ను ప్రారంభిస్తున్న జాన్ డ్రూ గోబ్లిన్

## యూఎస్ కాన్సులేట్ ఆధ్వర్యంలో 10కే రన్

సాక్షి, హైదరాబాద్: యూఎస్ కాన్సులేట్ కార్యాలయం పదో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన 10 కే రన్ ఉత్సాహంగా సాగింది. మహిళా సాధికారతను మరింత ముందుకు తీసుకెళ్లాలనే నినాదంతో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వర్సిటీ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 6 గంటలకు యూఎస్ కాన్సులేట్ కార్యాలయం ప్రజా సంబంధాల అధికారి జాన్ డ్రూ గోబ్లిన్ జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాల వికాసానికి చెందిన విద్యార్థులతోపాటు అన్ని వయసుల వారు ఉత్సాహంగా పరుగులో పాల్గొన్నారు. మహిళల ఆరోగ్య సమస్యలు, సామాజిక అవాంతరాలపై అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జాన్ డ్రూ గోబ్లిన్ తెలిపారు.




బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డాకు గజమాలతో సత్కారం. చిత్రంలో కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు



నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బీజేపీ సభకు హాజరైన జనం

# 2023లో మేమే..

▶ మొదటి పేజీ తరువాయి

కొత్త సెక్రటేరియట్ ఎందుకని నడ్డా ప్రశ్నించారు. వాస్తు సరిగా లేదని సెక్రటేరియట్ భవనాన్ని కూల్చుతారా అని నిలదీశారు. 2023లో వాస్తు సరి అవుతుందని, సీఎం కేసీఆర్‌కు వాస్తు అంటే ఏమిటో తెలుస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కేంద్ర పథకాల నిధులను దారి మళ్లించడమే కాకుండా రాష్ట్ర పథకాలను కూడా సక్రమంగా అమలు చేయడంలేదని విమర్శించారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని వరల్డ్ హెల్త్ అసెంబ్లీ కీర్తించిందని, ఈ పథకాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేస్తామని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ చెప్పినట్టు వెల్లడించారు. అలాంటి పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని కోరితే పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. కేవలం ప్రధాని మోదీకి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే పక్కనపెట్టారని ఆరోపించారు. ఈ పథకం కింద రాష్ట్రంలో 24 లక్షల మంది అర్హులు కేసీఆర్‌కు అక్కర్లేదట అని విమర్శించారు. ఆయనకు కావాల్సిందల్లా రాజకీయాలు, కుటుంబమేనని.. ఇక్కడ ఆయనే చక్రవర్తి (శెహన్‌షా), అంతా ఆయన ఇష్టమేనని దుయ్యబట్టారు. పోనీ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని సక్రమంగా అమలు చేస్తున్నారా? అంటే అదీ లేదన్నారు. రూ.1500 కోట్ల బకాయిల కారణంగా ఆస్పత్రులు సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇదేనా కేసీఆర్ ప్రజల ఆరోగ్యం చూపిస్తున్న శ్రద్ధ అని ప్రశ్నించారు.

**బీజేపీలో వారసత్వ రాజకీయాలుండవు..**

వారసత్వ రాజకీయాలకు బీజేపీ దూరమని నడ్డా స్పష్టంచేశారు. కొడుకు కోసం.. కూతురు కోసం అనేది ఉండదని పేర్కొన్నారు. సాధారణ కార్యకర్త నుంచి మోదీ ప్రధాని అయ్యారని, అమిత్‌షా పార్టీ అధ్యక్షుడు అయ్యారని వివరించారు. కానీ దేశంలో అన్ని పార్టీల్లో కుటుంబ రాజకీయాలే కొనసాగుతున్నాయన్నారు. కేసీఆర్ కూడా అలాంటి పాలనే కొనసాగిస్తున్నారని విమర్శించారు. బీజేపీలో మాత్రమే ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. పార్టీలో చేరినవారందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని వెల్లడించారు. బీజేపీలోకి వలసలు చూసి టీఆర్‌ఎస్ కడుపు మండుతోందని ఎద్దేవా చేశారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో మునిగిపోయిందని, అందుకే పలువురు టీఆర్‌ఎస్ నేతలు సైతం బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. అడగ్గానే తెలంగాణకు ఎయిమ్స్ మంజూరు చేశామని.. తెలంగాణపై బీజేపీ అభిమానం ఏమిటో ఎయిమ్స్ చెబుతుందని వ్యాఖ్యానించారు.

**కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు..**

కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని నడ్డా విమర్శించారు. ఆర్టికల్ 370 మంచిదే అయితే దాన్ని ఎందుకు శాశ్వతం చేయలేదని ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే దానిని వాడుకుందని ఆరోపించారు. కశ్మీర్ వాసులు భారత్‌లో స్వేచ్ఛగా జీవించవచ్చని, ఎన్నికల్లో పోటీ చేయవచ్చని, కానీ భారత ప్రజలు అక్కడ కనీసం పౌరసత్వం కూడా పొందలేరని వివరించారు. అక్కడి ప్రజలకు శాంతి లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఒకే దేశం, ఒకే రాజ్యాంగం బీజేపీ విధానమని.. అందుకే అధికారంలోకి వచ్చిన 70 రోజుల్లో ఆర్టికల్ 370 రద్దు చేశామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ రద్దుతో చారిత్రక తప్పిదాన్ని సరి చేశామని పేర్కొన్నారు. భారత్ త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గల దేశంగా అవతరిస్తుందన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ నల్లా ద్వారా మంచినీరు అందిస్తామని వెల్లడించారు. ప్రధాని ఆవాస్ యోజనతో ప్రతి పేదవాడికి పక్కా ఇళ్లు నిర్మిస్తామని, ప్రతి స్వయం సహాయక బృందానికి రూ.5 లక్షల వరకు ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. సెప్టెంబర్‌లో లక్ష పోలింగ్ బూత్‌లలో పార్టీ సంస్థాగత ఎన్నికలు జరగనున్నాయని, దాంతో బీజేపీ సభ్యత్వం 17 కోట్లకు చేరుకుంటుందని నడ్డా వివరించారు.

**విమానాశ్రయంలో ఘనస్వాగతం**

అంతకుముందు జేపీ నడ్డాకు ఘన స్వాగతం లభించింది. ఆదివారం ఉదయం నగరానికి వచ్చిన ఆయనకు శంషాబాద్ విమానాశ్రయంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి భారీ ర్యాలీగా ఆయన బీజేపీ కార్యాలయానికి వెళ్లారు.

### కాళేశ్వరం పేరు అపవిత్రం చేశారు..

కేసీఆర్ మీద తాను వ్యక్తిగత ఆరోపణలు చేయదలుచుకోలేదని, కానీ కుడిచేత్తో ఇచ్చి ఎడమ చేత్తో తీసుకోవడం కేసీఆర్ నైజమని నడ్డా విమర్శించారు. కేసీఆర్ చెప్పేదొకటి.. చేసేదొకటని దుయ్యబట్టారు. ''దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని తానే పీఠం ఎక్కారు. కేబినెట్‌లో ఎస్టీకి, మహిళలకు చోటు కల్పించలేదు. కాళేశ్వరం వంటి మంచి పేరును అపవిత్రం చేశారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథను మిషన్ ఫర్ కమిషన్‌గా మార్చేశారు. రూ.30వేల కోట్లతో నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయాన్ని రూ.లక్ష కోట్లకు పెంచారు. ప్రాజెక్టుకు పవిత్రమైన పేరు పెట్టి కోట్లు దోచుకుంటున్నారు. భగీరథుడు దివి నుంచి గంగను భువికి తీసుకొస్తే ఆ పేరు పెట్టిన కేసీఆర్ మాత్రం ఇంటికి నీళ్లు ఇవ్వలేకపోయారు''అని విమర్శలు గుప్పించారు. తెలంగాణలో 3 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని నడ్డా తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు క్షేత్ర స్థాయికి చేరడంలేదని, దారి మళ్లుతున్నాయని ఆరోపించారు.

# ఉద్యమకారులు మళ్లీ కదం తొక్కాలి

- కల్వకుంట్ల కుటుంబం నుంచి తెలంగాణను విముక్తం చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పిలుపు
- భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్న గరికపాటి

సాక్షి, హైదరాబాద్: నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ఆ నలుగురిపాలు అయిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. తెలంగాణను కల్వకుంట్ల కుటుంబం నుంచి విముక్తి చేయడానికి ఉద్యమకారులు మళ్లీ కదం తొక్కాలని పిలుపునిచ్చారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో లక్ష్మణ్ ప్రసంగించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టారని, కేసీఆర్ ఏకంగా రూ.1.2 లక్షల కోట్లు అప్పులు చేశారని దుయ్యబట్టారు. భగీరథ పేరుతో రూ.40 వేల కోట్లు జేబులో వేసుకున్నారని విమర్శించారు. వారిని సమర్థిస్తే తెలంగాణవాదులు.. ప్రశ్నిస్తే తెలంగాణ ద్రోహులు, ఆంధ్రా తొత్తులుగా ముద్ర వేస్తున్నారని లక్ష్మణ్ విమర్శించారు. మతోన్మాద మజ్లిస్‌ను వెనకేసుకొస్తున్న టీఆర్‌ఎస్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని కోరారు. బీజేపీలో చేరడానికి భారీ సంఖ్యలో నేతలు, కార్యకర్తలు రావడం పెనుమార్పు అని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ అభివర్ణించారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయం అని ప్రజలు గుర్తించారన్నారు. టీడీపీ నేతలు ఉప్పెనలో బీజేపీలోకి తరలి రావడం శుభపరిణామమని ఎమ్మెల్సీ రాంచందర్ రావు పేర్కొన్నారు.

### బాబు బాగుండాలి: గరికపాటి

ఎన్టీఆర్ చూపిన అభిమానంతో టీడీపీలో చేరానని, కష్టకాలంలో పార్టీకి వెన్నంటి ఉన్నానని ఎంపీ గరికపాటి మోహన్‌రావు తెలిపారు. అయితే, తెలంగాణ వచ్చాక పరిస్థితి మారిపోయిందన్నారు. ''తెలంగాణలో టీడీపీని ఉంచాలా.. రద్దు చేయాలా? అనే పరిస్థితి వచ్చింది. పార్టీ కోసం పనిచేసిన వారికి టికెట్లను నిరాకరించారు. తెలంగాణలో టీడీపీకి బలం ఉన్నా పోటీకి నిలబెట్టకుండా పార్టీని నిర్వీర్యం చేశారు. ఈ పరిస్థితికి చంద్రబాబును ఏమీ అనడంలేదు. ఆయన బాగుండాలని కోరుకుంటున్నాను''అని పేర్కొన్నారు. 37 ఏళ్లు పనిచేసిన టీడీపీని బాధతోనే వీడుతున్నామని తెలిపారు. తల్లి లాంటి పార్టీని వదులుకొని, మనసు రాయి చేసుకొని టీడీపీకి రాజీనామా చేసి బీజేపీలో చేరాలని వచ్చానంటూ భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సభలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డితోపాటు పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

### బీజేపీలో చేరిన కొందరు టీడీపీ నేతలు వీరే...

గరికపాటి మోహన్‌రావు–రాజ్యసభ సభ్యుడు, శోభారాణి–తెలుగు మహిళ అధ్యక్షురాలు, దీపక్‌రెడ్డి–టీడీపీ జనరల్ సెక్రటరీ, ఈగ మల్లేశం–వరంగల్ రూరల్ అధ్యక్షుడు, రజనీకుమారి–తుంగతుర్తి ఇన్‌చార్జి, పోరిక జగన్ నాయక్–మాజీ మంత్రి, ఎర్ర శేఖర్–మాజీ ఎమ్మెల్యే, మొవ్వ సత్యనారాయణ–శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి, ముజఫర్–మలక్‌పేట్ టీడీపీ ఇన్‌చార్జి, సామ రంగారెడ్డి–రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, కోనేరు చిన్ని–కొత్తగూడం జిల్లా అధ్యక్షుడు, శ్రీకాంత్ గౌడ్–పఠాన్ చెరు ఇన్‌చార్జి, బోట్ల శ్రీనివాస్–జనగామ జిల్లా అధ్యక్షుడు, రాజ్యవర్ధన్‌రెడ్డి–కాంగ్రెస్ నేత, శ్రీనివాస్‌గౌడ్–నల్లగొండ ఇన్‌చార్జ్, అంజయ్య యాదవ్–నాగార్జున సాగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి, సాధినేని శ్రీనివాస్–మిర్యాలగూడ అసెంబ్లీ ఇన్‌చార్జి, శ్రీకళారెడ్డి–కోదాడ నేత, ఓం ప్రకాష్–మాజీ తెలుగు విద్యార్థి నేత, బాబురావునాయక్–టీడీపీ ఎస్టీ సెల్, విజయ్‌పాల్‌రెడ్డి–మాజీ ఎమ్మెల్యే నారాయణ ఖేడ్, ఉపేందర్–కాంగ్రెస్ నేత, సత్యం–మంచిర్యాల టీడీపీ అధ్యక్షుడు, రఘునాథ్‌రెడ్డి–భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు, రామ్‌రెడ్డి–సూర్యాపేట ఇన్‌చార్జి, జయశ్రీ–టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి.

## ప్రణాళిక సంఘం అధ్యక్షుడికి అభినందనలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన బి.వినోద్‌కుమార్‌ను తెలంగాణ డిగ్రీ కాలేజీల యాజమాన్యాల సంఘం అభినందించింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఆయనను సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాశ్, పరమేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## 'ఎక్కువ సభ్యత్వం చేయించిన వారికే సీట్లు'

సాక్షి, హైదరాబాద్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఎక్కువ సభ్యత్వం చేయించిన వారికే మున్సిపల్ ఎన్నికల్లో సీట్లు ఇస్తామని బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నట్లు తెలిసింది. ఆదివారం రాత్రి జరిగిన బీజేపీ కోర్ కమిటీ, పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ప్రతి 15 రోజులకు ఒక కేంద్ర మంత్రి పర్యటన ఉంటుందని, ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. వారం రోజుల కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి 15 రోజులకోసారి కోర్ కమిటీ సమావేశం జరపాలని స్పష్టంచేశారు. ప్రభుత్వ అవినీతి, నాణ్యత లేని, పెండింగ్‌లో ఉన్న పనులపై ఆందోళనలు చేపట్టాలని సూచించారు. అదే సమయంలో కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో గెలిచేలా ప్రణాళికలు రూపొందించాలని నిర్దేశించారు.

## చిలుకూరు రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్‌లో హరితహారం

సాక్షి, హైదరాబాద్: చిలుకూరు రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్‌లో ఫీనిక్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. 150 ఎకరాల్లో 10 వేల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, పీసీసీఎఫ్ శోభ, సెక్యూరిటీ వింగ్ ఐజీ ఎంకే సింగ్, టీఎస్ఐఐసీ ఎండీ నరసింహారెడ్డి, అటవీ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.






# ఖజానాకు ఖ'నిజ'కళ!

| ఖనిజాధార పరిశ్రమ/ అవకాశం | ఉన్న జిల్లా |
|---|---|
| సిమెంట్, మిశ్రమ లోహాలు, స్టోన్ క్రషింగ్ | ఆదిలాబాద్ |
| స్పాంజ్ ఐరన్, థర్మల్ పవర్, స్టోన్ క్రషింగ్, పల్వరైజింగ్ | భద్రాద్రి కొత్తగూడెం |
| గ్రానైట్ కటింగ్, పాలీషింగ్, స్టోన్ క్రషింగ్ | జగిత్యాల, జనగామ, కామారెడ్డి, కరీంనగర్ మహబూబాబాద్, సిరిసిల్ల, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, భువనగిరి |
| థర్మల్ పవర్, ఫ్లైయాష్, స్టోన్ క్రషింగ్ | భూపాలపల్లి, మంచిర్యాల |
| స్టోన్ క్రషింగ్, రసాయన | ములుగు |
| స్టోన్ క్రషింగ్, పల్వరైజింగ్, | కామారెడ్డి, |
| గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ | నిజామాబాద్, జోగులాంబ గద్వాల |
| థర్మల్ పవర్, ఫ్లైయాష్, సిరామిక్, స్టోన్ క్రషింగ్ | ఖమ్మం, కొమరంభీం |

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో మైనింగ్ రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, రాష్ట్ర ఖజానాకు ఖనిజాదాయాన్ని పెంచేందుకు గనులు, భూగర్భ వనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జిల్లాల వారీగా లభ్యమయ్యే ఖనిజాలతో పాటు, ఆయా జిల్లాల్లో ఖనిజాధార పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై నివేదిక రూపొందించింది. మైనింగ్ సంబంధించి బొగ్గు, సున్నపురాయి భారీ మెకనైజ్డ్ సెక్టార్ కింద ఉండగా.. గ్రానైట్, డోలమైట్, క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్, బెరైటీస్ తదితరాలు మీడియం సెమీ మెకనైజ్డ్ కేటగిరీలో ఉన్నాయి. సెమీ మెకనైజ్డ్ స్మాల్ సెక్టార్ కింద ఇతర ఖనిజ వనరులు ఉండగా, రాష్ట్రంలోని ఖనిజాల్లో 90 శాతం ఇదే కేటగిరీకి చెందినవి కావడం గమనార్హం.

**జిల్లాల వారీగా ఖనిజాల లభ్యతపై గనుల శాఖ అధ్యయనం**

**ఖనిజాధార పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై నివేదిక**

సిమెంట్, స్టీల్, స్పాంజ్ ఐరన్, మిశ్రమ లోహాలు, గ్లాస్, పింగాణి, రసాయన, గ్రానైట్, మార్బుల్, సున్నపురాయి వంటి ఖనిజాధార పరిశ్రమలు రాష్ట్రంలో పబ్లిక్, ప్రైవేటు రంగంలో ఉన్నాయి. రాష్ట్రంలో గ్రానైట్ పాలిషర్, స్టోన్ క్రషింగ్, నేపా స్లాబ్, ఇటుకల తయారీ, రెడీమిక్స్ కాంక్రీట్ పరిశ్రమలు అత్యధికంగా ఉన్నాయి. వీటితో పాటు సిమెంట్, స్పాంజ్ ఐరన్, క్వార్ట్జ్ పల్వరైజింగ్, ఇసుక తయారీ, థర్మల్ యూనిట్లు కూడా ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. బొగ్గు, ముడి ఇనుము, డైమండ్, డోలమైట్, యురేనియం, సున్నపురాయి వంటి ఖనిజాధార పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. సిమెంట్, గ్రానైట్ కటింగ్, పాలిషింగ్, స్టీల్, స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు మైనింగ్ రంగంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని గనుల శాఖ అంచనా వేస్తోంది.

| మొత్తం పరిశ్రమలు | గ్రానైట్ పాలిషర్ | స్టోన్ క్రషింగ్ | నేపా స్లాబ్ | ఇటుకల తయారీ | రెడీమిక్స్ కాంక్రీట్ |
|---|---|---|---|---|---|
| 2025 | 723 | 463 | 183 | 234 | 125 |

రాష్ట్రంలో ప్రస్తుతం బొగ్గు, సున్నపురాయి, మాంగనీసు వంటి ప్రధాన ఖనిజాలతో పాటు, డోలమైట్, ఫెల్డ్‌స్పార్, క్వార్ట్జ్ వంటి మైనర్ మినరల్స్, బ్లాక్, కలర్ గ్రానైట్, లైమ్‌స్టోన్ స్లాబ్ వంటివి ప్రధానంగా ఆదాయాన్ని చేకూరుస్తున్నాయి. ప్రస్తుతం 37 మిలియన్ టన్నుల పారిశ్రామిక ఖనిజాలు, 67.68

**బొగ్గు, సున్నపురాయిదే అగ్రస్థానం...**

మిలియన్ టన్నుల బొగ్గు, 206 మిలియన్ క్యూబిక్ మీటర్ల భవన నిర్మాణ సామగ్రి ఉత్పత్తి అవుతోంది. ఖనిజాల లభ్యత, డిమాండు ఎక్కువగా ఉన్న ఖనిజాల వెలికితీతతో పాటు, సంబంధిత పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేయాలని గనులు, భూగర్భ వనరుల శాఖ ప్రభుత్వానికి సిఫారసు చేస్తోంది.

| ఖనిజాధార పరిశ్రమ/ అవకాశం | ఉన్న జిల్లా |
|---|---|
| ఇసుక తయారీ, స్టోన్ క్రషింగ్, గ్లాస్, గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ | సిద్దిపేట, నారాయణపేట, మహబూబ్‌నగర్ |
| ఇసుక తయారీ, గ్లాస్, పల్వరైజింగ్, స్టోన్ క్రషింగ్ | మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్‌కర్నూలు |
| సిమెంట్, ఇసుక, గ్లాస్,స్టోన్ క్రషింగ్ | నల్లగొండ |
| స్టోన్ క్రషింగ్ | నిర్మల్ |
| థర్మల్, ఫ్లైయాష్, సిమెంట్, సిరామిక్, స్టోన్ క్రషింగ్ | పెద్దపల్లి |
| సిరామిక్, గ్రానైట్ కటింగ్, పాలిషింగ్, స్టోన్ క్రషింగ్, పల్వరైజింగ్ | రంగారెడ్డి, సంగారెడ్డి |
| సిమెంట్, సున్నపురాయి, గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ | సూర్యాపేట |
| సిమెంట్, సున్నపురాయి, గ్రానైట్ కటింగ్, క్వార్ట్జ్, పాలిషింగ్, ఫెల్డ్‌స్పార్ పల్వరైజింగ్ | వికారాబాద్ |
| క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్ పల్వరైజింగ్, ఇసుక, స్టోన్ క్రషింగ్ | వనపర్తి |

## క్లుప్తంగా...

### రేపు కలెక్టర్లతో సీఎం సమావేశం!

**కొత్త రెవెన్యూ చట్టం తయారీపై అభిప్రాయాల సేకరణ**



**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం(20వ తేదీ) ప్రగతి భవన్‌లో జిల్లాల కలెక్టర్లతో సమావేశం కానున్నారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మంత్రులను ఆహ్వానించారు. కొత్త రెవెన్యూ చట్టం తీసుకురావాలని నిర్ణయించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో భూపరిపాలనలో ప్రత్యక్ష సంబంధం కలిగిన కలెక్టర్ల అభిప్రాయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. అవినీతికి ఆస్కారం లేని, ప్రజలు, రైతులకు ఇబ్బంది కలగని రీతిలో చట్టం ఉండాలంటే ఎలాంటి నిబంధనలు రూపొందించాలనే అంశంపై సమావేశంలో విస్తృతంగా చర్చిస్తారు. క్షేత్రస్థాయిలో తమ అనుభవంలో ఉన్న విషయాలను, కొత్త చట్టం రూపకల్పనలో సూచనలను కలెక్టర్లందరి నుంచి తీసుకోవాలని సీఎం నిర్ణయించారు. ఇందుకోసం కలెక్టర్లు కూడా అభిప్రాయాలు, సూచనలు చెప్పడానికి, చర్చలో భాగస్వామ్యం కావడానికి సిద్ధమై రావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కొత్త మున్సిపల్ చట్టం, కొత్త పంచాయతీ రాజ్ చట్టం అమలుతో పాటు పల్లెలు, పట్టణాల్లో అమలు చేయబోయే 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపైనా చర్చిస్తారు. మూడు విషయాలపై లోతైన చర్చ జరగాల్సి ఉన్నందున సమావేశం 2 రోజుల పాటు కొనసాగే అవకాశముంది.

### ఎంపీల పనితీరు భేష్

**ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్**



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ సమస్యలపై లోక్‌సభలో గళం విప్పుతున్న టీఆర్‌ఎస్ ఎంపీల పనితీరును తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్ ప్రశంసించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన వినోద్ కుమార్‌ను టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నాయకులు పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేష్ నేత, నామా నాగేశ్వరరావులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ఎంపీలు రాష్ట్ర సమస్యలు, రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, విభజన చట్టం హామీలను ఎప్పటికప్పుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నారని అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్‌ను రాష్ట్ర శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు ఆయన నివాసంలో కలసి అభినందనలు తెలిపారు.

### 'వారంతా అభద్రతా భావంతోనే వెళ్లారు..'

**టీడీపీ అధికార ప్రతినిధి అయిలయ్య**

**సాక్షి, హైదరాబాద్:** తెలుగుదేశం పార్టీ నాయకులు తమ రాజకీయ భవిష్యత్తుపై భయం, అభద్రతా భావంతోనే పార్టీని వీడి వెళుతున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కిలి అయిలయ్య యాదవ్ విమర్శించారు. టీడీపీకి ఇలాంటి సంక్షోభాలు కొత్త కాదని, కార్యకర్తలే నాయకులవుతారని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీని వీడి నేతలు మాత్రమే వెళ్లారని, కార్యకర్తలంతా పార్టీలోనే ఉన్నారని, కార్యకర్తలు పదవుల కంటే పార్టీ కోసమే త్యాగాలు చేస్తున్నారని తెలిపారు.

# భర్తీలు ఎన్ని... ఖాళీలెన్ని?

- గురుకులాల సీట్లపై అయోమయం
- ఐదు సొసైటీల పరిధిలో ఐదో తరగతిలో 64వేల సీట్లు
- సొసైటీల వారీగా భర్తీ అయిన, ఖాళీల వివరాలపై స్పష్టత కరువు
- టీజీసెట్ నిర్వహణతో సరిపెట్టుకున్న కన్వీనర్

**సొసైటీల వారీగా స్కూళ్లు, ఐదోతరగతిలో సీట్ల వివరాలు**

| గురుకుల సొసైటీ పేరు | పాఠశాలలు | సీట్లు |
|---|---|---|
| టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ | 232 | 18,560 |
| టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ | 85 | 5,900 |
| ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ | 261 | 20,480 |
| టీఆర్‌ఈఐఎస్ | 35 | 2,800 |
| టీఎండబ్ల్యూఆర్‌ఈఐఎస్ | 206 | 16,400 |

**సాక్షి, హైదరాబాద్:** సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి సీట్ల భర్తీ ప్రక్రియపై అయోమయం నెలకొంది. సొసైటీల వారీగా ఉన్న గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ఎన్ని సీట్లు, భర్తీ అయ్యాయి.. ఎన్ని ఖాళీగా ఉన్నాయనే దానిపై స్పష్టత కరువైంది. దీంతో అడ్మిషన్లు కావాలని పలువురు విద్యార్థులు గురుకుల సొసైటీ కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతుండగా, సీట్లు నిండిపోయాయని అధికారులు బోర్డులు ప్రదర్శిస్తున్నారు. కానీ వాస్తవ సీట్లు, భర్తీ అయినవెన్ని అనే అంశంపై మాత్రం దాటవేత ధోరణి ప్రదర్శిస్తుండడంతో తల్లిదండ్రులు కార్యాలయాల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకుల సొసైటీల పరిధిలో 819 పాఠశాలలున్నాయి. వీటి పరిధిలో ఐదో తరగతిలో 64,140 సీట్లున్నాయి. ఈ సీట్ల భర్తీకి ఈ ఏడాది మేలో తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2019 నిర్వహించారు. ఈ సెట్ ఫలితాలను విడుదల చేసిన కన్వీనర్, సీట్ల భర్తీని ఉమ్మడిగా కాకుండా సొసైటీల ద్వారానే భర్తీ చేసుకోవాలని సూచించారు. దీంతో ఆయా సొసైటీల పరిధిలోని సీట్లను సొసైటీ కార్యదర్శులు భర్తీ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఎన్ని సీట్లు భర్తీ చేశారనే వివరాలను సొసైటీ అధికారులు ఎక్కడా ప్రదర్శించలేదు. ఉన్న సీట్లన్నీ భర్తీ అయ్యాయని కార్యాలయాల్లో ఫ్లెక్సీలు ప్రదర్శించడం తప్ప స్పష్టమైన గణాంకాలేవీ అక్కడ పేర్కొనలేదు.

**ఆన్‌లైన్‌లో స్పష్టతేది?**

ఐదో తరగతిలో అడ్మిషన్ల కోసం నిత్యం కన్వీనర్ కార్యాలయం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు పడిగాపులు కాస్తున్నారు. సీట్ల భర్తీ ప్రక్రియ పూర్తయిందని చెబుతున్నప్పటికీ వారంతా ప్రతి రోజు సొసైటీ కార్యాలయాలకు వచ్చి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. విద్యార్థులు చేరకుండా ఖాళీగా ఉన్న వాటితో సర్దుబాటు చేయాలని కోరుతుండడంతో సంబంధిత అధికారులు వినతులపై సంతకాలు చేసి సంబంధిత జిల్లా కోఆర్డినేటర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. వాస్తవానికి టీజీసెట్ నిర్వహణ అంతా ఆన్‌లైన్‌లోనే జరిగింది. దరఖాస్తుల స్వీకరణ మొదలు ఫలితాల విడుదల, సీట్ల కేటాయింపు అంతా ఆన్‌లైన్‌లోనే చేపట్టారు. అదేవిధంగా సీట్లు పొందిన విద్యార్థులకు ప్రత్యేక తేదీని నిర్దేశించి ఆలోపు పాఠశాలలో రిపోర్టు చేయాలని స్పష్టం చేశారు. అలా రిపోర్టు చేసిన విద్యార్థి వివరాలను సదరు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలి. అలా చేస్తే సీటు భర్తీ అయ్యిందా? కాలేదా? అనే అంశాన్ని ప్రజలంతా చూసుకునే వీలుంటుంది. ఖాళీ ఉంటే దాన్ని మెరిట్ పద్ధతిలో భర్తీ చేసే అవకాశం ఉంటుంది. కానీ సీట్ల భర్తీ, ఖాళీల వివరాలను గురుకుల సొసైటీలు బహిర్గతం చేయడం లేదు. మరోవైపు టీజీసెట్ కన్వీనర్ కార్యాలయ అధికారుల వద్ద కూడా సీట్ల భర్తీ, ఖాళీల వివరాలు అందుబాటులో లేవని, సొసైటీ కార్యదర్శులు వివరాలు పంపలేదని సమాధానం చెబుతున్నారు. ఇటీవల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలోనూ ఈ వివరాలు సమర్పించాలని మంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు. కానీ వీటిపై స్పష్టత లేకపోవడంతోనే అడ్మిషన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నట్లు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

# గ్రీన్‌చాలెంజ్ @ రెండు కోట్లు

- గతేడాది కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ సంతోష్
- రెండు కోట్లకు చేరడంతో మరోసారి మొక్క నాటి సెల్ఫీ



**సాక్షి, హైదరాబాద్:** 'హరా హై తో భరా హై'(పచ్చగా ఉంటే నిండుగా ఉంటుంది) అంటూ గతేడాది మొదలైన గ్రీన్ చాలెంజ్ రెండు కోట్ల మొక్కలు నాటే దాకా చేరుకుంది. ఒకరు మొక్క నాటి మరో ముగ్గురు మొక్కలు నాటి, సంరక్షించేలా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. రాజ్యసభ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ దీనిని ప్రారంభించారు. తాను స్వయంగా మొక్క నాటి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గవర్నర్ నరసింహన్, నటుడు నాగార్జునను నామినేట్ చేశారు. వారందరూ కూడా మొక్కలు నాటారు. ఇలా ఏడాది పాటు ఈ కార్యక్రమం కొనసాగింది. ప్రముఖులతో పాటు సామాన్యులూ ఇందులో భాగస్వాములయ్యారు. మొక్కలు నాటి, సెల్ఫీ దిగి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మధ్యలో లక్ష్యం ఒక కోటికి చేరినప్పుడు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మొక్కను నాటారు. ఈ లక్ష్యం ఆదివారం నాటికి రెండు కోట్లకు చేరటంతో మరోసారి ఎంపీ సంతోష్ మొక్క నాటారు. గతేడాది తాను నాటిన మొక్క ఏపుగా పెరగటంతో మరోసారి సెల్ఫీ దిగి ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కరుణాకర్‌రెడ్డి, రాఘవ పాల్గొన్నారు.

**మరో నలుగురికి గ్రీన్ చాలెంజ్..**

మరో నలుగురికి ఎంపీ సంతోష్ గ్రీన్ చాలెంజ్ విసిరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, సినీనటుడు అఖిల్ అక్కినేని, జీఎమ్మార్ అధినేత మల్లికార్జున్ రావులను మొక్కలు నాటాల్సిందిగా కోరారు. తెలంగాణకు హరితహారం స్ఫూర్తితో ఇగ్నయిటెడ్ మైండ్స్ అనే స్వచ్ఛంద సంస్థ గ్రీన్ ఛాలెంజ్‌ను చేపట్టింది.

# సామాజిక విప్లవకారుడు పాపన్న

**మంత్రి శ్రీనివాస్ గౌడ్**

**హైదరాబాద్:** సర్దార్ సర్వాయి పాపన్న గొప్ప సామాజిక విప్లవకారుడని ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. చిక్కడపల్లిలో ఆదివారం తెలంగాణ గౌడ కల్లు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న 369వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్యానికి సవాలుగా నిలిచి గోల్కొండ కోటపై తెలుగు జెండాను ఎగురవేసిన వీరుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో గౌడలు తమ హక్కుల సాధనకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్ మాట్లాడుతూ.. బీసీలు బడుగులు, బలహీన వర్గాల వారు కాదని, బలమైన వర్గమన్నారు. తెలంగాణ ఉద్యమంలో గౌడలు తాటిచెట్టు ఎక్కి తెలంగాణకు జైకొట్టారని గుర్తుచేశారు. బీసీలంతా ఏకమైతే గొప్ప విప్లవం వస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించటంతో పాటు ట్యాంక్‌బండ్‌పై విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని, జనగామ జిల్లాకు పాపన్న పేరును పెడుతామని చెప్పారు. పాపన్న చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని కోరారు. అంతకుముందు వీరంతా పాపన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సమన్వయ కమిటీ కన్వీనర్ వెంకన్నగౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి మురళీధర్‌రావు, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయులు గౌడ్, సమన్వయ కమిటీ చైర్మన్ బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తదితరులు

# టీఆర్‌ఎస్ అక్రమాలపై అమిత్ షాను కలుస్తా

- ఆరేళ్లుగా కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల్నే ఇప్పుడు బీజేపీ చేస్తోంది: భట్టి
- దమ్ముంటే టీఆర్‌ఎస్ అక్రమాలపై విచారణ జరిపించాలి
- తొలినుంచీ పార్లమెంట్‌లో బీజేపీకి టీఆర్‌ఎస్ సహకరిస్తుంది వాస్తవం కాదా?



**సాక్షి,హైదరాబాద్:** తెలంగాణలో టీఆర్‌ఎస్ చేస్తోన్న అక్రమాలపై తర్వలోనే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలసి వివరిస్తానని కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ)నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బీజేపీ నేతలకు దమ్ముంటే తెలంగాణలో జరుగుతున్న టీఆర్‌ఎస్ అక్రమాలపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న స్కీములన్నీ స్కాములేనని కాంగ్రెస్ ఆరేళ్లుగా చెబుతూనే ఉందన్నారు. అప్పుడు పట్టీపట్టనట్టు వ్యవహరించిన బీజేపీ ఇప్పుడు కాంగ్రెస్ ఆరోపణల్నే వల్లె వేస్తోందన్నారు. కాంగ్రెస్‌ను టీఆర్‌ఎస్ తోకపార్టీ అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై భట్టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి పార్లమెంట్‌లో మొదటినుంచి టీఆర్‌ఎస్ సహకరిస్తుండటం వాస్తవా కాదా అన్ని ప్రశ్నించారు. ఒకరినొకరు సహకరించుకుంటున్న కారణంగానే టీఆర్‌ఎస్ చేస్తోన్న అక్రమాలను బీజేపీ పట్టించుకోవడం లేదని, అలాగే టీఆర్‌ఎస్ కూడా బీజేపీ ప్రభుత్వం చేసిన అన్ని పనులకు మద్దతిచ్చిందని గుర్తుచేశారు.

**స్కీములన్నీ స్కాములే**

కాళేశ్వరం, మిషన్ భగీరథ, సీతారామ ప్రాజెక్ట్, పాలమూరు – రంగారెడ్డి సహా రీ డిజైనింగ్ ప్రాజెక్టులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని భట్టి డిమాండ్ చేశారు. రీ డిజైనింగ్ చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు అతి పెద్ద స్కామన్నారు. శ్రీపాద ఎల్లంపల్లికి పంప్‌చేసిన నీటికంటే ఎక్కువ జలాలను కిందికి వదిలేశారని, దీనివల్ల ఖజానాకు లాభమో, నష్టమో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. రూ. లక్షకోట్ల కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక సూత్రధారుని ద్వారా టెండర్లు వేసి పనులు చేయించారని భట్టి ఆరోపించారు. రూ. 55 వేల కోట్ల మిసన్ భగీరథ టెండర్లు కూడా అలాగే జరిగాయని తెలిపారు. రాష్ట్ర నిధులను ఒక కుటుంబ దోపిడీ చేస్తోందని ఆరోపించారు. ప్రతీ టెండర్లో ఎల్1, ఎల్2, ఎల్3 లే పాల్గొన్నాయని, వాటికే పనులు దక్కాయని చెప్పారు. వీటి మీద విచారణ జరిపించేలా కేంద్రంపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఒత్తిడి తెచ్చే దమ్ముందా అని ప్రశ్నించారు. ఏ పార్టీలో, ఎక్కడా అవకాశం లేని నాయకులనే బీజేపీ చేర్చుకుంటోందని, క్షేత్రస్థాయిలో పట్టులేకనే ఇతర పార్టీల నేతలను చేర్చుకుంటోందని భట్టి ఎద్దేవా చేశారు.

# ఎస్సారెస్పీ రైతుల ఎదురుచూపులు!

- ఎగువ నుంచి ప్రవాహాలు నిల్.. ప్రాజెక్టులో ప్రస్తుతం 17.18 టీఎంసీల నీరు
- కాళేశ్వరం నీటిపైనే ఆశలు.. ఈ వారం నుంచి రివర్స్ పంపింగ్!

**సాక్షి, హైదరాబాద్:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టు(ఎస్సారెస్పీ) ఆయకట్టు రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు. ఎస్సారెస్పీకి ఎగువ నుంచి ప్రవాహాల్లేక నిల్వలు పెరగలేదు. ఖరీఫ్ ఆరంభమై 3 నెలలు కావస్తున్నా ఆయకట్టు సాగుపై సందిగ్ధత వీడటంలేదు. ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా కాళేశ్వరం జలాలను తరలిస్తారని తెలుస్తున్నా, ఎంత ఆయకట్టుకు నీరందుతుందన్న దానిపై స్పష్టత లేదు. దీంతో ఆయకట్టు రైతులంతా ప్రభుత్వనిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. కాళేశ్వరం జలాలు మిడ్‌మానేరుకు చేరినా, వాటిని దిగువ మానేరుకు పంపాలా? మానేరు దిగువ ప్యాకేజీలకు మళ్లించాలా? వరదకాల్వ ద్వారా రివర్స్ పంపింగ్‌ను మొదలు పెట్టాలా? అన్న దానిపై స్పష్టతవస్తే కానీ ఆయకట్టుకు నీటి సరఫరాపై తేలేలా లేదు.

**ఎగువ నుంచి కరువు.. దిగువ నుంచే ఆదరువు..**

ఎస్సారెస్పీ స్టేజ్–1 కింద 9.68 లక్షలు, స్టేజ్–2 కింద మరో 4 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికింద ఉన్న కాకతీయ, సరస్వతి, లక్ష్మీ కాల్వల ద్వారా నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్లగొండ జిల్లాల రైతాంగానికి ప్రయోజనం చేకూరుతోంది. అయితే, గడిచిన కొన్నేళ్లుగా ఎగువ నుంచి ఎస్సారెస్పీకి వరద తగ్గడంతో ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందడం లేదు. ఈ ఏడాది సైతం అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. 90 టీఎంసీల నిల్వలకుగానూ ప్రస్తుతం ఎస్సారెస్పీలో 17.18 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఈ సీజన్లో 12 టీఎంసీల మేర కొత్త నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం ఎగువ నుంచి ఎలాంటి ప్రవాహాలు లేవు. మళ్లీ ఎప్పుడు వస్తాయో తెలియదు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు కిందికి నీటి విడుదలపై ఎలాంటి నిర్ణయం జరగలేదు. మరో 15 టీఎంసీల మేర నీరొస్తేనే కనీసం చివరి తడులకైనా సాగునీటిని అందించే అవకాశం ఉంది. లేనిపక్షంలో ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకంపైనే పూర్తిగా ఆధారపడాల్సి ఉంది. మిడ్‌మానేరు ఎగువన ఉన్న ప్యాకేజీ–8లోని రెండు మోటార్ల ద్వారా 7 వేల క్యూసెక్కుల మేర నీటిని మిడ్‌మానేరుకు పంపింగ్ చేస్తున్నారు. సోమవారం నుంచి మూడో పంప్‌ను ఆరంభించనున్నారు. ఇప్పటివరకు మిడ్‌మానేరుకు 2 టీఎంసీల మేర నీటిని తరలించగా అక్కడ నిల్వలు 5.3 టీఎంసీలకు చేరాయి. ఇక్కడి నుంచి గ్రావిటీ ద్వారా రెండ్రోజుల కింద లోయర్ మానేరుకు నీటి విడుదల చేసినా, దాన్ని నిలిపివేశారు. ఎల్‌ఎండీ కింద మొత్తంగా స్టేజ్–1, స్టేజ్–2 పరిధిలో ఉన్న 7.70 లక్షల ఎకరాలకు ముమ్మందు నీటి విడుదల ఉంటుందా? ఉండదా? అన్నది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

**రివర్స్ పంపింగ్‌కు నాలుగేసి మోటార్లు సిద్ధం**

వరద కాల్వ నుంచి ఎస్సారెస్పీకి రివర్స్ పంపింగ్ చేసేందుకు ఇప్పటికే రెండు పంప్‌హౌస్‌లలో నాలుగేసి మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. ఈ నీటిపై ఆధారపడి వరదకాల్వ పరిధిలోని 40 చెరువులు నింపే అవకాశముంది. దీంతోపాటే నీటిని ఎస్సారెస్పీకి పంపాక మళ్లీ కాకతీయ కాల్వ ద్వారా నీటి విడుదల జరిగితే లోయర్ మానేరుకు పైన ఉన్న మరో 4.62 లక్షల ఎకరాలకు నీళ్లందించే అవకాశం ఉంది. ఎస్సారెస్పీ ఆయకట్టుకు నీటివిడుదలపై ఎలాంటి ప్రకటన రాకున్నా ఆయకట్టులో ఇప్పటికే నార్లు పోసుకున్నారు. ప్రత్యామ్నాయ వనరులున్నచోట, వాగుల పక్కన బోర్లున్నచోట నాట్లు వేశారు. రివర్స్ పంపింగ్ మొదలైతే చివరి తడులకైనా నీటిని అందించే అవకాశం ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొనే ఈ వారంలోనే పునరుజ్జీవ పంపులను ఆరంభించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

● ఆగని నిరసనలు



హాంకాంగ్‌లోని విక్టోరియా పార్కులో సమావేశమైన ప్రజాస్వామ్య అనుకూల వాదులు. జోరున వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా సుమారు 17 లక్షల మంది పాల్గొన్న ఈ ర్యాలీ శాంతియుతంగా సాగిందని నిర్వాహకులు తెలిపారు.

# ఇక పీవోకేపైనే చర్చలు: రాజ్‌నాథ్

**కల్కా/జమ్మూ:** ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం మాని, వారిపై చర్యలు తీసుకుంటేనే పాకిస్తాన్‌తో చర్చలుంటాయని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆ చర్చలు కూడా పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) అంశంపై మాత్రమేనన్నారు. అలాగే, పీవోకే కూడా భారత్‌లో అంతర్భాగం కావాలంటూ మరో మంత్రి జితేంద్ర సింగ్ ఆకాంక్షించారు. హరియాణాలోని కల్కాలో ఆదివారం రాజ్‌నాథ్ బీజేపీ జన్ ఆశీర్వాద్‌యాత్రను ప్రారంభించి, ప్రసంగించారు. 'పాక్‌తో చర్చలంటూ జరిగితే అది పీవోకేనే తప్ప మరే అంశంపైనా కాదు. ఆర్టికల్ 370 రద్దుతో పాకిస్తాన్ భయపడింది. ఆ దేశానికి అది చాలా త్రీవమైన అంశం. అందుకే ప్రతి దేశం గుమ్మం తడుతూ సాయం ఆర్థిస్తోంది. మనల్ని భయ పెట్టాలని చూస్తోంది. అయితే, అగ్రరాజ్యం అమెరికా కూడా చర్చల ద్వారానే పరిష్కరించుకోండని సలహా ఇవ్వడంతో దిక్కులు చూస్తోంది' అని అన్నారు. 'ఏ అంశంపై అయినా మనం పాక్‌తో ఎందుకు మాట్లాడాలి? అసలు చర్చలు ఎందుకు జరపాలి? ఒకవేళ చర్చలు జరపాలంటే ముందుగా ఆ దేశం ఉగ్రవాదులకు మద్దతు, ఆశ్రయం ఇవ్వడం మానేయాలి' అని పేర్కొన్నారు. 'ఉగ్రవాదాన్ని ఎగదోయడం ద్వారా భారత్‌ను బలహీనపర్చాలని, ముక్కలు చేయాలని పాక్ కుట్ర పన్నుతోంది. పుల్వామా దాడికి ప్రతీకారంగా బాలాకోట్‌పై వైమానిక దాడి చేయించడం ద్వారా 56 అంగుళాల ఛాతీ ఉందని మన ప్రధాని మోదీ నిరూపించారు' అని వ్యాఖ్యానించారు. రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై కాంగ్రెస్ ఆరోపణలను ప్రస్తావిస్తూ ఆయన.. 'రఫేల్ జెట్లు మన వద్ద ఉన్నట్లయితే బాలాకోట్ దాడులను కూడా మన భూభాగం నుంచే జరిపే వీలుండేది. అందుకే ఆ విమానాలను కొనుగోలు చేసి తీరుతాం' అన్నారు. పీఎంఓలో రక్షణ శాఖ సహాయమంత్రి జితేంద్రసింగ్ మాట్లాడుతూ.. మూడు తరాల వారి త్యాగాల ఫలితంగా ఆర్టికల్ 370 రద్దయింది. ఇలాగే, పీవోకే స్వాతంత్ర్యం లభించాలని, అది కూడా భారత్‌లో అంతర్భాగం కావాలని, మనం స్వేచ్ఛగా ముజఫరాబాద్ 'పీవోకే రాజధాని) వెళ్లి వచ్చే సమయం రావాలని ప్రార్థిద్దాం' అని అన్నారు.



కల్కాలో జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్

## ఆర్టికల్ రద్దు సరైనదే

### హరియాణ మాజీ సీఎం హూడా

**రోహ్‌తక్:** జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదే అని కాంగ్రెస్ సీనియర్ నేత, హరియాణ మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హూడా అన్నారు. ఆర్టికల్ 370 రద్దును కాంగ్రెస్ వ్యతిరేకిస్తోన్న సంగతి తెలిసిందే. దేశ భక్తి విషయంలో తగ్గే ప్రసక్తే లేదని భూపిందర్ అన్నారు. అందుకే బీజేపీ నిర్ణయానికి మద్దతిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌పై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకొనేందుకు 25 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. అందులో 13 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ కమిటీ తెలిపే ఫలితాలను చండీగఢ్‌లో వెల్లడిస్తామన్నారు. పార్టీ అధిష్టానం ఆయనకు సరైన గుర్తింపును ఇవ్వక పోవడంతో పార్టీ వీడే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

## క్లుప్తంగా...

### బిగ్‌బాస్ హౌస్‌లో నటి ఆత్మహత్యాయత్నం



మధుమిత

**తమిళసినిమా(చెన్నై):** తమిళ బిగ్‌బాస్ హౌస్‌లో హాస్య నటి మధుమిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తమిళంలో ఒరు కల్ ఒరు కన్నాడీ చిత్రంలో హాస్య పాత్రలో నటించిన మధుమిత బిగ్‌బాస్ సీజన్ 3లో పోటీ చేస్తున్నారు. 50 రోజులకు పైగా బిగ్‌బాస్ హౌస్‌లో ఉన్న మధుమిత, కెప్టెన్ బాధ్యతలను నిర్వహిస్తున్న తరుణంలో శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీంతో ఆమెను బిగ్‌బాస్ హౌస్ నుంచి బయటకు పంపేశారు. తమిళ బిగ్‌బాస్ సీజన్‌కు కమల్ హాసన్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. ఆయన పాల్గొన్న గత రెండు సీజన్లలో కూడా వివాదాస్పద ఘటనలు జరిగాయి. అయితే హౌస్ సభ్యుల వేధింపుల కారణంగానే తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు మధుమిత పేర్కొంది.

### ఫోన్ ట్యాపింగ్‌పై సీబీ'ఐ'



**సాక్షి, బెంగళూరు:** కర్ణాటకలో కలకలం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు అప్పగిస్తామని ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప తెలిపారు. ఆదివారం బెంగళూరు డాలర్స్ కాలనీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసుపై సీబీఐ విచారణకు ఆదేశిస్తామన్నారు. ఇటీవల సీఎల్పీ నాయకుడు సిద్ధరామయ్యతోపాటు కాంగ్రెస్‌కు చెందిన కొందరు నేతలు ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ జరగాలని పట్టుబట్టారని తెలిపారు. ఆ మేరకు సీబీఐ విచారణకు సోమవారం ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. తమ ఫోన్లను అప్పటి సీఎం కుమారస్వామి ట్యాప్ చేయించారని పలువురు రెబెల్ ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.

### జెండాపైపును తొలగిస్తూ మృత్యు ఒడికి..



**రాయచూరు రూరల్:** జెండా పైపును తొలగిస్తూ, కరెంట్ షాక్‌కు గురై ఐదుగురు విద్యార్థులు మృతిచెందిన హృదయవిదారక ఘటన కర్ణాటకలో జరిగింది. కొప్పళ జిల్లా బన్నికట్టి ప్రాంతంలోని ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా, హాస్టల్‌పై ఏర్పాటు చేసిన జెండా పైపును తీసేందుకు హాస్టల్ పైకి ఐదుగురు విద్యార్థులు వెళ్లారు. పైపును తీస్తున్న సమయంలో హాస్టల్ పైన ఉన్న 11 కేవీ విద్యుత్‌లైన్లకు జెండాపైపు తగలడంతో ఇద్దరు విద్యార్థులు విద్యుదాఘాతానికి గురయ్యారు. రక్షించేందుకు వెళ్లిన మరో ముగ్గురు విద్యార్థులకు కూడా షాక్ తగలడంతో వారంతా మృతి చెందారు. వారు 8–10 తరగతుల విద్యార్థులు. మృతుల కుటుంబాలకు సీఎం యడియూరప్ప రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

### బుజ్జగింపు రాజకీయాల వల్లే 'తలాక్': అమిత్‌షా

**న్యూఢిల్లీ:** బుజ్జగింపు రాజకీయాలవల్లే ముస్లింలలో 'ట్రిపుల్ తలాక్' అనే చెడు సంప్రదాయం ఇప్పటిదాకా కొనసాగిందని హోం మంత్రి అమిత్ షా విమర్శించారు. ఇలాంటి విధానాల వల్లే దేశ విభజన జరిగిందని, దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీయే ఇందుకు కారణమని ఆరోపించారు. తలాక్‌ను శిక్షార్హంగా మార్చడం వల్ల లింగ సమానత్వం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు.

# పెళ్లిలో పేలిన మానవబాంబు

**63** మంది మృతి

**182** మందికి గాయాలు

- అఫ్గానిస్తాన్‌లో ఉగ్రవాదుల దుశ్చర్య
- బాధ్యత ప్రకటించుకున్న ఐఎస్

**కాబూల్:** అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో భారీ ఆత్మాహుతి దాడి సంభవించింది. పెళ్లి వేడుకను లక్ష్యంగా చేసుకుని పాల్పడిన పేలుడులో 63 మంది ప్రాణాలు కోల్పోగా 180 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘోరానికి పాల్పడింది తామేనని ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ప్రకటించుకుంది. శనివారం సాయంత్రం కాబూల్ పశ్చిమ ప్రాంతంలోని దుబాయ్ సిటీ వెడ్డింగ్ హాల్‌లో మిర్వాయిజ్ అనే యువకుడి పెళ్లి వేడుక జరుగుతోంది. సుమారు 1,200 మంది ఆ వేడుకకు హాజరయ్యారు. సంప్రదాయం ప్రకారం మహిళలు, పిల్లలు ఒక వైపు, పురుషులకు మరో వైపు వేరుగా వేడుకలకు ఏర్పాట్లు జరిగాయి. పురుషులంతా పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో అక్కడికక్కడే 63 మంది చనిపోగా 182 మంది గాయపడ్డారు. ఆ హాలంతా మృతదేహాలు, రక్తం, శరీరభాగాలతో భయానకంగా మారింది. పేలుడు తీవ్రతకు ఆ హాలు పైకప్పు బీటలు వారింది. ఆ హాలు దాదాపు 20 నిమిషాల సేపు పొగ, ధూళితో నిండిపోయింది. అందులోని పురుషుల్లో ప్రతి ఒక్కరూ గాయపడటమో ప్రాణాలు కోల్పోవడమో జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాయపడిన వారిలో కొందరు చిన్నారులు, మహిళలు కూడా ఉన్నారని అధికారులు వెల్లడించారు. 'ఈ విషాదం నన్ను జీవితాంతం వెంటాడుతుంది. నా సోదరుడు, స్నేహితులు, బంధువులు చనిపోయారు. నా కుటుంబ సభ్యులు షాక్‌తో ఉన్నారు. నవ వధువు స్పృహ కోల్పోయింది' అని పెళ్లి కొడుకు మిర్వాయిజ్ గద్గద స్వరంతో మీడియాతో అన్నాడు. కాగా, అఫ్గాన్‌లో షియాల పెళ్లి వేడుకలు అట్టహాసంగా జరుగుతుంటాయి. పండుగ వాతావరణంలో గంటలకొద్దీ కొనసాగే ఈ వేడుకలకు వందలు, ఒక్కోసారి వేలల్లోనే బంధువులు, పరిచయస్తులు హాజరవుతుంటారు. మామూలుగా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోని, ఎక్కువ సంఖ్యలో గుమికూడే షియా వివాహ వేడుకలే లక్ష్యంగా ఐఎస్ వంటి ఉగ్రవాద సంస్థలు మారణహోమం సృష్టిస్తున్నాయి. ఈ ఘటనను అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు తమదే బాధ్యతని ఐఎస్ సంస్థ ప్రకటించుకుంది. తమ సభ్యుడొకరు ఆత్మాహుతి దాడికి పాల్పడగా, మరికొందరు పేలుడు పదార్థాలతో నిండిన వాహనాలను పేల్చివేశారని టెలిగ్రామ్ యాప్ ద్వారా వెల్లడించింది. సున్నీలు మెజారిటీ సంఖ్యలో ఉన్న అఫ్గాన్‌లో షియాలపై ఐఎస్ తరచూ దాడులకు పాల్పడుతోంది. అఫ్గానిస్తాన్‌లో మోహరించిన తమ బలగాల ఉపసంహరణ, శాంతి స్థాపన లక్ష్యంగా అమెరికా అధికారులు ఉగ్రసంస్థ తాలిబన్‌తో ఒక వైపు చర్చలు సాగిస్తుండగానే ఈ ఘోరం సంభవించింది. ఇలా ఉండగా, బల్ఖ్ ప్రావిన్సులో రోడ్డు పక్కన అమర్చిన మందుపాతర పేలి కారులో వెళ్తున్న ఒకే కుటుంబానికి చెందిన 11 మంది చనిపోయినట్లు అధికారులు తెలిపారు.



తమ కుటుంబసభ్యులను పోగొట్టుకుని శవపేటికల వద్ద రోదిస్తున్న బాలుడు

# హిమాచల్‌లో భారీ వర్షాలు

22 మంది మృతి, 12 మందికి గాయాలు

**సిమ్లా:** హిమాచల్‌ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా ఆదివారం 22 మంది మృతి చెందగా, 12 మందికి గాయాలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా రూ.490 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. సహాయక చర్యలు అందించేందుకు రావాల్సిందిగా జాతీయ విపత్తుల సహాయ బృందాలను కోరినట్లు తెలిపారు. షిమ్లాలో 9 మంది, సోలన్ జిల్లాలో 5 మంది, కుల్లు, సిర్మావూర్, చంబా జిల్లాల్లో ఇద్దరు చొప్పున మృతి చెందారు. ఉనా, లహౌల్–స్పితి జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. షిమ్లాలోని ఆర్టీఓ ఆఫీసు వద్ద కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి చెందగా, ఒకరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో షిమ్లా, కుల్లు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. స్కూళ్లు, కాలేజీలు సహా విద్యాసంస్థలన్నీ సోమవారం మూసి ఉంచాలని ఆ జిల్లాల కలెక్టర్లు ఆదేశించారు. వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతినగా, మరి కొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడుతుండడంతో ఈ ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ అమిత్ కశ్యప్ అన్నారు.



బియాస్ నది వరదలో మునిగిపోయిన మండి జిల్లాలోని పంచవక్త్ర మహాదేవాలయం

## జేఎన్‌యూకు మోదీ పేరు

బీజేపీ ఎంపీ హన్స్‌రాజ్ హన్స్ డిమాండ్

**న్యూఢిల్లీ:** ప్రఖ్యాత జవహర్ లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం(జేఎన్‌యూ) పేరును మార్చి ప్రధాని నరేంద్ర మోదీ పేరు పెట్టాలని బీజేపీ ఎంపీ హన్స్‌రాజ్ హన్స్ డిమాండ్ చేశారు. శనివారం ఏబీవీపీ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...'మన పెద్దలు చేసిన తప్పునకు శిక్ష అనుభవించాం. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్ మళ్లీ స్వర్గధామం కానుంది. జేఎన్‌యూ పేరును మార్చి మోదీ పేరుతో ఉండేలా ఎంఎన్‌యూ(మోదీ నరేంద్రభాయ్ యూనివర్సిటీ) అని పెట్టాలి' అని వ్యాఖ్యానించారు. ఎంపీగానో రాజకీయ నాయకుడిగానో కాకుండా ఒక సాధారణ వ్యక్తిగా మోదీ పేరుతో జేఎన్‌యూ ఉండాలని భావిస్తున్నట్లు తన వ్యాఖ్యలను ఆయన సమర్థించుకున్నారు. అయితే, జేఎన్‌యూ విద్యార్థి సంఘం నుంచి ఈ డిమాండ్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

# విషమంగానే జైట్లీ ఆరోగ్యం



**న్యూఢిల్లీ:** బీజేపీ సీనియర్ నాయకుడు అరుణ్ జైట్లీ ఆరోగ్యపరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నట్లు సమాచారం. ఆదివారం కూడా పలువురు కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖ రాజకీయ నాయకులు ఎయిమ్స్‌కు వచ్చి జైట్లీ ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం జైట్లీకి ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజినేషన్ (ఈసీఎంవో) పద్ధతిలో చికిత్స అందిస్తున్నట్లు విశ్వసనీయవర్గాలు ఆదివారం చెప్పాయి. శ్వాస తీసుకోలేకపోవడం, విశ్రాంతిలేమి సమస్యలతో సరిగ్గా పది రోజుల క్రితం, ఆగస్టు 9న ఢిల్లీలోని ప్రఖ్యాత ఎయిమ్స్ ఆసుపత్రిలో చేరిన జైట్లీ.. అప్పటి నుంచి వైద్యశాలలోనే ఉండి చికిత్స పొందుతున్నారు. వివిధ విభాగాల వైద్యుల బృందం పర్యవేక్షణలో జైట్లీ ఐసీయూలో చికిత్స అందుకుంటున్నారనీ, ఆయన గుండె బాగానే కొట్టుకుంటోందనీ, రక్త ప్రసరణ బాగుందని ఆగస్టు 9న ఎయిమ్స్ ఓ ప్రకటనలో తెలిపింది. ఆ తర్వాత నుంచి ఆయన ఆరోగ్యంపై ఎయిమ్స్ ఎలాంటి ప్రకటనా చేయలేదు. తాజాగా ఆదివారం కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, స్మృతీ ఇరానీ, జితేంద్ర సింగ్, హర్షవర్ధన్, రాం విలాస్ పాశ్వాన్, అశ్వినీ కుమార్ చౌబే, హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బీజేపీ ఎంపీలు రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, గౌతం గంభీర్, ఆరెస్సెస్ సర్సంగ్‌చాలక్ మోహన్ భాగవత్, ఆరెస్సెస్ సంయుక్త ప్రధాన కార్యదర్శి కృష్ణ గోపాల్, సమాజ్‌వాదీ పార్టీ మాజీ నాయకుడు అమర్ సింగ్ తదితరులు ఎయిమ్స్‌కు వెళ్లి జైట్లీ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా శుక్రవారమే ఎయిమ్స్‌కు వెళ్లి జైట్లీని పరామర్శించారు.

# యువత అద్భుతాలు చేయగలదు

- భూటాన్ త్వరలోనే సొంత ఉపగ్రహం సమకూర్చుకోబోతోంది
- 'రాయల్ యూనివర్సిటీ ఆఫ్ భూటాన్'లో ప్రధాని మోదీ

**థింపూ:** భవిష్యత్ తరాలపై ప్రభావం చూపగలరీతిలో అద్భుతాలు చేయగల శక్తిసామర్థ్యాలు భూటాన్ యువతలో ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. నైపుణ్యవంతులైన యువత భూటాన్‌ను సరికొత్త ఎత్తుకు తీసుకెళుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రపంచంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయనీ, ఈ సమస్యలకు పరిష్కారం కొనుగొనేందుకు మనకు తెలివైన యువతీయువకులు ఉన్నారని వెల్లడించారు. ఆలోచనలు, సృజనాత్మకతపై ఎలాంటి పరిమితులు విధించుకోవద్దని ప్రధాని సూచించారు. భూటాన్ పర్యటనలో భాగంగా ఆదివారం థింపూలోని 'రాయల్ యూనివర్సిటీ ఆఫ్ భూటాన్'లో జరిగిన ఓ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మోదీ మాట్లాడారు.

**యువత లక్ష్యాన్ని గుర్తించాలి..**

'ప్రపంచం గతంలో ఎన్నడూలేనన్ని అవకాశాలను ఈరోజు ఇస్తోంది. సాంకేతిక ఆవిష్కరణలు, ఇతర రంగాల్లో భూటాన్ దూసుకుపోతే మీ 130 కోట్ల మంది స్నేహితులు మౌనంగా ఉండరు. ఆనందం, గర్వంతో చప్పట్లు కొట్టి ప్రోత్సహిస్తారు. ప్రస్తుతం భారత్ పలురంగాల్లో చరిత్రాత్మక రీతిలో పురోగమిస్తోంది. పాఠశాల స్థాయి నుంచి అంతరిక్షం, డిజిటల్ చెల్లింపులు, విపత్తుల నిర్వహణవరకూ భూటాన్‌తో కలిసి పనిచేసేందుకు మేం ఆసక్తిగా ఉన్నాం' అని మోదీ పేర్కొన్నారు.

**'అంతరిక్షం'లో సహకారం బలోపేతం..**

అంతరిక్ష రంగంలోనూ భారత్ భూటాన్‌తో సంబంధాలను పటిష్టం చేసుకుంటోందని ప్రధాని మోదీ చెప్పారు. 'మేం 'థింపూ గ్రౌండ్ స్టేషన్ ఆఫ్ సౌత్‌ఏసియా శాటిలైట్'ను ప్రారంభించాం. ఉపగ్రహాలతో టెలిమెడిసిన్, దూరవిద్య, సహజ వనరుల మ్యాపింగ్, వాతావరణాన్ని అంచనా వేయడంతో పాటు ప్రకృతి విపత్తులను ముందుగానే గుర్తించి హెచ్చరికలు జారీ చేయవచ్చు. మేం ఇటీవల చంద్రుడిపైకి చంద్రయాన్–2ను ప్రయోగించాం. భూటాన్ కూడా త్వరలోనే ఓ చిన్న ఉపగ్రహాన్ని సొంతంగా సమకూర్చుకోబోతోంది. భవిష్యత్‌లో భూటాన్‌కు చెందిన యువ శాస్త్రవేత్తలు భారత్‌కు వచ్చి తమ ఉపగ్రహాన్ని డిజైన్ చేసుకోవడంతో పాటు ప్రయోగాన్ని వీక్షిస్తారని ఆలోచిస్తేనే చాలా సంతోషంగా ఉంది'' అని ప్రధాని వ్యాఖ్యానించారు. తాను రాసిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకాన్ని భూటాన్ ప్రధాని లోటే షెరింగ్ ప్రశంసించడంపై స్పందిస్తూ, గౌతమబుద్ధుని ప్రభావంతోనే ఆ పుస్తకం రాసినట్లు మోదీ చెప్పారు.

**భూటాన్ అర్థం చేసుకుంది:** సంతోషం ప్రాముఖ్యతను భూటాన్ అర్థం చేసుకుందని ప్రధాని మోదీ చెప్పారు. 'భూటాన్ నుంచి ప్రపంచం నేర్చుకోవాల్సింది చాలాఉంది. ఇక్కడ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సంస్కృతులు ఒకదానితో మరొకటి సంఘర్షణ పడకుండా కలిసి ముందుకు సాగుతాయి. సంతోషం యొక్క ప్రాముఖ్యతను, దయాగుణం గొప్పతనాన్ని భూటాన్ అర్థం చేసుకుంది' అని మోదీ తెలిపారు. తర్వాత మోదీ భారత్‌కు తిరుగుపయనమయ్యారు.



థింపులోని నేషనల్ మెమోరియల్ చోర్టెన్ వద్ద మోదీ

# విష సంస్కృతికి అడ్డుకట్టేది?



- అమెరికాలో దడపుట్టిస్తున్న తుపాకీ కాల్పుల ఘటనలు
- భారీగా మరణాలు.. అయినా ప్రభుత్వ చర్యలు శూన్యం

అగ్రరాజ్యం అమెరికాను తుపాకీ సంస్కృతి హడలెత్తిస్తోంది. జనసమ్మర్ధ ప్రాంతాల్లో అగంతకులు తుపాకులతో విధ్వంసం సృష్టిస్తుండటంతో సామాన్య ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న జాత్యహంకార వ్యాఖ్యల కారణంగానే ఈ తరహా దాడులు జరుగుతున్నాయని డెమొక్రటిక్ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. అయితే కొందరు మానసిక రోగులు చేసే దాడుల్ని ప్రజలందరికీ ఆపాదించడం సరికాదని రిపబ్లిక్ పార్టీ నేతలు చెబుతున్నారు. చివరికి ఈ విష సంస్కృతి పాఠశాలలకు వ్యాపించిన నేపథ్యంలో తుపాకుల నియంత్రణకు చట్టాల్లో మార్పులు చేయాలని ప్రజలు చెబుతున్నారు.

**ప్రాణాలు తీస్తున్న హ్యాండ్‌గన్స్..**

అమెరికాలో అమాయక ప్రజలను కాల్చిచంపే ఘటనలు గత 30 ఏళ్లలో అధికమయ్యాయి. మదర్‌జోన్స్ అనే ఇన్వెస్టిగేటివ్ మ్యాగజీన్ కథనం ప్రకారం అమెరికాలో 1982 నుంచి ఇప్పటివరకూ ప్రజలు లక్ష్యంగా 110 దాడులు చోటుచేసుకున్నాయి. ఒక్క 2016లోనే దేశంలో తుపాకీ కాల్పుల్లో 38,658 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 22,938 మంది ఆత్మహత్య చేసుకున్నారు. దుండగులు జరిపిన సామూహిక కాల్పుల్లో 2016లో 71 మంది తుదిశ్వాస విడిచారు. అమెరికాలో హ్యాండ్ గన్స్ కారణంగానే ఎక్కువమంది (64 శాతం) చనిపోతున్నారని ఎఫ్‌బీఐ తెలిపింది. ఈ జాబితాలో రైఫిల్స్, షాట్ గన్స్, ఇతర ఆయుధాలు తర్వాతి స్థానంలో నిలిచాయంది. అమెరికాలో కేవలం రూ.14,228కే ఓ హ్యాండ్‌గన్ లభ్యమవుతోంది. ఇక పెద్ద తుపాకులైతే రూ.లక్ష వరకూ ధర పలుకుతున్నాయి. ప్రస్తుతం అమెరికన్ల దగ్గర 39 కోట్ల తుపాకులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాలోని తుపాకీ సంస్కృతిపై ప్యూ రీసెర్చ్ అనే సంస్థ ఓ సర్వే చేపట్టింది. ఇందులో 18–29 ఏళ్ల మధ్య వయసున్న యువతలో చాలామంది తుపాకీ హక్కులను కాపాడాలని కోరుకుంటున్నట్లు తేలింది. యువతలో ముఖ్యంగా శ్వేతజాతీయులు తుపాకీ కలగిఉండటాన్ని ఇష్టపడుతున్నట్లు సర్వే పేర్కొంది.

**అడ్డుగోడ.. ఎన్‌ఆర్‌ఏ**

తుపాకుల అమ్మకాన్ని నియంత్రించాలని ప్రజలతో పాటు పలువురు డెమొక్రాట్లు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. తుపాకుల వాడకాన్ని నియంత్రిస్తూ కఠిన చట్టాలను తీసుకొచ్చినప్పుడే అమాయకుల ప్రాణాలను కాపాడగలమని స్పష్టం చేస్తున్నారు. అయితే ఈ చర్యలను 55 లక్షల మంది సభ్యులున్న నేషనల్ రైఫిల్ అసోసియేషన్(ఎన్ఆర్‌ఏ) అనే లాబీయింగ్ బృందం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఎన్ఆర్‌ఏ ఆర్థికమూలాలు ఎంతబలంగా ఉన్నాయంటే ఏకంగా రిపబ్లికన్ పార్టీ వీరికి సంపూర్ణ మద్దతు ఇస్తోంది. అమెరికా కాంగ్రెస్‌లో అటు రిపబ్లికన్లు, ఇటు డెమొక్రాట్లకు పెద్దమొత్తంలో ఎన్నికల విరాళాలు అందిస్తూ లోబర్చుకుంటోంది. ఈ నేపథ్యంలో అమెరికాలో తుపాకీ సంస్కృతికి ఇప్పట్లో తెరపడేలా కనిపించడం లేదన్నది నిపుణుల మాట.

**అత్యధిక తుపాకులున్న టాప్-10 దేశాలు**

| దేశం | తుపాకులు (ప్రతి 100 ఇళ్లకు) |
|---|---|
| అమెరికా | 120.5 |
| యెమెన్ | 52.8 |
| సెర్బియా | 39.1 |
| మాంటెనెగ్రో | 39.1 |
| ఉరుగ్వే | 34.7 |
| కెనడా | 34.7 |
| సైప్రస్ | 34 |
| ఫిన్‌లాండ్ | 32.4 |
| లెబనాన్ | 31.9 |
| ఐస్‌లాండ్ | 31.7 |

BBC



నల్లగొండ | సోమవారం
ఆగస్టు | 19 | 2019
sakshisahityam@gmail.com

## ఈవారం పుస్తకాలు



**డాక్టర్ సి.నారాయణరెడ్డి సినీ గీత సర్వస్వం**
(ఐదు సంపుటాలు; హార్డ్ బౌండు; పేజీలు: 474+502+495+ 466+484; వెల: 205+210+210+ 210+210)
సంపాదకులు: సి.గంగ, డాక్టర్ జె.చెన్నయ్య; ప్రతులకు: వరేణ్య క్రియేషన్స్, ప్లాట్ నం. 61, డాలర్‌హిల్స్, మణికొండ, హైదరాబాద్–104.



**నీ పేరు తలచినా చాలు!**
**(డాక్టర్ సి.నారాయణరెడ్డి సినీ గీతాలకు వ్యాఖ్య: 1962-69)**
రచన: డాక్టర్ కంపల్లె రవిచంద్రన్; పేజీలు: 212; వెల: 200; ప్రచురణ: సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్, మణికొండ, హైదరాబాద్. ప్రతులకు: క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్. ఫోన్: 9848065658



**ఇంకా సగం**
**(సీక్వెల్- లీ విజిటింగ్ పోయెం)**
రచన: జి.సత్య శ్రీనివాస్; పేజీలు: 112; వెల: 125; ప్రతులకు: వికాస ధాత్రి, బి 74, దయాళ్‌నగర్, కైలాసగిరి దగ్గర, విశాఖపట్నం–530043. ఫోన్: 9440994244



**బంధాలు** (కథలు)
పేజీలు: 188; వెల: 160
**ప్రియతమా** (రొమాంటిక్ కథలు)
పేజీలు: 204; వెల: 200
**పిచ్చి సభ సన్మానం** (కథలు)
పేజీలు: 164; వెల: 160



**టోపీవాలా** (హాస్య కథలు)
పేజీలు: 188; వెల: 200
**మహోన్నత మహాదాత కర్ణ** (నాటకం)
పేజీలు: 76; వెల: 60
పై ఐదింటి రచన: వియోగి (కోపల్లె విజయప్రసాదు)
ప్రతులకు: టి.కె.విశాలాక్షి దేవి, చైర్‌పర్సన్, కర్నూలు తెలుగు హాస్య కళాసమితి, 87-395, కమలానగర్, బి-క్యాంపు, కర్నూలు–518002. ఫోన్: 08518–229389

## టీవీప్రపంచం

సందేహ సమాధానం ప్రోగ్రాంలో ప్రముఖ సామాజిక రచయిత్రి స్పృహాసిని గారూ, నమస్తే. మీ చీర బావుందండి, మెటీరియల్ ఏవిటి? ఏ షాపులో కొన్నారు? ధర ఎంత? డిస్కౌంట్ మీద బేరం ఆడవచ్చా? మీ చీర బోర్డర్ లేత బొంగు రంగు అయితే ఇంకా బావుండేది అని నా ఉద్దేశం, మీ అభిప్రాయం ఏవిటీ?



## కథాసారం

# జ్ఞాపకాల బుల్లెట్



**ఎన్నిసార్లో కామాయీ, తల్లీ, చిన్న తమ్ముడూ ఆ చెరువొడ్డున కూర్చుని వణ్ణం తిన్నారు. అదంతా జ్ఞాపక మొచ్చింది. వాళ్ళమ్మా, తమ్ముడూ, వణ్ణమూ, మెరపకాయల కారమూ, కాల్చిన రొయ్యిలూ అన్నీ జ్ఞాపకమొచ్చాయి.**

**కం**కిపాటి కామాయికి ఇన్‌ఫెంట్రీలో ఇచ్చిన పేరు ప్రయివేటు సిపాయి నంబరు 58310 అని.

ఆ చుట్టుగోడలో వున్న కంతలోంచి దూరి ఇవతల పడ్డాడు. బోర్ల నుంచి వెల్లకిల తిరిగాడు. ఆ వెధవ మణిపూరు రోడ్డు – కొండలూ, గుట్టలూ, పైగా ఎనిమీ కట్టే అడ్డుగోడలూ!

సూర్యుని కిరణాలు కామాయి బుగ్గల మీద తాండవిస్తుంటే ఆ చలికాలంలో వాడికి హాయిగా వున్నది. వాడనుకోవడం – ఆ గోడ కంతలోంచి దూరి హాయిగా ఇవతల పడ్డానని.

''ఆ! యేడిసినట్టుంది. గౌహటీ నుంచి బయల్దేరి నవుగామ్ కొచ్చాం. ఆడనుంచి మణిపూరెళుతుండాం. నా కాలికేదో తగిలి నేనీడ పడ్డాను. యారయినా యింటే నవ్వుతారు. లేచీ మిగతా వోళ్ళను కలుసుకోవాల. ఆళ్ళీపాటి కవతల కొండ మీదకి పోయుంటారు'' అనుకున్నాడు కామాయి.

చేతులూ కాళ్ళూ కదలడం లేదు. లేవాలని ఎంతో ప్రయత్నించాడు. దుఢీలున మహా భయం వేసింది వాడికి. సూర్యకిరణా లాగిపోయాయన్నట్లుగా వాడి శరీరమంతా చల్లబడడ మారంభించేసరికి వాడికి మహా గాభరా వేసింది.

''అరే దేముడా! ఓ యాల నేనూ ఓ యాల నేనూ; కాదు కాదు'' అని మళ్ళీ శాంతపడ్డాడు. ''ఆ పడ్డంలో యెక్కడో బెణికింది గామోసు, అందుకనే లేవలేక పోతుండా'' అనుకున్నాడు.

కొంచెం సేపటికి వాడి శరీరంలో ఉన్న చల్లదనం పోయింది. సూర్యకిరణాల వేడికి మళ్ళీ హాయి పొందుతున్నాడు కామాయి.

అదంతా అసలు సీఓ తప్పు. లేకపోతే ఏమిటి మరి? వాళ్ళందర్నీ సెలవ కిండ్లకు పంపిస్తానన్నాడు. వారం రోజులైనా కాలేదు, యేక్షన్‌లోకి పోవాలన్నాడు. ఇండ్ల మీద ప్రాణాలు పెట్టుకున్నవాళ్ళు ఎట్లా ఆ వెధవ మణిపూరు రోడ్డు మీద బార్బుడు వైరు వెనక పాకులాడుతూ పోతారు? ఆ పనిమీద మనసెలా వుంటుంది? న్యాయం కాదు.

ఆ మొదటి కొండ పక్కనుంచి ఆ గ్రామం గుండా గోడల సందుల్లో బోర్లపడి పాకులాడుతూ పోయినప్పుడంత కష్టంగా లేదు. అప్పుడు ముందర బోడిరాము డుండేవాడు. వాడి తలకాయి చూసుకుంటూ పాకాడు కామాయి. పాపం చాలా మంచి వాడు బోడిరాముడు. ఎన్ని బాంబులు పడుతున్నా వాడి యాసలో వాడు ఏవేవో చమత్కారాలాడుతూ ఆ వున్నవాళ్ళ ధైర్యం పోకుండా చూసేవాడు.

అద్దైపోయింది. అసలు నాటకం – లేచి ఆ చుట్టూ గోడ పక్కనుంచి పాకులాడుతూ పోవాలని ఆర్డరొచ్చింది. కామాయి వెంటనే ఎదుట చూడంగానే గోడలో మనిషి దూరేంత కంత వుంది. మహా అదృష్టవంతుణ్ణనుకున్నాడు. దూరి అవతలకు పోతే ఫస్టు అనుకున్నాడు. అక్కడ్నుంచీ పాకటం ఉండదనుకున్నాడు. వాడి కోసమే ప్రత్యేకం, ఆ కంత ఉందనుకున్నాడు. దభాలున దూకాడు. అయితే కాళ్ళమీద లేవాల్సింది మొఖం బోర్లా పడ్డాడు – ఆ యెత్తు నుంచి!

ఆశ్చర్యం! ఆ దూకబోయే ముందర ఓసారి చుట్టూ చూశాడు. కంకిపాటి చెరువల్లే ఓ చెరువూ, అక్కడ మోస్తరే ఓ వరిపొలం కనబడ్డాయి. ఆశ్చర్యం సుమా! ప్రపంచంలో రెండుచోట్ల ఒకే మాదిరుండడం.

ఎన్నిసార్లో కామాయీ, తల్లీ, చిన్న తమ్ముడూ ఆ చెరువొడ్డున కూర్చుని వణ్ణం తిన్నారు. అదంతా జ్ఞాపక మొచ్చింది. వాళ్ళమ్మా, తమ్ముడూ, వణ్ణమూ, మెరపకాయల కారమూ, కాల్చిన రొయ్యిలూ అన్నీ జ్ఞాపకమొచ్చాయి. పాపం ఎన్నిసార్లు వాళ్ళమ్మ ఎండలో ఆ పొలంలో చమటలు కమ్ముతూ పని చేయలేదు? నిజం – అదంతా కళ్ళకు కట్టినట్లు కనపడ్డాది వాడికి – ఆ గొంతుకలు కూడా వినబడ్డాయి. నిజంగా ఆ గొంతుకలు వినబడ్డాయి. తమ్ముడు చెట్టెక్కాడు. ''రేయి నీ జిమ్మ తియ్యా! ఆ వున్న ఒక్క గంతా సింపుకుంటావు. దిగి రాయేంరా!'' అనేది అమ్మ. కామాయి చెర్లో చేపలు పడుతుంటే ''రాయేంరా! ఈ మట్టి తియ్యాలి రారా!'' అనేది.

వాళ్ళు ముగ్గురే! ఆ గ్రామంలో ఇంకా వున్నారు గాని వీళ్ళ ముగ్గురికీ వీళ్ళు ముగ్గురే అన్నట్లుండేది.

అప్పుడే – అప్పుడే సుబ్బిని కలిశాడు కామాయి. సుబ్బిని కలిసిం తర్వాత మారాడు. అప్పట్నుంచీ అమ్మా కాదు, తమ్ముడూ కాదు – ప్రపంచమంతా సుబ్బే! సుబ్బి ఇప్పుడుంటే ఎంతిచ్చుకోడు? ఆ నున్నగా, నల్లగా చంపలమీదానిస్తే ఏమివ్వడు? పక్కన పడుకుంటే చాలు – ఆ గుండెలో వేత్తున్న నొప్పంతా పోతుంది. ఆ గుండెలో నొప్పి, మొఖం మీద మంటా వాడ్ని ముందుకు లాక్కెళ్ళుతున్నాయి – సుబ్బిని కలుసుకోడానికి.

అవును సీఓ లీవిస్తానన్నాడు. వెళ్ళి సుబ్బిని పెండ్లాడవచ్చు. సుబ్బి పెండ్లాడుతుందా? కంకిపాటి సుబ్బి అవుతుందా? అయితే ఆ పొలం పక్కన, ఆ చెరువొడ్డున, ఆ వేపచెట్టు పక్కనున్న గడ్డివామి మద్దెన పడుకున్నప్పుడాడిన మాటలు మాటాడుతుందా?

మళ్ళీ వొకసారి లేవడానికి ప్రయత్నించాడు కామాయి. ఉహు! ఏ అవయవమూ కదల్దే!

పోనీలే. కదలకపోతే నేమాయె. ఇప్పుడు కదిల్తేనేం, కదలకపోతేనేం. అంతా అయిపోయినట్లుంది. ఏమిటా చీకటి? గ్రహణం పట్టిందా? గ్రహణంలో కదలకూడనివాళ్ళు గర్భిణీ స్త్రీలు. తాను సిపాయి. ఎందుకు కదలకూడదూ?

మూతి బిగించి లేవబోయాడు. కదలలా! వాడికే నవ్వొచ్చింది. మెడ ఓ వైపు తిప్పాడు. ఆ చెరువు వొంక చూశాడు – నవ్వుతూ.

శవాలను వెతుక్కుంటూ గాయపడ్డవాళ్ళను మోసుకెళ్ళే పార్టీ ఒకటక్కడికి వచ్చింది. వాళ్ళ లీడరు అటూ ఇటూ చూసి కామాయిని కనిపెట్టాడు. దగ్గరకు పోయాడు. చచ్చి చాలా సేపయిందనుకున్నాడు. ముఖం చూశాడు. ఆ వేపు చెరువును చూస్తున్నట్లుగా వుంది. పెదిమల మీద చిర్నవ్వుంది.

లీడరు కామాయి బ్లవుజు విప్పాడు. మెళ్ళో ఉన్న రెండు ఐడెంటిటీ డిస్కులు చూశాడు. చదివాడు. కంకిపాటి కామాయి – నంబరు 58310 అని వుంది. ఎదురుగా కొండ వేపు చూశాడు. కామాయి పుర్రెలో వున్న గుండు దెబ్బ చూశాడు.

''ఈడీ కంతలోంచి ఈతలికి సూసేసరికాదెబ్బ తగిలుంటుందిరా. ఇంటికి ఐడెంటిటీ తీస్కోండి. ఆ తర్వాత ఏదైనా వస్తుంది!'' అని తక్కిన వాళ్ళతో అన్నాడు.

శవం నక్కల పాలైంది.



శిష్ట్లా ఉమామహేశ్వరరావు

**శిష్ట్లా ఉమామహేశ్వరరావు** కథ 'పడిపోయిన సిపాయి' ఇది. తెలుగులో సైన్యం నేపథ్యంలో రచనలు చేసిన అరుదైన రచయిత శిష్ట్లా. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటిష్ సైన్యంలో పనిచేశారాయన. 'సిపాయి కథలు' కథా సంపుటి. వీటి ప్రచురణ 1946–1948. ఆకాశవాణి కథలు మరో సంపుటి. కథకుడిగా కన్నా కవిగా ఎక్కువ చర్చల్లోకి వచ్చాడు. విష్ణు ధనువు, నవమి చిలుక ఆయన కవితాసంపుటాలు. అతి నవీనుల్లో నవీనుడు అనీ, కవిత్వంలో రౌడీవేషం అనీ, వ్యక్తిగత జీవితంలో అరాచకుడు అనీ అనిపించుకున్నాడు. శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కవితకు శిష్ట్లా కవిత 'మారో మారో మారో' ప్రేరణ అని శ్రీశ్రీయే చెప్పుకున్నారు. శిష్ట్లా జనన మరణ తేదీల్లో (1909–1953) కొంత సంశయాలు ఉన్నప్పటికీ చిన్న వయసులోనే మరణించాడన్నది మాత్రం విషాదకరంగా నిస్సంశయం.

## ప్రతిధ్వనించే పుస్తకం

# రాజ్ గోండు కథాగాయకుడి ధారణ శక్తి

**మానవ విజ్ఞానవేత్త క్రిస్టోఫ్ హైమెండార్ఫ్ 1976లో రాజ్ గోండుల మీద తన రెండో విడత (తొలి విడత శోధన 1940ల్లో జరిగింది) పరిశోధన కోసం ఆదిలాబాద్‌కు వచ్చినప్పుడు ఆయన శిష్యుడిగా, సహపరిశోధకుడిగా వచ్చారు మైకల్ యార్క్. హైమెండార్ఫ్ జిల్లా పశ్చిమ భాగంలో ఉన్న రాజ్ గోండులనూ, యార్క్ తూర్పు ప్రాంతపు రాజ్ గోండులనూ అధ్యయనం చేశారు. ఇప్పటి కుమ్రం భీం – ఆసిఫాబాద్ జిల్లాలో గిన్నెధరి గ్రామంలో ఉంటూ ముఖ్యంగా తిర్యాని లోయలోని గోండు, కొలాం గూడేల్లో ఏడాదిన్నర పాటు శోధించారు మైకల్. అనంతరం ఇరువురూ కలిసి 'ట్రైబ్స్ ఆఫ్ ఇండియా: ద స్ట్రగుల్ ఫర్ సర్వైవల్' పుస్తకాన్ని 1982లో వెలువరించారు. 'రాజ్ గోండ్స్: రిఫ్లెక్షన్స్ ఇన్ ఎ పీకాక్ క్రౌన్' పేరిట ఓ డాక్యుమెంటరీతో పాటు 1,500 ఫొటోలు కూడా తీశారు మైకల్. అప్పుడు మైకల్ యార్క్ రాసిన రెండు పరిశోధనాత్మక వ్యాసాల తెలుగు అనువాదమే ఈ 'వేలిత పాట'. అనువాదం: ల.లి.త. సంపాదకుడు: సుమనస్పతి రెడ్డి. పేజీలు: 142; వెల: 90. ప్రచురణ: తెలంగాణ గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణా సంస్థ, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్. గోండుల్లో అప్పుడే పుట్టిన పిల్లల్ని సమాజంలోకి ఆహ్వానిస్తున్నందుకు ప్రతీకగా పాడేది ఈ వేలిత(తీగ) పాట. కుటుంబాన్ని ప్రతీకాత్మకంగా ఇంటి పైకప్పు నిండా పరుచుకోవటం కోసం గుమ్మడి మొక్క పంపే నులితీగలుగా (వేలిత వేలి) చెప్పుకుంటారు. పుస్తకంలోని కొంత భాగం ఇక్కడ:**



వేలిత పాట



మైకల్ యార్క్

**గి**న్నెధరికి సంబంధించిన నా జీవితపు అతి ప్రియమైన జ్ఞాపకాలలో ఒకటి, నేను రాజ్ గోండుల సంప్రదాయ సృష్టి పురాణాలను రికార్డు చేయాలనుకుంటున్నానని కబురు పంపిన ఫలితంగా కలిగిన అనుభవం. కబురు పంపిన కొన్ని వారాల తరువాత వెడ్మ రాము అనే తోటి పెద్దమనిషి నా ఇంటికి ఒక కింగ్రీతో (కీక్రి అని కూడా అంటారు. వయోలిన్ వంటి సంప్రదాయ గోండి వాయిద్యం) వచ్చాడు. పాట పాడటానికి అంగీకరించాడు. ఆ పాట అయిదు రోజులు సాగటం నాకెంతో ఆశ్చర్యంగా అనిపించింది. అతడు పాడుతూ ఉంటే రాజ్ గోండుల పెద్ద గుంపు మా ఇంటి దగ్గర పోగయింది. అతని పాట విన్న తరువాత, రాజ్ గోండుల వద్ద బాగా అభివృద్ధి చెందిన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం లేకపోవచ్చుగానీ, భారతదేశపు ఆదివాసీల్లో ఉన్న అతి సమృద్ధమైన మౌఖిక సంప్రదాయాలూ, సంస్కృతుల్లో రాజ్ గోండులది కూడా ముఖ్యమైనదని నాకు తెలిసివచ్చింది. ఆ పాటనంతటినీ అనువదించి విశ్లేషించటానికి నాకు నెల రోజులు పట్టింది. రాజ్ గోండులు ఈ విశ్వాన్ని ఎలా ఊహించారనే విషయం మీద నాకు ప్రగాఢమైన అవగాహన వచ్చింది. అంత సుదీర్ఘమైన, ఉత్కృష్టమైన రచనను ఎలా గుర్తుపెట్టుకుంటారని వెడ్మ రామును నేనడిగితే, ఆయన దాదాపు 125 గులకరాళ్లను నేల మీద మూడు ఆయామాల్లో (ఒక ఘనరూపంలో) అనిపించేలా పేర్చి వర్ణిస్తూ అదే తన జ్ఞాపన సహాయకారి (mnemonic aid జ్ఞాపకముంచుకోవడానికి తోడ్పడే సాధనం) అని వివరించాడు. ఒక సంప్రదాయ కథాగాయకుడి వద్ద ధారణకు తోడ్పడే ఇంత నిశితమైన పద్ధతి ఉండటం నా శాస్త్రీయ పాశ్చాత్య అవగాహనను దిగ్భ్రమకు గురిచేసింది.

**గోం**డుల నమ్మకం ప్రకారం మానవ జన్మ పుట్టుకతో మొదలవుతుంది. ఇది పురిటి నొప్పులతో మొదలై దాదాపు ఒక వారం తరువాత జరిపే శుద్ధి సంస్కారంతో ముగుస్తుంది. మగ, ఆడ పిల్లల పుట్టుక మధ్య పెద్ద తేడా చూపరు రాజ్ గోండులు. మానవ జన్మ అంటే భూమి, నీరు, గాలి, నిప్పు, ఆకాశమనే పంచభూతాలు కూడటం, ఇంకా దానికి భగవంతుడు జీవ అంటే ప్రాణాన్ని ఇవ్వటం. ఈ పదార్థాలూ, ఈ ప్రాణశక్తీ కలిస్తే ఒక మౌలిక ఆధారం ఏర్పడుతుంది. ఆ విత్తనమే పెండ్లి సమయానికి యౌవన దశకు చేరి, పునరుత్పత్తికి కారకమై వృద్ధి చెందుతుంది. ఆ విత్తనమే మృత్యు సమయంలో భగవంతుడు ప్రాణశక్తిని వెనక్కు తీసుకున్నప్పుడు నశించి ధూళిలో కలిసిపోతుంది. మనిషి అస్తిత్వమే ఒక అభివృద్ధి క్రమం. జీవన పరిభ్రమణంలో దాటవలసిన అన్ని దశలూ దాటి వెళితేనే మానవ జన్మ సంపూర్ణమౌతుంది. దీనిని గోండులు ప్రతీకాత్మకంగా అయిదు జొన్న విత్తనాలుగా చెప్పుకుంటారు. జొన్న వాళ్ల ముఖ్య ఆహార ధాన్యం. పెండ్లప్పుడు ఆ అయిదు విత్తనాలు అయిదు కొలతల విత్తనాలవుతాయి. చనిపోయినప్పుడు అవి అయిదు కొలతల పిండిగా మారతాయి. అయితే ఎవరైనా పెండ్లికి ముందే చనిపోతే ఆ మనిషి అభివృద్ధి క్రమం మధ్యలోనే ఆగిపోతుంది. అప్పుడు చావు తంతు చాలా చిన్నదైపోతుంది. అయిదు గింజల ప్రతీక ప్రాధాన్యం కోల్పోతుంది.

## సాహిత్య మరమరాలు

# అదే కావాలి!



**బా**పు ఇంట్లో అప్పుడు కథాచర్చలేవో జరుగుతున్నాయి. బాపు మిత్రుడు భూషణ్ అక్కడికి వచ్చారు. ఆయన బాపు సినిమాలకు స్టిల్ ఫొటోగ్రాఫర్‌గా వ్యవహరించినవారు. వచ్చినప్పటినుంచీ భూషణ్ ఏకధాటిగా రెండు గంటల పాటు కబుర్లు చెబుతూనే ఉన్నారు. చివరికి ఆయన బయటికి వెళ్లబోతూ – ''ఇదిగో, బయటికి వెడుతున్నా– ఏమైనా కావాలా?'' అని అడిగారు.

బాపు నవ్వుతూ, ''అంతకంటే ఏం కావాలి?'' అన్నారట.

# ఇవాన్ బూనిన్

## గ్రేట్ రైటర్



**త**న కాలానికంటే పూర్వకాలం పట్ల ఎక్కువ అనురక్తి ఉన్న రచయిత ఇవాన్ బూనిన్ (1870–1953). నోబెల్ పురస్కారం పొందిన మొదటి రష్యన్ రచయిత. రష్యాలోని ఒక ఉన్నత కుటుంబంలో జన్మించాడు. వాస్తవికవాద ధోరణిలో టాల్‌స్టాయ్, చెహోవ్ అసలైన వారసుడిగా గుర్తింపు పొందాడు. ద విలేజ్, డ్రై వేలీ నవలలు, ద లైఫ్ ఆఫ్ ఆర్సెనీవ్ ఆత్మకథాత్మక నవల, కథల సంపుటి డార్క్ ఎవెన్యూస్, కర్స్‌డ్ డేస్ డైరీ ఆయన ప్రసిద్ధ రచనలు. కవిగానూ ప్రసిద్ధుడు. ఓ దశలో టాల్‌స్టాయ్ ప్రభావంలో పడి పూర్తి కర్షకుడిగా రూపాంతరం చెందడానికి ప్రయత్నించాడు. తర్వాత్తర్వాత అది ఉటోపియాగా భావించాడు. చెహోవ్, గోర్కీలతో చాలాకాలం స్నేహం చేశాడు. ప్రయాణాలు చేస్తూ దేశపు ఆత్మను కనుక్కునే ప్రయత్నం చేశాడు. రష్యన్ విప్లవంలో మాత్రం నమ్మకం లేకపోగా, అది అధమ స్థాయి మనుషుల విజయంగా భావించాడు. అందుకే రష్యాను వదిలి ఫ్రాన్స్‌లో స్థిరపడ్డాడు. కానీ మరో పరాయి దేశం రష్యాను గెలిచి అక్కడి రాజకీయ ముఖచిత్రాన్ని మార్చడం అనే ఆలోచనను ఇష్టపడలేదు. దేశం లోపలి పరిస్థితులను దేశ ప్రజలే మార్చుకుంటారని విశ్వసించాడు. నాజీల దురాక్రమణ సమయంలో పారిస్‌లోని తన ఇంట్లో ఎందరికో ఆశ్రయం ఇచ్చాడు.

## కొత్త బంగారం

# ప్రేమ పోయిన తర్వాత...



ద గర్ల్ ఇన్ రూమ్ 105



చేతన్ భగత్

**'ఇ**ది ప్రేమ కథ కాదు. ప్రేమ పోయిన కథ.' ఇలా ముగిసే చేతన్ భగత్ నవల, 'ద గర్ల్ ఇన్ రూమ్ 105'లో– కథానాయకుడైన 27 ఏళ్ళ కేశవ్, 'చందన్ క్లాసెస్'లో బోధిస్తుంటాడు. సహోద్యోగి, ఢిల్లీ మాలవీయ నగర్ ఫ్లాట్‌మేటూ అయిన సౌరభ్ (గోలూ)తో కలిసి, ఒక ఫిబ్రవరి రాత్రి తాగుతూ ఉంటాడు. నాలుగేళ్ళ పాత గర్ల్ ఫ్రెండ్, జారా పుట్టినరోజు అదేనని గుర్తుకొస్తుంది. అప్పుడే, తెల్లారి మూడు గంటలకు, జారా నుండి 'నా పుట్టిన రోజని మరచిపోయావా! నువ్వు గుర్తుకొస్తున్నావు. రఘు మంచివాడే కానీ నాకు సరిపడినవాడు కాదు. ఇంకా, హిమాద్రి హాస్టల్లో 105వ నంబర్ గదిలోనే ఉన్నాను. ముందులాగే, కిటికీ బయటున్న మామిడి చెట్టెక్కి, గదిలోకొచ్చెయ్యి' అన్న వాట్సాప్ మెసేజులు వస్తాయి.

గతంలో కేశవ్ ఢిల్లీ ఐఐటీ వదులుతుండగా, అక్కడ పీహెచ్డీ చేయడానికి వచ్చిన జారాతో ప్రేమలో పడతాడు. ఆమె కశ్మీరీ ముస్లిం. కేశవ్ తండ్రి రాజస్తాన్, అల్వర్‌లో– ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త అయినందున, అతనింటివారు వారి సంబంధాన్ని ఆమోదించరు. నవల మొదలయ్యేటప్పటికే జారా, కేశవ్‌కు దూరమై, అతని బ్యాచులోనే చదివిన తెలుగబ్బాయి రఘును పెళ్ళి చేసుకోడానికి రెండు నెలలే మిగిలుంటాయి. రఘు మల్టీనేషనల్ కంపెనీలో పైకి ఎదుగుతుంటాడు.

కేశవ్, సౌరభ్–105కి వెళ్ళేటప్పటికే జారా చనిపోయి ఉంటుంది. ఆమె మెడ నులిమిన గుర్తులు కనబడతాయి. కేశవ్– దగ్గర్లోనే ఉండే జారా తండ్రి సఫ్దర్‌కూ, పోలీస్ ఇన్‌స్పెక్టర్ రానాకూ, రఘుకీ ఫోన్ చేసి చెప్తాడు. రఘు చెయ్యి విరిగి, హైదరాబాద్ అపోలో హాస్పిటల్‌లో ఉంటాడు. హాస్టల్ వాచ్‌మన్ లక్ష్మణ్ రెడ్డి, హత్యా సమయమప్పుడు తన నియమితమైన చోటున లేనందువల్లా, గతంలో జారా అతనితో గొడవపడ్డమూ తెలిసి, రానా అతన్ని కస్టడీలోకి తీసుకుంటాడు. అయితే, కేశవ్ – గోలూ సహాయంతో, తనే డిటెక్టివ్ పని మొదలెడతాడు. అతని మొదటి అనుమానం– జారామీద కన్నేసిన ఆమె పీహెచ్డీ గైడయిన సక్సేనా మీదకి వెళ్తుంది. కాకపోతే, సక్సేనా కుంటుతాడు కనుక అతను చెట్టెక్కలేడని గ్రహించిన కేశవ్ సందేహం, తీవ్రవాదుల్లో చేరిన జారా సవతి తమ్ముడైన సికందర్ పైకి మళ్ళుతుంది. సికందర్ ఉండే కశ్మీర్ వెళ్లినప్పుడు, సికందర్ ఆత్మహత్య చేసుకుంటాడు. అక్కడున్న ఆర్మీ ఆఫీసరైన ఫెయిజ్ పెళ్ళయి, కవల పిల్లలున్నవాడు. ఫెయిజ్‌తో జారా సంబంధం పెట్టుకుందన్న సాక్ష్యం దొరికినప్పుడు, అతనే హంతకుడని అనుమానిస్తాడు. సఫ్దర్‌కు, జారా పోయిన వందో రోజు అందరినీ పిలవమనీ, తను హంతకుడెవరో బయటపెడతాననీ చెప్పి, రానాకూ ఫోన్ చేస్తాడు. అందరికీ ఆ తెలివైన హంతకుడెవరో తెలుస్తుంది.

నవల చివర్న, తను ప్రేమించిన జారా తనకు అర్థమే కాలేదని గుర్తిస్తాడు కేశవ్. గోలూతో కలిసి 'జెడ్ డిటెక్టివ్స్' అన్న ఏజెన్సీ తెరుస్తాడు. 'నీ పిల్లలకు రఘు పోలికలు రావాలనుకుంటున్నావా – నల్లగా, అసహ్యంగా! కనీసం, కశ్మీరీల రంగు నిలబెట్టు.' ఫెయిజ్, జారాకు పంపిన ఇలాంటి మెసేజులు, ఉత్తరాదిలో తెల్లచర్మంపట్ల ఉండే పక్షపాతాన్ని కనపరుస్తాయి.

ముస్లిమ్/హిందూ మతవాదాలు, కశ్మీర్ సమస్యలు, హత్య గురించిన టీవీ చర్చలుండే పుస్తకమంతటా, కేవలం ఢిల్లీవాసులు మాత్రమే ఉపయోగించగలిగే, యథాలాపమైన హిందీ తిట్లూ, 'ఠర్కీ, ఆషిక్, తమీజ్, గద్దార్, పంగా' లాంటి మాటలూ కనబడతాయి.

చేతన్ భగత్ మిగతా పుస్తకాలు– భిన్నమైన కులాల, ప్రాంతాల, సంస్కృతుల జంటలు ఆఖరికి కలిసిపోవడంతో ముగిస్తే, ఇది మాత్రం కొంచెం భిన్నంగా– ఎన్నో మలుపులతో, హత్యామర్మాన్ని ఛేదించినది. అయితే, రచయిత పుస్తకాలన్నిట్లోలాగే ఇదీ ఐఐటీ నేపథ్యంతో ఉన్నదే. సంభాషణలతోనే కొనసాగుతుంది. ఉత్తమ పురుషంలో ఉండే కథనం సరళమైన వాడుక భాషలో ఉంటుంది. ఈ నవలను 2018లో ప్రచురించినది వెస్ట్‌లాండ్.

◆ కృష్ణ వేణి

## రారండోయ్

- అర్చన ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, శ్రీ శారద సత్యనారాయణ మెమోరియల్ చారిటబుల్ సొసైటీ వారి 'సాహిత్య–సాంస్కృతిక సమ్మోహనం' ఆగస్టు 23న సాయంత్రం 4 గంటలకు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జరగనుంది. ఇందులో భాగంగా కోసూరి ఉమాభారతి నృత్య డీవీడీల ఆవిష్కరణ; చంద్రకాంత కోర్నీ, భానుమతి మంథా, సంధ్య గొల్లమూడి, శ్రీధర్ నల్లమోతు, వోలేటి శ్రీరంగమణిలకు పురస్కారాల ప్రదానం ఉంటాయి.
- 'ధ్వని' సిరీస్‌లో భాగంగా ఆగస్టు 24న ఉదయం 10 గంటలకు తెలంగాణ చైతన్య సాహితి ఆధ్వర్యంలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, అఫ్జల్‌గంజ్, హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో గీతాంజలి, పొన్నాల బాలయ్య, వడ్డెబోయిన శ్రీనివాస్ కవిత్వ పఠనం; చింతకింది కాశీం కవిత్వం విశ్లేషణా ప్రసంగం ఉంటాయి.
- ఝాన్సీ కొప్పిశెట్టి నవల 'అనాచ్ఛాదిత కథ' ఆవిష్కరణ ఆగస్ట్ 24న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనుంది. ఆవిష్కర్త: ఓల్గా. నిర్వహణ: పాలపిట్ట, కవిసంగమం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ.
- డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ విమర్శ గ్రంథం 'మూడు పదులు ముప్పై కావ్యాలు' పరిచయ సభ ఆగస్టు 24న సాయంత్రం 6 గంటలకు కరీంనగర్ ఫిలింభవన్‌లో జరగనుంది. ముఖ్య అతిథి: లంకా శివరామ ప్రసాద్. నిర్వహణ: సాహితీ సోపతి.
- రాజాం రచయితల వేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 25న ఉదయం 9:30కు శ్రీకాకుళం, రాజాంలోని విద్యానికేతన్ పాఠశాలలో జరిగే కార్యక్రమంలో 'గేయం–చైతన్య ప్రవాహం' అంశంపై పిల్లా తిరుపతిరావు మాట్లాడతారు.
- వేంపల్లి అబ్దుల్ ఖాదర్ కథాసంపుటి 'మెతుకు' ఆవిష్కరణ ఆగస్టు 25న ఉదయం 10:30కు మదనపల్లెలోని జ్ఞానోదయ ఆడిటోరియంలో జరగనుంది. ఆవిష్కర్త: ఎన్. ముక్తేశ్వరరావు. నిర్వహణ: మదనపల్లె సాహితీ కళావేదిక.

## గ్రహం అనుగ్రహం

శ్రీవికారినామ సంవత్సరం. దక్షిణాయనం, వర్ష ఋతువు. శ్రావణ మాసం. తిథి బ.చవితి రా.11.50 వరకు, తదుపరి పంచమి. నక్షత్రం ఉత్తరాభాద్ర సా.5.45 వరకు, తదుపరి రేవతి. వర్జ్యం లేదు. దుర్ముహూర్తం ప.12.27 నుంచి 1.20 వరకు, తదుపరి ప.2.58 నుంచి 3.51 వరకు. అమృత ఘడియలు ప.12.28 నుంచి 1.56 వరకు

**సూర్యోదయం :** 5.46,
**సూర్యాస్తమయం :** 6.21
**రాహుకాలం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు
**యమగండం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు

**నమాజ్ వేళలు**
ఫజర్ : 4.45
జొహర్ : 12.20
అసర్ : 4.47
మగ్రీబ్ : 6.40
ఇషా : 7.55

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

పెద్దవాళ్లు చిన్నవాళ్లను అర్థంచేసుకోవడానికి
చాట్, స్కైప్, వాట్సప్‌లతో షేక్ హ్యాండ్ చేస్తున్నారు..
కాని చాదస్తాన్ని మాత్రం షేక్ చేయలేకపోతున్నారు..
మనవడికి, మనవరాలికి మధ్య వివక్షను బ్రేక్‌చేయలేకపోతున్నారు...
అవ్వ... హవ్వ... ఏంటీ చోద్యం?


ప్రతీకాత్మక చిత్రం

# అవ్వ... ఏంటీ చోద్యం?

**కా**లానికనుగుణంగా పెద్ద తరం మారుతోంది. పట్టణాల్లో ఉన్న పిల్లల కోసం, విదేశాల్లో స్థిరపడ్డ మూడో తరం కోసం చాటింగ్, స్కైప్, వాట్సాప్‌లను జీవితాల్లో భాగం చేసుకుంది. ఆ సౌకర్యాలతో రెండో తరం, మూడో తరంతో ఉన్న తమ అనుబంధాలను పటిష్టం చేసుకుంటోంది. మారిన కాలం తెచ్చిన వేగంలో పడికొట్టుకుపోతున్న పిల్లలు రక్తసంబంధాన్ని మరిచిపోకుండా ఉండడానికి పెద్దతరమే ప్రయత్నిస్తోంది. సాంకేతికతను టూల్‌గా మలచుకొని ఈ బంధాలను భద్రం చేసుకుంటోంది. ఈ విషయంలో వర్తమానానికి అప్‌డేట్ అవడమే కాదు భవిష్యత్‌లో పరుగులు పెట్టడానికీ మానసికంగా సిద్ధమై ఉన్నారు పెద్దలు. అవసరంగా భావిస్తున్నారు కూడా. మంచి పరిణామమే! అయితే ఈ చైతన్యం జెండర్ ఈక్వాలిటీ విషయంలో కనపడ్డం లేదనడానికి.. అనకాపల్లి నుంచి అమెరికా దాకా, అహ్మదాబాద్ నుంచి ఆస్ట్రేలియా దాకా, పంజాబ్ నుంచి పశ్చిమాసియా దాకా, యూపీ నుంచి యూరప్ దాకా ఉన్న భారతీయ కుటుంబాలెన్నో ఉదాహరణలు.

**పర్మినెంట్‌గా పద్దుంది**

విదేశాల్లో ఉన్న పిల్లలు, మనవలు, మనవరాళ్లను చూడ్డానికి వెళ్లిన పెద్దలు రోమ్‌లో రోమన్‌లా కనిపించడానికి జీన్స్, షర్ట్ వేసుకుంటున్నారు..కోలేని వాళ్లు జీన్స్ కుర్తీతో సర్దుకుంటున్నారు. దానికీ ఇబ్బంది పడ్డవాళ్లు సల్వార్, కమీజ్ చాలనుకుంటున్నారు. ఊహించని ఇన్ని మార్పులకు స్వాగతం పలికిన అమ్మలు, అత్తలు, అమ్మమ్మలు, నానమ్మలు ఇంటి పనులనూ అబ్బాయిలకు సమానంగా పంచేవిషయంలో మాత్రం చాదస్తం వీడట్లేదు. ‘‘అమెరికాలో ఉన్న ఎన్ఆర్ఐ జంటలు జనరల్‌గా ఇంట్లో వర్క్ షేర్ చేసుకుంటారు. ఈవెన్ టాయ్‌లెట్స్ కూడా క్లీన్ చేస్తారు. వండర్ ఏంటంటే వాళ్ల పేరెంట్స్ రాగానే మారిపోతారు. పేరెంట్స్ ఫీలవుతారని వాళ్లు వెళ్లిపోయేదాకా ఇంటి పనుల్లో హెల్ప్ చేయరు.‘‘ఎందుకా డ్రామా? కలిసి పనిచేసుకుంటాం.. చేసుకోవాలి కూడా అని సింపుల్‌గా పేరెంట్స్‌తో చెప్పొచ్చుగా’’ అంటే ‘‘ఆ .. ఎందుకులే.. నాలుగు నెలల కోసం వచ్చిన వాళ్లతో ఆర్గ్యుమెంట్స్’’ అంటూ లైట్ తీసుకుంటారు. టెక్నాలజీలోనే కాదు థాట్ ప్రాసెస్ కూడా అప్‌డేట్ చేసుకోవాలని.. అవసరమనీ పేరెంట్స్‌కు చెప్పాలి కదా’’ అంటుంది న్యూయార్క్‌లో ఎకనమిక్ ఎనలిస్ట్‌గా పనిచేస్తున్న అనుపమా మహీధర్.

**రక్షణ సంప్రదాయం**

హయ్యర్‌ఎడ్యుకేషన్ కోసం ఆడపిల్లలను అబ్రాడ్ పంపిన పేరెంట్స్ ఇండియాలో ఇంటి మూల మీదున్న షాప్‌కు తమ్ముడిని తోడిచ్చి పంపే రక్షణ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. ‘‘ప్రాజెక్ట్ వర్క్ మీద నేను ఎవ్రీ త్రీమంత్స్ ఆర్ ఫైవ్ మంత్స్‌కు ఒకసారి యూఎస్, యూరప్‌కు పోతుంటా. ప్రతీసారి ఎయిర్‌పోర్ట్‌కు మా తమ్ముడ్ని తోడు పంపిస్తరు. నవ్వొస్తుంటది. ఆ దేశంలో ల్యాండ్ అయినంక నేనొక్కదాన్నే కదా అన్నీ చూసుకోవాల్సింది. ఈ మాట మా అమ్మకు, నానమ్మకు చెప్తే ఏమంటారో తెల్సా.. ‘‘ఏదోనే నిన్నో అయ్య చేతుల్లో పెట్టేదాకా మమ్మల్నిట్ల ఉండనీ’’ అని. ఏం మాట్లాడ్తం జెప్పండి? అట్లా అనీ మా నానమ్మ, అమ్మ ఏం తెల్వనోళ్లు కారు. ఆ కాలంలనే ఎస్ఎస్ఎల్‌సీ, ఎస్ఎస్‌సీ చదివినోళ్లే. మా నానమ్మను మీరేదన్నా అడగండి.. ఉండు గూగుల్ల కొట్టి చూద్దాం అంటది. అట్లాంటి ముసలమ్మ నా విషయం వచ్చేసరికి ఇంత కన్సర్వేటివ్‌గా ఎందుకు ఉంటదో?’’ అంటుంది హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ప్రియాంక యాదవ్

**బొట్టు ఓకే.. వంటెందుకు నాట్ ఓకే?**

లాజిక్‌లేని కొన్ని ఆచారాలను వదిలేసుకున్న ఆ తరం.. పనులకు సంబంధించి ఆడ,మగ వివక్షను మాత్రం వీడట్లేదు. ‘‘ఇందుకు మా అమ్మే మంచి ఉదాహరణ’’ అంటూ తన అనుభవాన్ని పంచుకున్నారు ఈశ్వరి అనే ఒక ప్రభుత్వోద్యోగిని. ‘‘మా అమ్మ కొన్నాళ్లు నా దగ్గర, కొన్నాళ్లు మా అన్నయ్య దగ్గర ఉంటుంది. మా నాన్న పోయినప్పుడు మా అమ్మకు పసుపు కుంకుమలు తుడిచేసేలాంటి తంతును చేయనివ్వలేదు. మా నాన్న పోయినా బొట్టుపెట్టుకోవడాన్ని మా అమ్మ యాక్సెప్ట్ చేసింది. అంత ప్రొగ్రెసివ్‌గా ఉన్న ఆమె మా ఆయన వంట చేయడాన్ని యాక్సెప్ట్ చేయదు. నేను నీ దగ్గరున్నప్పుడు మీ ఆయనకు ఇంటి పనులు చెప్పొద్దు’’ అని సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చింది ఒకసారి. నేనూ వర్క్‌చేస్తాను కదమ్మా.. ఆయన హెల్ప్ చేయకపోతే ఎట్లా? నాన్న పోయినా నువ్వు బొట్టు పెట్టుకోవడం ఎంత న్యాయమో.. ఇదీ అంతే అని చెప్పబోతుంటే దానికీ దీనికీ లంకె ఏంటీ? ఇలాంటి వితండవాదం చేయొద్దంటుంది’’ అని చెప్తుంది ఈశ్వరి. ఆకలి అందరికీ సమానమైనప్పుడు ఆకలి తీర్చే ఆహారాన్ని తయారు చేయడమూ అందరికి రావాలి కదా! అది కేవలం ఆడవాళ్ల పనే ఎలా అవుతుంది?

**అది వేరు.. ఇది వేరు..**

‘‘ టెక్నాలజీ నేర్చుకోవడం, మగవాళ్లు గిన్నెలు కడగడం, బట్టలు ఉతకడం ఒకటేనా? అది వేరు, ఇది వేరు. ఆడపిల్లలు ఇష్టంగా ఉద్యోగాలు చేస్తున్నారు. కాబట్టి ఇంట్లో పని కామన్. అమ్మాయిలు జాబ్ చేయడం అమ్మాయికి గౌరవం, కానీ మగపిల్లాడు చీపురు పట్టుకుంటే ఎంత సిగ్గు? నలుగురికి తెలిస్తే వాడి పరువుంటుందా?’’ అనేది ఒక అమ్మ అభిప్రాయం. ఆమె గృహిణి కాదు. బ్యాంక్ ఎంప్లాయ్.

‘‘ఆడవాళ్లే ఇలా ఆలోచిస్తుంటే ఇక మగవాళ్లు ఇంటి పనులు ఎందుకు చేస్తారు? పుట్టుకతో చీపురు, అంట్లుతోమే పీచు, బట్టలు ఉతికే బ్రష్‌ను నడుముకి కట్టుకొని వచ్చారా ఆడవాళ్లు? అని ప్రశ్నిస్తున్నారు చాలా మంది అమ్మాయిలు. దేశమంతా ఇలాగే ఉంది అని కచ్చితంగా నిర్దేశించే కథనం కాదిది. అలాగని జెండర్ ఈక్వాలిటీ పట్ల చైతన్యం లేదు అని తెలిపిన ఈ అభిప్రాయాలనూ తప్పనలేం. దేశంలోని డెబ్బై అయిదు శాతం ఇళ్లల్లోని పరిస్థితికివి అద్దం పడ్తున్నాయన్నదీ అబద్ధం కాదు. ఇంటి పనులతోపాటు పిల్లల పెంపకాన్నీ తల్లిమీదే పెట్టింది సమాజం. ఇంట్లో మనుషులకు తగ్గట్టు, సమాజంలో పరిస్థితులకు తగ్గట్టు సర్దుకుపోగల మనస్తత్వం గల స్త్రీ.. పిల్లల పెంపకంలో చూపిస్తున్న వివక్షనూ సరిచేయాలి. ఈ బాధ్యతనూ మోస్తే భవిష్యత్‌లోనైనా జెండర్ ఈక్వాలిటీని ఆశించొచ్చు.

**– సరస్వతి రమ**



### చెప్తూ ఉంటాం..

**మా**కు నాన్న లేరు. నాకు, మా చెల్లెలికి మా అమ్మ, నానమ్మే అన్నీ! నిజానికి మా మీద మా నానమ్మ ఇంపాక్ట్ ఎక్కువ.మాతో సమానంగా కంప్యూటర్ ఆపరేటింగ్ నేర్చుకుంది. నెట్ బ్రౌజ్ చేస్తుంది. ఎఫ్‌బీలో ఫొటోస్ పెడితే మార్ఫింగ్ చేస్తారట కదా.. పెట్టుకోకండి అని చెప్తుంది. మమ్మల్ని మగపిల్లలతో సమానంగానే చూస్తుంది. కానీ మా నానమ్మ ఫ్రెండ్స్, చుట్టాల నుంచే మేం డిస్క్రిమినేష్ ఫేస్ చేస్తుంటాం. వాళ్లంతా కూడా మా నానమ్మలా అప్‌డేట్ అయినవాళ్లే. ఎబ్రాడ్‌లో ఉన్న వాళ్ల మనవళ్లతో చాటింగ్ చేస్తున్నవాళ్లే. మా విషయంలో నానమ్మ ఒపీనియన్స్‌ను మార్చాలని ట్రై చేస్తుంటారు.

**– మాదరి మౌనిక, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఉద్యోగిని, హైదరాబాద్**



### అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

**నా** చిన్నప్పుడు ఇంట్లో జెండర్ డిస్క్రిమినేషన్ చూశా. అబ్బాయిలకు కోడిగుడ్లు ఇచ్చి అమ్మాయిలకు ఇవ్వని పరిస్థితి. నిజానికి రెండు కోడిగుడ్లను నలుగురు పిల్లలకు సగం సగం ఇవ్వచ్చు. కానీ అబ్బాయిలు మోర్ ఎనర్జిటిక్‌గా ఉండాలని మాకే ఇచ్చేవాళ్లు. తర్వాత తర్వాత ఇది తప్పని తెలుసుకుంది మా అమ్మ. అప్పటి నుంచి ఇంట్లో వర్క్‌ను అంటే ఎవరు తిన్న ప్లేట్ వాళ్లే తీసి కడగాలి అని నేర్పింది. మా ఇంట్లో ఇప్పటికీ అదే పాటిస్తాం. యూనివర్సిటీ వీసీగా నాకు ప్రివిలేజెస్ ఉంటాయి. అయినా సర్వెంట్స్‌కు ఇవ్వకుండా నేనే నా ప్లేట్‌ను కడిగేస్తా. నా వైఫ్ ఉస్మానియా యూనివర్సిటీలో టీచ్ చేస్తారు. అయితే ఇప్పుడు మా అమ్మ ‘‘అదేంటి నువ్వెందుకు కడుగుతావ్? నీ వైఫ్‌కు చెప్పు.. లేదంటే సర్వెంట్స్ ఉన్నారు కదా?’’ అంటుంది. మా అమ్మేం చదుకోని ఆవిడ కాదు. ఆ కాలంలోనే ఎస్ఎస్ఎల్‌సీ చేసి ప్రైవేట్ స్కూల్‌కూడా రన్ చేసింది. తరతరాల నుంచి వస్తున్న ఈ ప్రాసెస్ పోవడానికి టైమ్ పడ్తుంది’’

**– ప్రొఫెసర్ ఇ. సురేష్ కుమార్, వైస్‌చాన్స్‌లర్, ఇఫ్లూ, హైదరాబాద్**



### ప్రాక్టికల్‌గా అవసరం కాబట్టి..

**టె**క్నాలజీ యూజ్ చేయడంలో మా అమ్మ పర్‌ఫెక్ట్. అఫ్‌కోర్స్.. ఇంటి పనుల విషయంలో యాజ్ యూజువల్‌గా ఆ డిస్క్రిమినేషన్ ఉంటుంది. బేసిగ్గా నాకు వంట చేయడం ఇష్టం కాబట్టి కుకింగ్‌లో అమ్మకు హెల్ప్ చేస్తుంటా. కానీ చిన్నప్పటినుంచి ఇంటి పనుల విషయంలో మా అక్క, చెల్లె మీదే ఫోర్స్. టెక్నాలజీ పరంగా అప్‌డేట్ అవడం ప్రాక్టికల్‌గా అవసరం కాబట్టి అవుతున్నారు. ఆడ, మగ ఈక్వల్ అనే విషయాన్ని అంతే ప్రాక్టికల్‌గా తీసుకోవట్లేదు. అందుకే ఛేంజ్ రాలేదు. మా జనరేషన్ కొంచెం బెటర్. కొంత మంది అబ్బాయిలు వంట చేస్తున్నారు. వైఫ్‌కు హెల్ప్ చేస్తున్నారు. అయితే అనుకున్నంతగా మార్పు రాలేదు అన్నది ట్రూ.

**– కెప్టెన్ బి. ప్రణీత్ కుమార్, జెట్ ఎయిర్‌వేస్, హైదరాబాద్.**

# నిర్లక్ష్యమే బరువు

**ఫలానా వాళ్ల కోడలు ఆ ఇంటి కోసం గంధం చెక్కలా అరుగుతోంది.. అనేది కాంప్లిమెంట్ కాదు .. ప్రమాదకరమైన కామెంట్! ఇల్లాలు బాగుంటేనే.. ఇంట్లోవాళ్లు బాగుంటారు.. ఈ విషయం ఇంట్లో వాళ్లకు తెలియాలంటే.. ఇల్లాలు తన కోసం స్పేస్‌క్రియేట్ చేసుకోవాలి.. తన గురించి తను పట్టించుకోవాలి.. లేదంటే ఆ నిర్లక్ష్యం బరువుగా మారి బోలెడు రోగాలను తెస్తుంది. కుటుంబం కుంటుపడేలా చేస్తుంది. “అందుకు నేనే ఎగ్జాంపుల్” అంటూ తన జీవితానుభవాన్ని చెప్పుకొచ్చారు హైదరాబాద్‌కు చెందిన యోగా టీచర్ వద్దిపర్తి రాజేశ్వరి.**


మహిళలకు యోగా నేర్పుతున్న వద్దిపర్తి రాజేశ్వరి



**నే**ను పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లో ఉన్నప్పుడు మా అమ్మకి హెల్త్ పాడైంది. ఆవిడను కంటికి రెప్పలా కాపాడుకోవలసి వచ్చింది. అమ్మకు సేవలు చేస్తూ, నా ఆరోగ్యం గురించి పట్టించుకోవడం మానేశాను. దాంతో 36 ఏళ్ల వయసులో 95 కిలోల బరువుకొచ్చేసాను. ఒబేసిటీతోపాటు వెర్టిగో, ఆర్థరైటిస్, సయాటికా, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ అన్నీ ఒంట్లో తిష్టేశాయి. మరో నెలలో అమ్మ పోతుందనగా నా గురించి నేను ఆలోచించడం మొదలుపెట్టాను. ఇన్ని బాధల నుంచి ఎప్పటికైనా విముక్తి వస్తుందా అని. అమ్మకూ నా ఆరోగ్యం గురించి బెంగ పట్టుకుంది. ‘నీ ఆరోగ్యం జాగ్రత్త’ అని అంటూ ఉండేది. ఎవ్వరూ వారి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదు అని నా జీవితం ద్వారా తెలుసుకున్నాను. నా లైఫే అందరికీ గుణపాఠం కావాలనుకున్నాను.

**యోగా సాధనతో...**



ఇన్ని అనారోగ్యాలను ఎదిరించి ఆరోగ్యంగా ఉండటం కోసం యోగా సెంటర్‌లో చేరి యోగా సాధన మొదలుపెట్టా. ఏడాది తిరిగేసరికి పదిహేను కిలోలు బరువు తగ్గాను. ఆత్మవిశ్వాసం పెరిగింది. నన్నే ఉదాహరణగా చూపించి నా చుట్టూ ఉన్నవాళ్లకు యోగా నేర్పాలన్న ఆలోచన వచ్చింది. ట్రైనింగ్ ఇచ్చేంత స్కిల్ సంపాదించుకోవడం కోసం కపిల మహర్షి ‘రీసెర్చ్ ఫర్ రిసోర్సెస్’ లో చేరి యోగాలో డిప్లొమా చేసి, ట్రైనింగ్ ఇవ్వడం మొదలుపెట్టాను. వచ్చిన వాళ్ల ఆరోగ్యంలో మార్పు కనిపిస్తుండడంతో నా క్లాసెస్‌కు అటెండ్ అయ్యే వాళ్ల సంఖ్య పెరిగింది. యోగా నేర్చుకోవడంతోపాటు ఆడవాళ్లు తమ వ్యక్తిగత సమస్యలను చెప్పుకోవడానికి నన్ను ఓ సోలేస్‌గా భావిస్తున్నారని అర్థమైంది. వాళ్లకు సలహా ఇచ్చేంత పరిణతి నాకు ఉండాలి కదా. అందుకే సరస్వతి వాసుదేవన్‌గారి దగ్గర చేరి థెరపీ కోర్సు చేశాను. ఆ తరువాత సెయింట్ ఫ్రాన్సిస్కో కాలేజీలో పి.జి. డిప్లొమా ఇన్ కన్సల్టింగ్ స్కిల్స్ నేర్చుకున్నాను. సబ్జెక్ట్ మీద మంచి పట్టు వచ్చింది. ఇప్పుడు నా దగ్గరకు వచ్చే ఆడవాళ్లందరికీ మంచి కౌన్సెలింగ్ ఇవ్వగలుగుతున్నాను.

### ఇంటి ఇల్లాలితో...

**ఇం**టిల్లిపాదికి సర్వం అమరుస్తున్న ఇల్లాలి గురించి ఎవరూ పట్టించుకోరు. ‘తిన్నావా? సరిగ్గా నిద్రపడ్తోందా? ఎక్కడికైనా వెళ్లాలనుందా?’’ అని అడగరు. వాళ్లకోసం ఆ స్పేస్ నేను కల్పిస్తున్నాను. సాధారణంగా యోగా నేర్చుకోవడానికి నా దగ్గరకి 20 నుంచి 60 ఏళ్ల వయసున్న వాళ్లు వస్తుంటారు. వచ్చీరాగానే ముందు ఈ కుశల ప్రశ్నలే వేసి వాళ్ల మీద వాళ్లు శ్రద్ధపెట్టుకునేలా మౌల్డ్ చేస్తాను వాళ్లను. అంటే ఎదుటి వాళ్లను వినడం ద్వారా హీలింగ్ చేయడమన్నమాట.

**– వద్దిపర్తి రాజేశ్వరి**

**వీటి ఆధారంగా చేస్తుంటాను..**

ఉద్యోగం, ఆహారం, కూర్చునే తీరు వంటి అనేక అంశాల మీద ఆధారపడి కౌన్సెలింగ్ ఉంటుంది. ముందు లైఫ్ స్టయిల్, మైండ్ లెవల్ గురించి తెలుసుకుంటాను. పని ఒత్తిడిలో ఉన్నవారికి బ్రీతింగ్ సరిగా ఉండదు. ఈ కారణంగా డయాబెటిస్, ఇన్‌డైజేషన్ తలెత్తుతాయి. ‘నిన్ను నువ్వు చూసుకో, నీ మీద నువ్వు శ్రద్ధ పెట్టుకో’’ అని ముందుగా చెబుతాం. వారిలో ఆత్మవిశ్వాసం ఎంతవరకు ఉందో పరీక్షిస్తాం. చాలామంది రకరకాల భయాలతో వస్తుంటారు. భయాన్ని పోగొట్టి, నలుగురిలో నిర్భయంగా మాట్లాడేలా తర్ఫీదిస్తాను. సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వారందరితోనూ చర్చిస్తాను. వాళ్లు తమ సమస్యను చూసే విధానంలో మార్పు తీసుకువస్తాను. ఇక్కడ కౌన్సెలింగ్ తీసుకున్న వాళ్లు ‘‘ఇప్పుడు ఏ సమస్య వచ్చినా బెంబేలెత్తక తేలిగ్గా తీసుకుంటూ మా పని మేం చేసుకుపోతున్నాం’’ అని చెబుతుంటే వాళ్లలో వచ్చిన మార్పుకి సంతోషమేస్తుంది.

**షేరింగ్ ఈజ్ కేరింగ్...**

‘‘మా పిల్లలు సరిగ్గా చదవట్లేదని, చెప్పినమాట వినట్లేదు’’ అంటూ కొందరు తల్లులు కంప్లయింట్ చేస్తుంటారు. పిల్లల్లో ఉన్న పాజిటివ్స్‌ని మాత్రమే చూడమని, నెగిటివ్స్‌ని భూతద్దంలో పెట్టొద్దని చెబుతుంటాను. సింగిల్ పేరెంట్స్‌లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతాను. ‘షేరింగ్ ఈజ్ కేరింగ్’ అనే పద్ధతి మీద మనసులోని మాటలను పంచుకోమని సజెస్ట్ చేస్తాను. మనిషిలో ఉన్న మంచి గురించి మాట్లాడటం వల్ల పాజిటివ్ఎనర్జీ వస్తుంది. ఎదుటి వ్యక్తి కళ్లలోకి చూస్తూ మాట్లాడటం, వాళ్లు చెప్పేది శ్రద్ధగా వినడం వల్ల వాళ్లకో భరోసా వస్తుంది, మైండ్ క్లియరై దిగులు మాయమవుతుంది.

– సంభాషణ: **వైజయంతి పురాణపండ,**
**ఫొటోలు: ఎస్. ఎస్. ఠాకూర్**



## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! నాకు ఈ మధ్యే పెళ్లి సెట్ అయ్యింది. వన్ వీక్ నుంచి ఆ అబ్బాయి నాతో మాట్లాడుతున్నాడు. తను బాగానే మాట్లాడుతున్నాడు కానీ.. నాకే ఎందుకో అతడి మాటలు నచ్చడంలేదు. ఏదో తెలియని బాధ, భయం నన్ను ఇబ్బందిపెడుతున్నాయి. లైఫ్ ఎలా ఉంటుందోనని టెన్షన్‌గా ఉంది. ప్లీజ్ నా ప్రాబ్లమ్‌కి మీరే సొల్యూషన్ చెప్పండి.

– పావని

మాటల్లో సెక్స్ మాటలు ఉంటే వాడికి సంసారంలోని గొప్పతనం తెలియనట్టే..

మాటల్లో కరుకుతనం ఉంటే వాడికి సంసారంలోని సున్నితత్వం తెలియనట్టే..

మాటల్లో అత్యాశ ఉంటే వాడికి సంసారంలోని పంచుకోవడం తెలియనట్టే..

మాటల్లో చీదరింపు ఉంటే సంసారంలోని మహిళ ఔన్నత్యం తెలియనట్టే..

మాట్లలో అతివిశ్వాసం ఉంటే సంసారంలోని ఒడిదుడుకులు తెలియనట్టే...

మాటల్లో...

*'ఆపండి సార్! మాటల్లో.. మాటల్లో.. మాటల్లో.. అంటూ పావనీని పెళ్లి చేసుకోనివ్వరా ఏంటీ? బెదిరిపోతుంది సార్. ఆల్‌రెడీ అదిరి ఉంది. మీ మాటల్లో బెదిరిపోతుంది సార్. ఎందుకు సార్ మీకు ఈ భయం. అమ్మాయిలూ ఏదో అయిపోతారు.. మోసపోతారు.. కృంగిపోతారు.. అని అనుకుంటారేంటీ సార్? అమ్మాయిలు బలవంతులు.. శక్తివంతులు.. అని ఎందుకు అనుకోరు సార్? ఇలా మీ నీడలో ఉంచుకుంటూ ఉంటే వాళ్లు ఎప్పుడు ఎదుగుతారు సార్? అదేదో సినిమాలో హీరో రవితేజ 'ఏం మీ అమ్మాయిలకు పెళ్లిళ్లు కావా?' అని అడిగినట్లు.. మీ మాటలు వింటే కావేమో అనే అనిపిస్తుంది సార్!'*

ఆపుతావా నీలూ?? నీ ఆవేశం భరించలేకపోతున్నాను. పావనీతో.. వాడు ఏం మాట్లాడితే తనకు బెరుకు అనిపించిందో తెలియదు. అందుకే పావనీకి చెబుతున్నా.. అబ్బాయికి సంసారం గొప్పతనం చెప్పి పెళ్లి చేసుకోమని.

*'ఓ..ఓహో.. ఓహోహో.. అలా అయితే ఓకే సార్!'*

**ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.**

**లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబర్ 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.**
lovedoctorram@sakshi.com

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కటౌట్ చేయ్...దాచేయ్...

**పల్లవి :**
మీ ఇంటికి ముందో గేటు
అది దూకాలంటే డౌటు
మీ రోడ్లో వెలగదు లైటు
నాకసలే తెలియని చోటు
ఆ గేటుకు ముందో డాగు అది అంది బాబు ఆగు
దాని నోట్లో ఎన్నో పళ్లు
అది చూస్తే వణికెను ఒళ్లు
మీ ఇంటికి ముందో బెగ్గర్
అడొంటికి చిల్లుల నిక్కర్
ఆడి కంటికి నేనో జోకర్‌లాగా కనిపిస్తున్నానే
నువు మేల్కొని బాల్కని గోడని దూకేస్తే
తీసేద్దాం తీసేద్దాం ప్రేమ తాట తీసేద్దాం
చేసేద్దాం చేసేద్దాం పెళ్లి పండగ చేసేద్దాం
॥తీసేద్దాం॥

**చరణం : 1**
హే... కోఠిలో ఉందో కాఫీ హౌస్
క్యాప్చినోకి అది ఫేమస్
నురగలు కక్కే కాఫీ కప్స్
తగిలాయో నీ చెర్రీ లిప్స్
టేబుల్ కింద చేతులు చేస్తాయి ఎంతో రొమాన్స్
ఓయ్ కాఫీ తాగేదా నీ ఫేస్
నీ ఎదవ ఐడియా నాకు తెలుసు
జబ్బలు దాచని స్లీవ్ లెస్
మోకాలు దాటని మినీ స్కర్ట్స్
ఆకలి నిండిన నీ చూపులతో ఎంతో న్యూసెన్స్
హేయ్ అట్టా కాదే చిట్టీ నాకో నాటీ థాటే తట్టి
అందరి ముందర పట్టి నీకో ఫ్రెంచ్ ముద్దే పెట్టి
నా ఊపుకి షాప్‌కి టాప్ లేచిపోయేలా
॥తీసేద్దాం॥

**చరణం : 2**
ఓల్డ్ సిటీలో ఉందో సినిమా హాలు
అక్కడ ఆడేవన్ని లవ్‌స్టోరీలు
పాప్‌కార్న్ తింటూ ఒకటో రీలు
పావ్‌బాజీతో ఇంటర్వెల్
పావుగంటకో డ్యూయెట్
చూస్తూ దిద్దేద్దాం ప్రేమ అ ఆ లు
ఆపరా బాబు కహానీలు
పెట్టకు నాకు చెవిలో పూలు
ఖాళీ హాల్లో కార్నర్ సీటు
ఒకే కూల్ డ్రింక్ రెండు స్ట్రాలు
అక్కడ ఇక్కడ చేతులు
వేస్తూ చేస్తావెన్నో ఎక్స్‌ట్రాలు
హేయ్ అల్లా కాదే పిల్ల నీతో నేనే వేగేదెల్లా
అల్లా జీసస్ మళ్లా పుట్టి నిన్నే నమ్మించాలా
నా మాటిని మ్యాట్నీ ఆటకు వచ్చేస్తే
॥తీసేద్దాం॥

**చిత్రం : జులాయి (2012)**
**రచన : శ్రీమణి**
**సంగీతం : దేవిశ్రీ ప్రసాద్**
**గానం : సాగర్, రనీన రెడ్డి**

# ఆ అబ్బో... అనేది ఇంటర్‌నేషనల్ లెవల్లో వినిపించింది - కృష్ణంరాజు


● అనిల్ తడానీ, చంకీ పాండే, మురళీ శర్మ, సుజిత్, శ్రద్ధా కపూర్, ప్రభాస్, ప్రమోద్, విక్కీ, అరుణ్ విజయ్, సుప్రీత్

''హాలీవుడ్ సినిమాలతో పోటీ పడగల గొప్ప సినిమా 'సాహో' అని చాలామంది ఫోన్లు చేశారు. ప్రభాస్‌తో ఈ సినిమా గురించి 'ఏం కంగారు పడొద్దు. నీ కష్టానికి తగ్గట్టు ఈ సినిమా చాలా పెద్ద విజయం సాధిస్తుంది' అని చెప్పాను. ప్రభాస్ అంతర్జాతీయ స్టార్ కావాలని కోరుకుంటున్నాను'' అని కృష్ణంరాజు అన్నారు. ప్రభాస్ హీరోగా సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'సాహో'. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్, విక్కీ నిర్మించారు. ఇందులో శ్రద్ధాకపూర్ కథానాయికగా నటించారు.ఈ నెల 30న రిలీజ్ కానున్న ఈ చిత్రం ప్రీ-రిలీజ్ ఫంక్షన్ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ– ''సాహో' ఫస్ట్ టీజర్ రిలీజ్ అయినప్పుడు చాలా ఫోన్లు వచ్చాయి. ప్రభాస్ ఇంకా కనిపించాలన్నారు. ఆ తర్వాత విడుదల చేసిన పోస్టర్లు బాగున్నాయన్నారు. టీజర్‌కు ఆహా.. ఓహో అన్నారు. ట్రైలర్ విడుదల తర్వాత అబ్బో అన్నారు. ఆ అబ్బో అనేది ఇంటర్‌నేషనల్ లెవల్‌కి వెళ్లింది. ఇంటర్‌నేషనల్ స్టంట్ మాస్టర్ కెన్నీ బెట్స్.. 'కంప్యూటర్ గ్రాఫిక్స్ లేకుండా కొన్ని ఫైట్స్‌ని ప్రభాస్ బాగా చేశాడు' అన్నారు. చాలా హ్యాపీ. ప్రభాస్ చాలా కష్టపడ్డాడు. నా అనుభవంతో చెబుతున్నా.. 150 పర్సెంట్ ఏం తేడా ఉండదు. సినిమా విడుదల తర్వాత సుజిత్ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ అవ్వాలని రాజమౌళిగారు ఆశీర్వదించారు. నేను తథాస్తు అంటున్నాను. వంశీ, ప్రమోద్‌లు చాలా కష్టపడ్డారు'' అన్నారు కృష్ణంరాజు.


● కృష్ణంరాజుతో ప్రభాస్

**ప్రభాస్ మాట్లాడుతూ –** ''ఫ్యాన్స్.. డై హార్డ్ ఫ్యాన్స్..' డైలాగ్ రాసింది సుజితే. తనకి మాస్ పల్స్ తెలుసు. కెమెరామేన్ మదిగారు యూవీ ఫ్యామిలీలో ఒకరు అయిపోయారు. సాబు సిరిల్‌గారిని ఈ సినిమా చేయమని నేనే అడిగాను. నన్ను ఎగ్జైట్ చేస్తేనే చేస్తాను అన్నారు. నచ్చింది.. చేశారు. టీమ్ అందరికీ థ్యాంక్స్. అనిల్ తాడానీగారే 'బాహుబలి' సినిమాను హిందీలో డిస్ట్రిబ్యూట్ చేశారు. 'సాహో'కు ఫస్ట్ డే నుంచి సపోర్ట్ చేశారు. టీ సిరీస్ భూషణ్ కుమార్‌గారు రావడానికి కుదర్లేదు. సుజిత్ 22 ఏళ్లకి 'రన్ రాజా రన్' చేశాడు. 24 ఏళ్లకి 'సాహో' కథ చెప్పాడు. కథ చెప్పడం కూడా 40 ఏళ్ల అనుభవం ఉన్నవాడిలా చెప్పాడు. ప్రీ– ప్రొడక్షన్ కోసం ఏడాది కష్టపడ్డాడు. షూటింగ్ స్టార్ట్ అయినప్పుడు ఎలా హ్యాండిల్ చేస్తాడని కంగారు పడ్డాం. తను హ్యాండిల్ చేసిన విధానానికే గ్రేటెస్ట్ డైరెక్టర్ అయిపోతాడనుకుంటున్నాను. ఇంత పెద్ద సినిమా చేయడం జోక్ కాదు. సుజిత్ ఇంటర్నేషనల్ లెవల్‌కి వెళ్లిపోతాడని అనుకుంటున్నాను. శ్రద్ధా రెండేళ్లుగా ఈ సినిమా కోసం పని చేశారు. ఒక్క రోజు కూడా ప్రొడక్షన్‌కి ప్రాబ్లమ్ రాలేదు. తను సూపర్ పెర్ఫార్మర్. యాక్షన్ సీన్లు ఇరగదీసింది. ఏడాదికి రెండు సినిమాలు చేసి మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేస్తాను' అని 'బాహుబలి' అప్పుడు చెప్పాను. మిస్ అయ్యాను. ఈసారి మాట ఇవ్వకుండా చేయాలనుకుంటున్నాను. అనుకున్నదాని కంటే యూవీ వాళ్లు పెద్దగా చేశారు. 100 కోట్లు లాభం వచ్చేది జాగ్రత్తగా చేసుకుంటే. దాన్ని వదిలేసుకొని ఈ సినిమాను ఇలా ఖర్చుపెట్టి చేశారు. వాళ్లు నా ఫ్రెండ్సే. ఫ్రెండ్స్ అందరం కలసి పెరిగాం. వాళ్ల గురించి చెప్పడం నాకు ఇష్టం ఉండదు. అందరికీ అలాంటి ఫ్రెండ్స్ ఉండాలి'' అన్నారు.

**రాజమౌళి మాట్లాడుతూ –** ''ఏ హీరో ఫ్యాన్స్ అయినా వాళ్ల హీరో సినిమా హిట్ అవ్వాలనుకుంటారు. అందరి హీరోల ఫ్యాన్స్ ప్రభాస్ సినిమా హిట్ అవ్వాలనుకుంటారు. ప్రభాస్ ఎవ్వరి గురించి తప్పుగా మాట్లాడడు. తన చుట్టూ ఎప్పుడూ పాజిటివిటీ ఉంటుంది. అదే అంత మంది ఫ్యాన్స్‌ని తెచ్చిపెట్టింది. ప్రభాస్‌కి దూరదృష్టి ఎక్కువ. 'బాహుబలి' తర్వాత ఏ సినిమా చేయాలి అని చాలా తపన పడ్డాడు. ఒకరోజు ఎగ్జైటింగ్‌గా వచ్చి సుజిత్ సూపర్ కథ చెప్పాడు అన్నాడు. కథని నమ్మి సినిమా చేశాడు. సుజిత్ చిన్న కుర్రాడు. చాలామంది చాలా సందేహించారు. ఫస్ట్ లుక్, టీజర్, ట్రైలర్‌కి అందరికీ అర్థం అయిపోయింది. సుజిత్ కంగ్రాట్స్. ప్రొఫెషనల్ డైరెక్టర్‌లా చేశావు. అతని భుజాల మీదే సినిమా నిలబడింది. వంశీ, ప్రమోద్‌కి సింహాలకి ఉండే గుండె ఉన్నట్టుంది. ప్రభాస్ ఏం అడిగినా కళ్లు మూసుకొని ఖర్చుపెడతారు. అందరూ సుజిత్ కథను నమ్మారు. అందుకే నాకు సినిమా మీద నమ్మకం. చాలా పెద్ద రేంజ్, రికార్డ్ క్రియేట్ చేస్తుంది. పెట్టిన డబ్బులకు డబుల్ ట్రిపుల్ రావాలి. సెట్లు, వీఎఫ్ఎక్స్, అన్నీ బాగా కుదిరాయి. సూపర్ బ్లాక్‌బస్టర్ అవుతుంది'' అన్నారు.

''ప్రభాస్‌లాంటి మిత్రుడు మన జీవితంలో ఉంటే ఇంకేం అక్కర్లేదు... ప్రభాస్ బాలీవుడ్‌లోనూ పెద్ద స్టార్ అయినందుకు సంతోషంగా ఉంది. తెలుగు ఇండస్ట్రీని ప్రభాస్ ఇంకా.. వెయ్యికోట్లు, 2 వేల కోట్ల బడ్జెట్ స్థాయికి తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను'' అన్నారు దర్శకుడు వీవీ వినాయక్.

''మా అమ్మకు 80 ఏళ్లు. 'సాహో' ఫంక్షన్‌కి వెళ్తున్నాను అంటే.. 'రేయ్ కుర్రాడు ఒడ్డూ పొడుగు బావుంటాడు.. మీ నాయనలాగా' అన్నారు మా అమ్మ. 'అవును.. ప్రభాస్ చూడటానికి భలే ఉంటాడు' అని మా ఆవిడ చెప్పింది. 'నాకు ఫస్ట్ డే టికెట్స్ కావాలిరా' అని మా సిస్టర్, 'నాకు 10–15 టికెట్స్ కావాలి. ప్రభాస్ కోసం కాలేజ్ ఎగ్గొట్టొచ్చు' అంటుంది మా మేనకోడలు. నాలుగు జనరేషన్స్‌లో తనకు ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. రెండేళ్ల క్రితం రాజమౌళితో కలసి మ్యాజిక్ చేశారు. ఈ సినిమా దానికంటే పెద్ద హిట్ అవ్వాలి'' అన్నారు నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి.

''ప్రభాస్ ఇప్పుడు ఆల్ ఇండియా స్టార్స్ రేంజ్‌కి ఎదిగిన మన తెలుగువాడు. ఇంత పెద్ద హీరో అవ్వడం గర్వించదగ్గ విషయం. నిర్మాతలు భయం లేకుండా ఖర్చుపెట్టారు. అందరికీ ఆల్ ది బెస్ట్'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్.

''నన్ను చూసి సినిమాల్లోకి వచ్చామని వంశీ, ప్రమోద్, విక్కీలు అంటుంటారు. కానీ ఇప్పుడు వారిని చూసి ఆల్ ఇండియా ఫిల్మ్ ఎలా తీయాలో నేను నేర్చుకుంటున్నాను. 'బాహుబలి' లాంటి సినిమాను ఆల్ ఇండియా స్థాయికి తీసుకుని వెళ్లడానికి రాజమౌళిగారికి 15 ఏళ్లు పట్టింది. సెకండ్ సినిమాతోనే ప్రభాస్‌తో సినిమా తీశాడు సుజీత్'' అన్నారు 'దిల్' రాజు.'సాహో' టీమ్‌తో, ప్రభాస్‌తో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్‌పీరియన్స్'' అన్నారు శ్రద్ధా కపూర్.

''నేను షార్ట్‌ఫిల్మ్స్ చేస్తున్న రోజుల్లో నా దగ్గర ఉన్న ఓ డీవీడీ యువీ క్రియేషన్స్ వాళ్ల దగ్గరకు వెళ్లింది. స్క్రీన్‌ప్లే బాగా రాస్తున్నాడు పిలవండి అన్నారు ప్రభాస్. నేను వెళ్లలేదు. తర్వాత యువీ క్రియేషన్స్‌కి వెళ్లి ప్రభాస్‌ని కలిసినప్పుడు 'ఏంటి డార్లింగ్ అప్పుడు రాలేదు' అన్నారు. ప్రభాస్‌గారు 100 టీబీ హార్డ్‌డిస్క్. మాట్లాడినవన్నీ ఆయనకు గుర్తుంటాయి. 'బాహుబలి' తర్వాత నాతో పని చేస్తున్నప్పుడు అంతే కష్టపడ్డారు. గౌరవించారు. ప్రభాస్ అన్నా మీకు ఎలా థ్యాంక్స్ చెప్పాలో కూడా నాకు తెలియదు. వీడు తీయగలడా అని కొందరు అడిగారు. ప్రతిసారీ నన్ను నమ్మారు. వంశీ, ప్రమోద్, విక్కీ.. నాకు ముగ్గురు అన్నలు.'' అన్నారు సుజీత్.

ఈ కార్యక్రమంలో దర్శకుడు రాధాకృష్ణ, నిర్మాత విజయ్ చిల్లా, నటులు అరుణ్ విజయ్, మురళీ శర్మ, ఆర్ట్ డైరెక్టర్ సాబు సిరిల్, గేయ రచయిత కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'సాహో' సినిమా కోసం వాడిన గన్స్, కత్తులు, కార్లు, క్రేన్స్ అన్నింటినీ ఈ వేడుకలో ప్రేక్షకుల వీక్షించడం కోసం ఏర్పాటు చేశారు.


● జాన్వీ కపూర్

## దెయ్యాల కథలు చెబుతా

**భూత**, ప్రేత కథలను చూపిస్తానంటున్నారు జాన్వీ కపూర్. భయాన్ని ఎంజాయ్ చేస్తూ ఎంటర్‌టైన్ కావాలనే షరతు కూడా పెట్టారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో సత్తా చాటేందుకు తొలిసారి 'ఘోస్ట్ స్టోరీస్' అనే వెబ్ సిరీస్‌కు సైన్ చేశారు జాన్వీ కపూర్. జాన్వీకి జోడీగా 'గల్లీబాయ్' ఫేమ్ విజయ్ వర్మ నటిస్తున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో బాగా పాపులరైన 'లస్ట్‌స్టోరీస్'కు దర్శకత్వం వహించిన జోయా అక్తర్, అనురాగ్ కశ్యప్, కరణ్ జోహార్, దిబాకర్ బెనర్జీల ఆధ్వర్యంలో ఈ 'ఘోస్ట్ స్టోరీస్' రూపొందనుంది. 'లస్ట్ స్టోరీస్' మాదిరిగానే ఇందులో నాలుగు విభాగాలు ఉంటాయి. జోయా అక్తర్ దర్శకత్వంలో రూపొందనున్న భాగంలో జాన్వీ, విజయ్ నటిస్తారు. ఆల్రెడీ షూటింగ్ కూడా మొదలైంది. మరి.. లస్ట్ స్టోరీస్‌లా ఈ 'ఘోస్ట్ స్టోరీస్' సిరీస్ కూడా డిజిటల్ ఆడియన్స్‌ను మెప్పిస్తుందా? వెయిట్ అండ్ సీ.

# ఏ కథకైనా ఎమోషన్సే ముఖ్యం

''ఇతర భాషల్లో హిట్ అయిన సినిమాలు ఆ భాషల్లో ఎందుకు హిట్ అయ్యాయో అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకుని, ఇక్కడి ప్రేక్షకులకు నచ్చేలా ఎలా తీయాలో ఆలోచించుకోవాలి. అప్పుడు కచ్చితంగా మన వాళ్లకు నచ్చే సినిమా తీయొచ్చు'' అన్నారు దర్శకుడు వెంకట్ రామ్‌జీ. పీవీపీ నిర్మాణంలో రామ్‌జీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎవరు'. అడివి శేష్, రెజీనా, నవీన్ చంద్ర ముఖ్య పాత్రల్లో నటించారు. స్పానిష్ థ్రిల్లర్ 'ది ఇన్విజిబుల్ గెస్ట్' చిత్రానికి ఇది తెలుగు రీమేక్. 'ఎవరు' గత గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా వెంకట్ రామ్‌జీ చెప్పిన విశేషాలు.


● వెంకట్ రామ్‌జీ

● ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో దర్శకుడు గుణ్ణం గంగరాజుగారి దగ్గర ఓ సీరియల్‌కు స్క్రీన్‌ప్లే రచయితగా పని చేశాను. ఆ తర్వాత వరుణ్ సందేశ్ 'కుర్రాడు' సినిమాకు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పని చేశాను. ఆ తర్వాత రాఘవేంద్రరావుగారి అబ్బాయి ప్రకాశ్‌తో కలసి పని చేశాను. ఆతను తీసిన 'అనగనగా ఓ ధీరుడు' సినిమాలో ఓ చిన్న పాత్ర చేశాను. ఆ తర్వాత కొన్ని సినిమాలకు లైన్ ప్రొడ్యూసర్‌గా, ఆ తర్వాత పీవీపీ సంస్థలో 'క్షణం, సైజ్ జీరో, ఊపిరి, బ్రహ్మోత్సవం' సినిమాలకు మార్కెటింగ్ విభాగంలో పని చేశాను.

● పీవీపీగారికి ఒక కథ చెబుదాం అనుకున్నప్పుడు ఆయనే నాకో పాయింట్ చెప్పి ఎలా ఉంది? అని అడిగారు. ఆ స్పానిష్ సినిమా ఇంతకుముందే చూశాను. కానీ దాన్ని వీళ్లు చూసిన కోణం నాకు చాలా నచ్చింది. అప్పటి నుంచి ఆ కథ మీద వర్క్ చేయడం మొదలుపెట్టాం. ఏ కథలో అయినా అందులో ఎమోషన్స్‌ను ప్రేక్షకుడు ఫీల్ అవ్వాలి. అందుకే ఆ కథకు ఎమోషన్స్ యాడ్ చేశాను. ఏ కథకైనా ఎమోషనే ముఖ్యం అని నమ్ముతాను.

● గత పదేళ్లలో చిన్న సినిమా పెద్ద విజయం అనే ట్రెండ్‌ను 'క్షణం' క్రియేట్ చేసింది. పీవీపీగారు రాజకీయాల్లో బిజీ అయిపోయి 'క్షణం' లాంటి చిన్న సినిమా చేయాలనుకున్నారు. 'క్షణం' చిత్రబృందంలోని చాలామంది 'ఎవరు'కి పని చేశారు.

● 'క్షణం, గూఢచారి' సినిమాలకు అన్ని బాధ్యతలను శేష్ భుజాన వేసుకున్నాడు. ఈ సినిమాకి వచ్చేసరికి చాలా అలసిపోయాడు. ఈ సినిమాలో రైటింగ్ పరంగా ఏం చేయకపోయినా రైటర్స్‌కి మంచి గైడెన్స్ ఇచ్చాడు. ఆల్రెడీ రెండు థ్రిల్లర్స్ చేశాడు. ఎక్కడ థ్రిల్ చేయాలో తనకు ఐడియా ఉంటుంది. అలాగే అబ్బూరి రవిగారు కూడా డైలాగ్స్ అద్భుతంగా రాశారు.

**నన్ను, శేష్‌ని 'మీరు అమెరికాలో చదివి వచ్చిన బ్యాచ్. మీకు మాస్ సినిమా తీయడం రాదు. జూబ్లీ హిల్స్, బంజారా హిల్స్ బ్యాచ్' అని పీవీపీగారు తిడుతుంటారు. కానీ ఇవాళ మా 'ఎవరు' అన్ని సెంటర్స్‌లో సూపర్‌గా కనెక్ట్ అవ్వడం సంతోషంగా ఉంది.**

● సమీరా పాత్రకు రెజీనా బాగా సూట్ అయ్యారు. 'అ!' నుంచి విభిన్నమైన సినిమాలు చేస్తున్నారామె. తన కళ్లతోనే అన్ని భావాలను చూపించగలరు. నవీన్ చంద్ర కూడా బాగా చేశాడు. సినిమాలో సర్‌ప్రైజ్ చేసింది నిహాల్ చేసిన ఆదర్శ్ పాత్ర.

● ఈ సినిమా 70 శాతం పూర్తయినప్పుడే విజయం మీద నమ్మకం వచ్చేసింది. రఫ్ కట్ నుంచి ఫైనల్ వెర్షన్‌కు పెద్దగా ఎడిటింగ్ ఏమీ లేదు. కేవలం నిమిషం మాత్రమే కట్ చేశాం. నా స్క్రిప్ట్ 118 పేజీలు ఉంటే మా సినిమా నిడివి కూడా కేవలం 118 నిమిషాలే ఉంది.

● 'ఎవరు' చూసి ఇండస్ట్రీలో చాలామంది మెచ్చుకున్నారు. అడ్వాన్స్ ఇస్తామని నిర్మాతలు ఎవ్వరూ ఫోన్ చేయలేదు. బహుశా నా నంబర్ వాళ్ల దగ్గర లేదనుకుంటా (నవ్వుతూ). నా నెక్ట్స్ సినిమా కూడా థ్రిల్లర్ జానర్‌లోనే ఉంటుంది.


● రకుల్



అదే పనిగా పని చేస్తున్నప్పుడు వెకేషన్ అవసరం. రిలాక్స్ అయితేనే కదా మళ్లీ మరింత శ్రద్ధగా, జోష్‌గా పని చేయగలిగేది. ప్రస్తుతం రకుల్ ప్రీత్‌సింగ్ కూడా రిలాక్స్ మోడ్‌లో ఉన్నారు. ఆమె నటించిన 'దే దే ప్యార్ దే, మన్మథుడు 2' సినిమాలు ఇటీవల విడుదలయ్యాయి. ఆల్రెడీ 'ఇండియన్ 2' సెట్స్‌కి కూడా హాయ్ చెప్పేశారు. చిన్న బ్రేక్ దొరికింది. దాంతో ఇబిజా (స్పెయిన్) సముద్ర తీరాన సేద తీరడానికి వెళ్లారు. మెడిటెరనేనియన్ సముద్ర తీరాన ఎంజాయ్ చేస్తూ, ఆ ఫొటోలను క్లిక్‌మనిపించారు. ఇక్కడ కనిపిస్తున్న ఫొటోలు అవే.

# రథసారథుల రజతోత్సవ వేడుక



● వెంకటేశ్వరరావు, అమ్మిరాజు, 'దిల్' రాజు, సి. కల్యాణ్, కేయస్ రామారావు

''ఒక సినిమా ఆరంభం కావడానికి ముందే ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ వర్క్ స్టార్ట్ అవుతుంది. అలాంటి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ 25 ఏళ్లు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా జరపబోతున్న రజతోత్సవ వేడుకకు మా వంతు సహకారం అందిస్తాం. దాసరిగారు ఉండి ఉంటే ఈ వేడుక మరో రేంజ్‌లో జరిగి ఉండేది'' అన్నారు నిర్మాతల మండలి అధ్యక్షుడు సి. కల్యాణ్. తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ (టీసీపీఈయూ) స్థాపించి 25 ఏళ్లు అయిన సందర్భంగా 'తెలుగు సినీ రథసారథుల రజతోత్సవ వేడుక'ను సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ఈ విశేషాలు తెలియజేయడానికి పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ''ఒక సినిమా ఆరంభం అయి, రిలీజ్ అయ్యేవరకు ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ పాత్ర చాలా ముఖ్యం. నిర్మాతలుగా మా పేరు పడినా వారిదే ఎక్కువ కష్టం ఉంటుంది. వారి సంక్షేమం కోసం జరుపుతున్న ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తాం'' అన్నారు కేయస్ రామారావు, 'దిల్' రాజు. దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్. శంకర్, 'మా' అధ్యక్షుడు వీకే నరేశ్, జీవితా రాజశేఖర్, రాజీవ్ కనకాల తదితరులు వేడుక విజయవంతం కావడానికి సహకరిస్తామన్నారు. టీసీపీఈయూ అధ్యక్షుడు అమ్మిరాజు, జనరల్ సెక్రటరీ ఆర్. వెంకటేశ్వర రావు, కోశాధికారి సతీష్ తదితరులు వేడుకను దిగ్విజయం చేయాలని కోరారు.

# భారత వరల్డ్ రికార్డు సాధించిన ఆదిత్య


● తలసాని శ్రీనివాస యాదవ్, సుధాకర్ గౌడ్, నరేందర్

**సం**తోష్ ఫిల్మ్ పతాకంపై శ్రీలక్ష్మీ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు నిర్మించిన బాలల చిత్రం 'ఆదిత్య'. ఈ చిత్రానికి భారత వరల్డ్ రికార్డు లభించింది. మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, భారత వరల్డ్ రికార్డు ప్రతినిధి నరేందర్ ఈ అవార్డును 'ఆదిత్య' దర్శకుడు భీమగాని సుధాకర్ గౌడ్‌కు అందజేశారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో వేలాది చిత్రాలు ప్రదర్శనకు రాగా, అందులో ఎనిమిది చిత్రాలనే భారత ప్రభుత్వం ఎంపిక చేసింది. నాలుగో చిత్రంగా 'ఆదిత్య' నిలిచింది.



సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
19-8-2019

పరిచయం రాజేశ్వరి

'నేనాటోవాణ్ణి... న్యాయమైన రేటువాణ్ణి' అన్నాడు బాషా సినిమాలో రజనీకాంత్. 'రాజీ లేని పోరాటం నాది... న్యాయమైన విజయం నాది' అంటోంది చెన్నై రాజేశ్వరి. రాజీ లేని పోరాటం చేయడం వల్లనే రాజేశ్వరి... రాజీ అక్క అయింది. ఆటో అక్కగా... ఆటో రాజీగా పలువురికి రోల్ మోడల్‌గా మారింది.

# ఆటో అక్క




జీవితంలో అనేక ప్రశ్నలుంటాయి. అడుగడుగునా ఒక ప్రశ్నార్థకం ఎదురవుతూనే ఉంటుంది. ప్రతి ప్రశ్నార్థకానికీ ఓ సమాధానం తప్పకుండా ఉండి తీరుతుంది. అయితే ఆ సమాధానం ఏంటో... ఎక్కడుందో వెతికి పట్టుకోవాలి. సమాధానం కోసం శోధన జరగాలి, అంతకంటే పెద్ద పరిశ్రమ జరగాలి. సమాధానాన్ని వెతికి పట్టుకోగలిగిన వాళ్లకు... విజయం కళ్ల ఎదుట ఆవిష్కారమవుతుంది.

రాత్రి తొమ్మిది గంటలకు చెన్నైలో ఓ ప్రైవేట్ కంపెనీ నుంచి ఒక ఆటో బయలుదేరింది. ఆ ఆటో నంబరు TN 01, AE 5608. అడయార్‌లో ఇంటి ముందు ఆటో దిగిన యువతి మీటరు లెక్క చూసి డబ్బిచ్చింది. ఆటో నడుపుతున్న మహిళ చిల్లర తిరిగి ఇస్తూ... ఆటో దిగిన యువతికి తన ఫోన్ నంబరు చెప్పింది. ''రాత్రంతా డ్యూటీలోనే ఉంటాను. ఎప్పుడు అవసరమైనా ఫోన్ చేయండి. మిమ్మల్ని క్షేమంగా గమ్యం చేరుస్తాను. అయితే ఓ గంట ముందుగా ఫోన్ చేస్తే మీరున్న చోటుకి వచ్చి పికప్ చేసుకోగలుగుతాను'' అని కూడా చెప్పింది. ''అంటే ఆఫీస్‌లో లేట్ అయినప్పుడు ఫోన్ చేస్తే వచ్చి పికప్ చేసుకుంటారా'' అని అడిగిందామె ఆటో మహిళను. అవునన్నట్లు ఆమె తలూపుతూ... మాటల్లో ఉండగానే ఆటో నడుపుతున్న మహిళ ఫోన్ మోగింది. ''ఎయిర్ పోర్ట్ డ్రాపా? మీరెక్కడున్నారు'' అని అడుగుతూ ఆటో రివర్స్ చేసుకుందామె. ఆమె పేరు రాజేశ్వరి. చెన్నై వాసులకు ఆమె 'ఆటో రాజీ, రాజీ అక్క, ఆటో అక్క'గా పరిచయం.

## కోయంబత్తూరు గాయం

రాజేశ్వరిది కేరళలోని పాలక్కాడ్. బి.ఎ ఫిలాసఫీ చేసింది. పాలక్కాడ్‌లో బి.ఎ చదువుతున్నప్పుడే ఆమెకి అశోక్ పరిచయమయ్యాడు. అశోక్ ఆటో నడుపుతాడు. వాళ్ల ప్రేమ పెళ్లి పీటలెక్కింది. ప్రేమ నుంచి పెళ్లి వరకు సమాజం నుంచి ఎదురైన సమస్యలు, పెళ్లి తర్వాత జీవితం చూపించిన కష్టాలను చెప్పడం మొదలుపెడితే రోజంతా చెప్పినా పూర్తి కావు. కానీ వాటిని ఎవరితోనూ పంచుకోవడానికి ఇష్టపడరామె. ''మా జీవిత ప్రస్థానాన్ని కోయంబత్తూర్‌లో మొదలుపెట్టాం'' అని మాత్రమే చెప్తుంటారు. పెళ్లి తర్వాత కోయంబత్తూరులో ఒక ట్రావెల్ ఏజెన్సీలో అకౌంటెంట్‌గా ఉద్యోగంలో చేరారు రాజేశ్వరి. ఆమె ఉద్యోగం, అశోక్ ఆటో రాబడితో బతుకు బండి గాడిన పడింది అనుకునే లోపే ఊహించని ఉత్పాతం బాంబు పేలుడు రూపంలో ఎదురైంది. కోయంబత్తూరులో 1998, ఫిబ్రవరి 14వ తేదీన... ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్‌కే అద్వానీ మీటింగ్ ఉందా రోజు. అద్వానీని లక్ష్యంగా చేసుకున్న దుండగులు నగరంలో పదకొండు ప్రదేశాల్లో బాంబులు పేల్చారు. మొత్తం పన్నెండు బాంబులు. ఆ పేలుళ్లలో 58 మంది మరణించగా, రెండు వందలకు పైగా అమాయకులు గాయాలపాలయ్యారు. బాంబు పేలుళ్ల కారణంగా గాయాలపాలైన బాధితుల్లో రాజీ దంపతులు కూడా ఉన్నారు. ఆ దుర్ఘటన తర్వాత రాజేశ్వరి దంపతులకు కోయంబత్తూరులో నివసించడం కష్టమైంది. రాజేశ్వరి సోదరుడు చెన్నైలో రైల్వే ఉద్యోగి. అతడి అండతో రాజేశ్వరి కుటుంబం చెన్నైకి చేరింది.

## చెన్నైలో జీవన పోరాటం

రాజేశ్వరి దంపతులకు కోయంబత్తూరు చేసిన బాంబు గాయాలైతే మానాయి. కానీ చెన్నైలో ఉద్యోగం గగనకుసుమమైంది. ఆమె చేతిలో ఉన్న డిగ్రీ, ఉద్యోగంలో ఉన్న అనుభవం ఏ మాత్రం ఉపయోగపడలేదు. ఇంటర్వ్యూలకు వెళ్లడం, తిరిగి రావడం రొటీన్ అయింది. ఇంటర్వ్యూల్లో ఫెయిల్ కావడం అంటే జీవితంలో ఫెయిల్ కావడమేనా? కాదు, జీవితంలో విజయం సాధించడానికి ఓ దారి ఉండే ఉంటుంది. జీవన ప్రవాహంలో కొట్టుకుపోకుండా నిలదొక్కుకోవాలంటే ఇంటర్వ్యూలో గెలిచి ఉద్యోగం సంపాదించుకోవడం ఒక్కటే కాదు, తనకు తానే ఓ ఉపాధిని వెతుక్కోవాలని కూడా అనుకుంది. ఆమెకు బాగా పరిచయం ఉన్న స్వయం ఉపాధి మార్గం ఆటో నడపడం ఒక్కటే. కోయంబత్తూరులో సరదాగా నేర్చుకున్న డ్రైవింగ్‌తోనే చెన్నైలో జీవించాలి అనుకుందామె. 'నేను సొంత ఆటో కొనుక్కునే వరకు ఈ ఆటోను పగలు నువ్వు నడుపు, రాత్రి నేను నడుపుతాను' అన్నదామె భర్త అశోక్‌తో. ఆమె ఈ మాట అన్నది ఇరవై ఏళ్ల కిందట. ఈ మాట అన్నప్పటికి ఆమెకు ఇరవై ఎనిమిదేళ్లు.

### బతుకు దారి రహదారి కాదు

''నా జీవితంలో లెక్కలేనన్ని ఎగుడు దిగుళ్లు ఎదురయ్యాయి. ఏ దశలోనూ వెనుకడుగు వేయలేదు. చెన్నై రోడ్ల మీద, ఆ ట్రాఫిక్‌లో బండి నడపడానికి మించిన క్లిష్టమైన సమస్య మరేదీ ఉండదు. జీవితంలో వచ్చే కష్టాలన్నీ అంతకంటే చిన్నవే అని కూడా అనిపించింది. ఆటో నడుపుతూ చిన్న చిన్న యాక్సిడెంట్‌లు కూడా చేశాను. యాక్సిడెంట్ అవుతుందేమోనని ప్రయాణాన్ని ఆపకూడదు, బండి నడపడమూ ఆపకూడదు. సరిగ్గా అలాగే జీవిత ప్రస్థానంలో ఎన్ని అవాంతారాలెదురైనా ప్రయాణాన్ని కొనసాగించాల్సిందే.




● సాధికారత సాధన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రాజేశ్వరి

## నగరాన్ని చదివింది

కోయంబత్తూరులో ఆటో నడపడం... చెన్నైలో ఆటో నడపడం ఒకటి కాదు. చెన్నై ట్రాఫిక్ వలయం ఒక ఎత్తయితే, నగరంలో రూట్‌లు తెలుసుకోవడం మరో ఎత్తు. ఇప్పుడున్నట్లు జీపీఎస్ ఉన్న రోజులు కావవి. మ్యాప్ ఎదురుగా పెట్టుకుని నగరంలో అన్ని ప్రదేశాలనూ తెలుసుకుంది. ఆటోలో తిరుగుతూ దూరాలను తెలుసుకుంది. ఇప్పుడు రాజేశ్వరికి ఒక అడ్రస్ చెబితే రూట్ మ్యాప్ ఆన్ చేయాల్సిన అవసరమే లేదు. మ్యాప్ ఆమె మైండ్‌లోనే ఉంటుంది. ఆమె రైడ్ ముగించుకుని వెళ్తున్నప్పుడు లేదా ఫోన్ కాల్ అందుకుని పికప్ కోసం వెళ్తున్నప్పుడు... రోడ్డు మీద బస్ కోసం ఎదురు చూస్తున్న అమ్మాయిలు, ముసలి వాళ్లు కనిపిస్తే వాళ్లను ఆటోలో ఎక్కించుకుంటుంది రాజేశ్వరి. ''హోటళ్లు, రెస్టారెంట్‌లు, షాపింగ్ మాల్స్‌లో పని చేసే వాళ్లకు డ్యూటీ తొమ్మిది– పది గంటల వరకు ఉంటుంది. వాళ్లలో ఎక్కువ మందికి అరకొర జీతాలే తప్ప ఆటోల్లో ఇళ్లకు వెళ్లగలిగిన జీతాలుండవు. ఆ టైమ్‌లో రోడ్డు మీద ఎప్పుడో వచ్చే బస్ కోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఒంటరిగా ఉన్న ఆడపిల్లలను ఆ టైమ్‌లో అలా చూసి ఏమీ పట్టనట్లు వెళ్లిపోలేను. అందుకే వాళ్లను ఆటో ఎక్కించుకుని నేను వెళ్లే రూట్‌లో వాళ్లకు అనువైన చోట దించుతాను. అదేమీ పెద్ద సామాజిక సేవ కాదు. నేను చేయగలిగిన చిన్న సహాయం'' అన్నారామె.

## అక్క ఉంది అండగా

ఆడవాళ్ల మీద జరుగుతున్న అత్యాచారాలు చూసిన తర్వాత రాత్రి పూట ఆటో నడపాలనే నిర్ణయానికి వచ్చానని చెప్పారు రాజేశ్వరి. ''రాత్రి ఎనిమిది నుంచి నాకు ఫోన్ కాల్స్ వస్తూనే ఉంటాయి. మహిళలు ఆ సమయంలో ఒంటరిగా ప్రయాణించేటప్పుడు మగవాళ్లు నడిపే క్యాబ్‌లు, ఆటోలంటే కొంచెం సందేహిస్తారు. జరుగుతున్న అత్యాచారాలు కూడా అలాగే ఉంటున్నాయి మరి. అందుకే అవకాశం ఉంటే మహిళ నడిపే ఆటోలు, క్యాబ్‌లకే ప్రాధాన్యం ఇస్తారు. నేను మహిళలకు ఆ చాయిస్ ఇవ్వగలుగుతున్నాను. అలాగే ఈ సర్వీస్ నా జీవితానికి కూడా భరోసానిస్తోంది. రోజుకు 30 ట్రిప్పులు నడుపుతున్నాను. నెలకు ముప్పై నుంచి నలభై వేలు సంపాదిస్తున్నాను. నాకు ఇరవై ఏళ్ల కిందట చెన్నైలో ఏ ప్రైవేట్ కంపెనీలోనో ఉద్యోగం దొరికినా, నెలకింత డబ్బుని ఇంటికి తీసుకెళ్లగలిగేదాని కాదు'' అని మోటివేషనల్ క్లాస్‌లలో చెప్తోంది రాజేశ్వరి. ఇప్పటికి 13 కాలేజీల్లో లెక్చర్ ఇచ్చారామె. తల్లిదండ్రులు అన్నీ అమర్చి చదివిస్తున్న రోజుల విలువను తెలుసుకోవాలని చెబుతారామె. పరీక్షల్లో మార్కులు తక్కువ రావడం, ఫెయిల్ కావడం, లవ్ ఫెయిల్ కావడం వంటి వాటిని భూతద్దంలో చూసుకుని ఆందోళన చెందడమంత హాస్యాస్పదమైన విషయాలు మరేవీ ఉండవని కూడా విద్యార్థులకు చెబుతారామె. విద్యార్థి దశలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలనే పెద్ద సమస్యలుగా భావించి జీవితాలను అంతం చేసుకోవడం అర్థరహితం అని కూడా విద్యార్థులను హెచ్చరిస్తారు రాజేశ్వరి. కాలేజ్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఎవరికి వాళ్లు సొంత నడక మొదలు పెట్టాల్సిందేనని, జీవితం ఎవరికీ వడ్డించిన విస్తరిలా ఉండదని కూడా చెప్తుంటారు రాజేశ్వరి.

## ప్రత్యర్థి కనిపించని యుద్ధరంగం

''జీవితం ఓ యుద్ధరంగం. ప్రత్యర్థి కనిపించని యుద్ధరంగం ఇది. ఈ యుద్ధరంగంలో మనం సైనికులం. పోరాడుతూనే ఉండాలి. పోరాటంలో ధైర్యాన్ని కోల్పోకూడదు. ధైర్యాన్ని కోల్పోతే కింద పడిపోతాం. ఒకసారి కిందపడితే మళ్లీ లేచి తిరిగి పోరాడడానికి మరింత శక్తియుక్తులు కావాలి. అందుకే మనం కింద పడకుండా ఉండడానికి నిరంతరం పోరాడుతూనే ఉండాలి. ఆ పోరాటం... జీవితంతో పోరాటం, జీవితంలో పోరాటం. విజయాల అంచులకు తీసుకెళ్లే పోరాటం కూడా అదే. అందుకు నా జీవితమే పెద్ద ఉదాహరణ'' అని జీవిత విజయ సూత్రాన్ని వివరించారు రాజేశ్వరి. డ్రైవింగ్‌ను ప్రొఫెషన్‌గా తీసుకోవాలనుకునే అమ్మాయిలకు ఆమె ట్రైనింగ్ ఇస్తున్నారు. సమాజంలో ఆడవాళ్ల భద్రత బాధ్యత ప్రభుత్వానిదే. అయితే ఆ భద్రత బాధ్యతను ఆడవాళ్లు కూడా కొంత పంచుకుంటే అనేక అనర్థాలు తలెత్తకుండానే సమసిపోతాయంటారు రాజేశ్వరి. అంతటి బాధ్యతతో ఆలోచించడం వల్లనే ఆమె చెన్నై వాసులకు 'రాజీ అక్క' అయ్యారు.

– వాకా మంజులారెడ్డి

## హెల్త్‌టిప్స్

మధుమేహం ఉన్న వారికి మునగాకు చక్కని ఔషధమని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు.

రోజూ రెండు టేబుల్ స్పూన్ల మునగాకు



పొడిని మూడు నెలల పాటు రెగ్యులర్‌గా తీసుకుంటే రక్తంలోని చక్కెర స్థాయులు చాలామటుకు తగ్గిపోతాయి. వీటిలో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ ద్వారా బ్లడ్‌లో షుగర్ లెవల్స్‌ని అదుపులో ఉంచవచ్చునని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. వీటితోపాటు మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని కూడా పరిశోధనలు రుజువు చేస్తున్నాయి.

ఐదు రకాల క్యాన్సర్లను మునగాకు దూరం చేస్తుంది. లంగ్, లివర్, ఒవేరియన్, మెలనోమా వంటి క్యాన్సర్లను నిరోధించే సత్తా మునగాకుకు వుందని.. యాంటీ ట్యూమర్‌గానూ మునగాకు పనిచేస్తుందని వైద్యులు చెప్తున్నారు.

అలాంటి మునగాకు పొడిని వంటల్లో చేర్చుకోవడం ద్వారా శరీరానికి తగిన పోషకాలు అందుతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



### మునగాకుతో పొడి ఎలా చేయాలంటే...

తాజాగా ఉన్న లేత మునగ ఆకులని తీసుకుని శుభ్రంగా నీటిలో కడిగి నీడపట్టున ఆరబెట్టుకోవాలి. తెల్లని కాటన్ బట్టను దానిపై పరిస్తే ఆకు రంగు మారకుండా ఉంటుంది. అలా వారం రోజుల పాటు ఆరబెట్టుకుంటే ఆకులు గలగలమంటూ ఎండిపోతాయి.

ఈ మునగాకుల్ని డబ్బాలో భద్ర పరచుకుని పప్పులో వేసుకోవచ్చు. లేదంటే మిక్సీ పట్టుకుని పొడిచేసి తేమ లేని డబ్బాలో దాచుకుని ఈ పొడిని జ్యూసుల్లో, సూపుల్లో, చపాతీల్లో, దోసెల్లో వాడుకుంటే రక్తహీనత రాకుండా ఉంటుంది.

పిల్లల్లో ఎదుగదలకు ఈ పొడి ఎంతో మేలు చేస్తుంది.

పరి పరిశోధన

## పాల ఉత్పత్తులతో సమస్య లేదు!



పాలు ఆరోగ్యానికి మంచిది కావని మీకు ఇటీవలి కాలంలో ఎవరైనా చెప్పారా? వాళ్ల మాటల్లో నిజం లేదని అంటున్నారు హార్వర్డ్, టఫ్ట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. గుండె జబ్బులతోపాటు, మధుమేహానికి, పాలకు సంబంధం లేదని తాము అధ్యయన పూర్వకంగా తెలుసుకున్నామని వీరు చెబుతున్నారు. ఆహారంలో పాల ఉత్పత్తులను భాగంగా చేసుకున్న దాదాపు మూడు వేల మందిపై తాము అధ్యయనం చేశామని.. వీరికి మధుమేహం వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని తేలిందని ఓ శాస్త్రవేత్త తెలిపారు. అలాగే సుమారు రెండు లక్షల మందిని దశాబ్దాల పాటు పరిశీలించిన తరువాత తాము పాలతో గుండెజబ్బుల సమస్య ఎక్కువ కాదన్న అంచనాకు వచ్చామని వివరించారు. పాల ఉత్పత్తులతో అందే కొవ్వులకు బదులు మొక్కలతో లభించే కొవ్వులు, గింజలను వాడినప్పుడు గుండెజబ్బుల ప్రమాదం ఇంకో 24 శాతం తగ్గిందని వీరు అంటున్నారు. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. మాంస ఉత్పత్తులతో సమస్య ఆరు శాతం వరకూ ఎక్కువ కావడం. మొక్కల ద్వారా లభించే కొవ్వులు, పాలతో వచ్చే వెన్నలోని కొవ్వులను పోల్చి చూసినప్పుడు మొదటి రకం కొవ్వులు ఆరోగ్యకరంగా ఉంటే.. రెండో రకం కొవ్వులను మితంగా వాడితే పెద్ద ప్రమాదమేమీ లేదని ఇంకో అధ్యయనం స్పష్టం చేసింది. మొత్తమ్మీద చూస్తే ఏ రకమైన కొవ్వులనైనా మితంగా వాడటం మేలని అర్థమవుతుంది.

## ఆరోగ్య వివరాలు ఇచ్చే సూపర్ స్టిక్కర్!



ఆరోగ్యంగా ఉన్న వారికి పెద్దగా సమస్యల్లేవుగానీ... రోజూ బీపీ, గ్లూకోజ్, హార్ట్‌రేట్ వంటివి పరీక్షించుకోవాలనే వారికి మాత్రం బోలెడన్ని ఇబ్బందులు. సూదితో పొడుచుకుని రక్తంలో చక్కెర ఎంత ఉందో తెలుసుకోవాలి. బీపీ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి. ఈ సమస్యలేవీ లేకుండా చేసేందుకు స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు ఓ వినూత్నమైన పరికరాన్ని అభివృద్ధి చేశారు. ఫొటోలో కనిపిస్తున్న స్టిక్కర్‌ను చర్మానికి అతికించుకుంటే చాలు.. మన ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. గుండె కొట్టుకునే తీరుకు, ఉఛ్వాస, నిశ్వాసలకు అనుగుణంగా మన చర్మంపైభాగం సంకోచ వ్యాకోచాలకు గురవుతుందన్నది మనకు తెలుసు. ఈ అంశాన్ని ఆధారంగా చేసుకుని ఈ స్టిక్కర్ పనిచేస్తుంది. కీళ్ల వద్ద అతికించుకుంటే కాలి కదలికలను గుర్తించి సమస్యలను ఏకరవు పెడుతుంది. బాడీ నెట్ అని పిలుస్తున్న ఈ సరికొత్త పరికరాన్ని ఉష్ణోగ్రత, ఒత్తిడి వంటి వివరాలను సేకరించేందుకు వాడుకోవచ్చునని గుండె పరిస్థితిని, నిద్రలోపాలను గుర్తించేందుకూ వాడుకోవచ్చునని అంటున్నారు జెనాన్ బావ్ అనే శాస్త్రవేత్త. ఈ స్టిక్కర్లను స్మార్ట్ వస్త్రాలతో కలిపి వాడుకునేలా చేయాలన్నది తన లక్ష్యమని.. తద్వారా స్మార్ట్‌ఫోన్లు, ఫిట్‌నెస్ గాడ్జెట్ల కంటే కచ్చితమైన సమాచారం సేకరించగలమని వివరించారు. పరిశోధన వివరాలు నేచర్ ఎలక్ట్రానిక్స్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

## ట్యూమర్‌ను తొలగించాక మళ్లీ మళ్లీ వస్తాయా?

**నా భర్తకు బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. మా కుటుంబసభ్యులమందరం చాలా ఆందోళనగా ఉన్నాం. ఈ ట్యూమర్‌ను సురక్షితంగా తొలగించడం సాధ్యమేనా? తీసేశాక మళ్లీ భవిష్యత్తులో ట్యూమర్ తిరిగివచ్చే అవకాశాలు ఉన్నాయా?**

**– ఆర్. భాగ్యలక్ష్మి, కోదాడ**

ట్యూమర్ల (కణుతుల)లో చాలా రకాలు ఉన్నాయి. వీటిని ప్రధానంగా రెండు విధాలుగా వర్గీకరిస్తారు. అవి... హానికరం కాని ట్యూమర్లు (బినైన్), హాని చేసే ట్యూమర్లు (మాలిగ్నెంట్). రెండో రకం ట్యూమర్లే సాధారణంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తాయి. సర్జరీ ద్వారా మెదడులోని కణుతులను తొలగించడం కత్తిమీద సాములాంటిదే. ఎందుకంటే శరీరంలోకెల్లా మెదడు అత్యంత సునిశితమైన, సంక్లిష్టమైన కణజాలంతో నిర్మితమైనది. అందువల్ల అక్కడి కణితిని సర్జరీ ద్వారా తొలగించడం కేవలం నైపుణ్యం కలిగిన న్యూరోసర్జన్లకు మాత్రమే సాధ్యం. కణితి చుట్టూ ఉండే అత్యంత సున్నితమైన కణజాలం, నాడులు దెబ్బతినకుండా ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో కూడిన న్యూరో నేవిగేషన్ ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. దీని సహాయంతో సీటీ, ఎమ్మారై సహాయంతో తీసిన మెదడు కణితికి సంబంధించిన 3డీ చిత్రాలను కంప్యూటర్ తెరపై చూస్తూ సర్జన్లు ఇప్పుడు అత్యంత సురక్షితంగా కణితిని తొలగించగలుగుతున్నారు. అందువల్ల ముందుగా మీ భర్త మెదడులో ఏర్పడ్డ ట్యూమర్ ఏ రకానికి చెందిందో పరీక్షల ద్వారా నిర్ధారణ చేయాలి. మెదడులో ఏర్పడ్డ ట్యూమర్ బినైన్ రకం అయివుంటే, ఒకసారి సమూలంగా తొలగించిన తర్వాత అది మళ్లీ వచ్చే అవకాశాలు చాలా తక్కువ. అలాగే మాలిగ్నెంట్ ట్యూమర్లను సైతం శస్త్రచికిత్స, రేడియేషన్, కీమోథెరపీ వంటి ప్రక్రియల ద్వారా చాలావరకు అదుపు చేయవచ్చు. దీనివల్ల మాలిగ్నెంట్ ట్యూమర్ కలిగించే దుష్ప్రభావాలకు లోనుకాకుండా దీర్ఘకాలంపాటు జీవితాన్ని కొనసాగించే అవకాశాలున్నాయి.

న్యూరో కౌన్సెలింగ్

## నడుమునొప్పికి సర్జరీ అంటున్నారు... మంచిదేనా?

**నా వయసు 35 ఏళ్లు. వృత్తిరీత్యా ద్విచక్రవాహనం మీద కనీసం రోజుకు 50 కిలోమీటర్లు తిరుగుతుంటాను. ఇది ఇటీవల తీవ్రంగా నడుము నొప్పి వస్తోంది. డాక్టర్‌ను సంప్రదిస్తే ఆయన నడుముకు శస్త్రచికిత్స చేయాలంటున్నారు. ఇది నాకు చాలా ఆందోళన కలిగిస్తోంది. దయచేసి నాకు తగిన సలహా ఇవ్వండి.**

**– ఎమ్. సుకన్య, వికారాబాద్**



ఈమధ్య కాలంలో చాలా మందిని ఈ సమస్య పట్టి పీడిస్తోంది. వివిధ రకాల ఒత్తిడి, జీవన విధానంలో మార్పులు, అధిక బరువులెత్తడం చాలాసేపు ఒకే భంగిమలో ఉండటం, ముందుకు ఒంగి పనిచేయడం, రోజూ చాలా దూరం బైక్‌పై ప్రయాణం చేయడం వంటి కారణాలతో వెన్నెముక మీద ఒత్తిడి ఏర్పడి ఈ సమస్య తలెత్తుతోంది. మీరు ఇటు ఇంట్లో పని చేసుకుంటూ ఆపై మీ పనుల మీద ద్విచక్రవాహనం నడుపుతూ అదనంగా శ్రమపడుతున్నారు. అంటే మీరు శారీరక ఒత్తిడికి అధికంగా లోనవుతున్నట్లు అర్థమవుతోంది. మీరు వెన్నుపూసకు ఎక్స్‌రే తీయించారా? ఆ పరీక్ష ఫలితాలను చూసి డాక్టర్ మీకు సర్జరీ చేయించమని సలహా ఇచ్చినట్లయితే మీరు 'స్పాండిలోలిస్తెసిస్' అనే సమస్యతో తీవ్రంగా బాధపడుతున్నట్లు నిర్ధారణ చేయవచ్చు. ఈ సమస్యతో బాధపడుతున్నవారిలో కొంతమందికి మందులతోనే నయమైతే, మరికొందరికి నడుకింది భాగంలో బెల్ట్ పెట్టుకోవాల్సి వస్తుంది. అవసరాన్ని బట్టి వైద్యులు వాకింగ్, యోగా లాంటి వ్యాయామాలు సూచిస్తారు. అప్పటికీ తగ్గకపోతే శస్త్రచికిత్స నిర్వహించి, వెన్నుపూస లోపల జారిపోయిన ఎముకను సాధారణ స్థితికి తీసుకువచ్చి స్క్రూస్, రాడ్స్ బిగించి, నరాలు ఒత్తిడికి గురికాకుండా చేస్తారు. ఈ విషయంలో మీరు ఆందోళనపడాల్సిందేమీ లేదు. వెన్నుకు ఆపరేషన్ చేసే విధానాలలో సురక్షితమైన శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. వెన్నెముక సమస్య ఎక్కడ ఉందో తెలుసుకొని, మిగతా భాగాలు దెబ్బతినకుండా మినిమల్లీ ఇన్వేసివ్ విధానంలో తక్కువ కోతతో ఆపరేషన్ నిర్వహించగలుగుతారు. ఈ విధానంలో వెన్నుపాముకి ఒక అంగుళం లేదా అంతకన్నా తక్కువ పరిమాణంలో ఒక చిన్న రంధ్రం పెడతారు. దీన్నే కీ–హోల్ అంటారు. శరీరంపై చిన్న కోత మాత్రమే ఉంటుంది కాబట్టి గాయం త్వరగా మానిపోతుంది. శస్త్రచికిత్స నిర్వహించిన రోజున లేదా మర్నాడు రోగిని ఇంటికి పంపించేస్తారు. కాబట్టి మీ ఉద్యోగానికి కూడా ఎక్కువ రోజులు సెలవు పెట్టుకోనవసరం లేదు.

ఫ్యామిలీ డాక్టర్

## అమ్మాయికి ఫిట్స్ వస్తున్నాయి... సలహా ఇవ్వండి

**మా అమ్మాయి వయసు 18 ఏళ్లు. చిన్నప్పట్నుంచీ ఫిట్స్‌తో బాధపడుతోంది. చాలా సార్లు కాలేజీలోనే ఆమెకు ఫిట్స్ వచ్చాయి. దాంతో కాలేజీ వారూ, కుటుంబ సభ్యులూ ఆందోళనకు గురైన సందర్భాలు చాలా ఉన్నాయి. హైదరాబాద్‌లో ఒక పెద్దాసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాం. కొంత కాలం బాగానే ఉంది. కానీ ఈమధ్య మళ్లీ ఫిట్స్ రావడం మొదలైంది. ఆమె అనారోగ్యం కుటుంబంలో అందరికీ ఆందోళన కలిగిస్తోంది. ఈ వ్యాధి పూర్తిగా నయం చేయడానికి ఏదైనా చికిత్స ఉందా? దయచేసి మాకు తగిన సలహా అందించండి.**

**– ఆర్. మోహన్‌రాజ్, కరీంనగర్**

ఫిట్స్ (మూర్ఛ) అనేది మెదడులో సంభవించే ప్రకోపనాలకు సంకేతం మాత్రమే. ఫిట్స్ వల్ల నిజానికి ఎలాంటి ప్రాణహానీ ఉండదు. కానీ చాలామంది ఫిట్స్‌ను ఏదో తీవ్రమైన, అరుదైన, ప్రమాదకరమైన సమస్యగా చూస్తుంటారు. కానీ అది నిజం కాదు. ఇది చాలా సాధారణమైన సమస్య. మెదడులోని నాడీ కణాల్లో నిరంతరం విద్యుత్ ప్రసారం జరుగుతూ ఉంటుంది. ఉన్నట్లుండి మెదడులోని కొన్ని ప్రాంతాల్లోని నాడీ కణాల్లో విద్యుత్ చర్యలు అస్తవ్యస్తమైనప్పుడు ఫిట్స్ వస్తాయి. వీటినే సీజర్స్ అని కూడా అంటారు. ఇలా తరచూ ఫిట్స్ వస్తుంటే దాన్ని తెలుగులో మూర్ఛ అని లేదా ఇంగ్లిష్‌లో ఎపిలెప్సీ అని అంటారు. ఫిట్స్ అన్నీ ఒకే రకానికి చెందినవి కావు. ఈ సమస్య ఎక్కడ మొదలవుతుందో దాన్ని బట్టీ, ఆ సమయంలో కనిపించే లక్షణాలను బట్టీ ఇది ఏరకమైన ఫిట్స్ అన్నది నిర్ధారణ చేస్తారు. కొందరిలో మెదడులో గడ్డలు ఉన్నప్పుడు కూడా ఫిట్స్ వస్తాయి. ఇలాంటి సందర్భాల్లో మాత్రం శస్త్రచికిత్సతో గడ్డలను తొలగించాల్సి ఉంటుంది.

సాధారణంగా ఫిట్స్ వచ్చిన సందర్భాల్లో కొద్ది సేపట్లోనే ఎలాంటి వైద్యసహాయం లేకుండానే పేషెంట్లు తమంతట తామే కోలుకుంటారు. అయితే ఫిట్స్ వచ్చిన సమయంలో రోగిని ఒకవైపునకు ఒరిగి ఉండేలా పడుకోబెట్టడం చాలా ముఖ్యం. దీనివల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేకుండా చేయవచ్చు. ఫిట్స్ వచ్చినప్పుడు రోగి తనకు తెలియకుండానే నిద్రలోకి జారుకుంటాడు. మళ్లీ కొద్దినిమిషాల్లోనే స్పృహలోకి వస్తాడు. అలా కొద్దినిమిషాల్లోనే స్పృహలోకి రాకపోతే మాత్రం వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్య సహాయం అందించాలి. అంతేగానీ ఫిట్స్ వచ్చిన సమయంలో పేషెంట్ నోట్లో ఏదైనా పెట్టడం, చేతిలో తాళాల వంటి ఇనుప వస్తువులు ఉంచడం, ముక్కు దగ్గర ఏదైనా తోలు వస్తువు వాసన చూపడం వంటి చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పూనుకోకూడదు. ఇలాంటి చర్యల వల్ల పేషెంట్‌కు ఎలాంటి ప్రయోజనం ఉండదు. పైగా కొన్ని సందర్భాల్లో అవి హాని చేసే ప్రమాదం కూడా ఉంది. ఇక మీ అమ్మాయి విషయానికి వస్తే స్త్రీ జీవితంలోని ప్రతి దశలోనూ అంటే... రజస్వల కావడం, నెలసరి రావడం, గర్భధారణ, బిడ్డకు పాలివ్వడం, నెలసరి నిలిచిపోవడం... ఇలా ప్రతి దశలోనూ హార్మోన్ల ప్రభావం బలంగా ఉంటుంది. దీంతో ఫిట్స్ సమస్యకూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది. అయితే ఇలాంటి వారిలో 90 శాతం కేసుల్లో సుదీర్ఘ చికిత్స, మందుల ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేసే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి మీరు ఎలాంటి ఆందోళన చెందకుండా వెంటనే ఆమెను అనుభవజ్ఞులైన న్యూరోఫిజీషియన్‌కు చూపించి చికిత్సను కొనసాగించండి.



డాక్టర్ ఆనంద్ బాలసుబ్రమణియం
సీనియర్ న్యూరోసర్జన్,
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్

# సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సోమవారం
19-8-2019









# కొలువు+కోర్సు

**దేశ రక్షణ కోసం సాహసించే తెగువ.. దేశ సేవ చేయాలనే తపన కలిగిన యువతకు చక్కటి అవకాశం... ఎన్‌డీఏ, ఎన్‌ఏ. ఈ పరీక్షలో విజయం సాధిస్తే.. త్రివిధ దళాల్లో.. పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు హోదాలో సుస్థిర కొలువు సొంతమవుతుంది. దాంతోపాటే ఉన్నత విద్య పరంగా బీఏ/బీఎస్సీ/బీటెక్ డిగ్రీ కూడా అందుకోవచ్చు. ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఉజ్వల కెరీర్‌కు మార్గం వేసే ఎన్‌డీఏ, ఎన్ఏ (2)-2019 నోటిఫికేషన్ వివరాలు.. ఎంపిక ప్రక్రియ.. పరీక్ష విధానం.. ప్రిపరేషన్ గైడెన్స్...**

- ఎన్‌డీఏ,ఎన్ఏ(2)-2019 నోటిఫికేషన్‌ను విడుదల చేసిన యూపీఎస్సీ
- ఇంటర్‌తోనే త్రివిధ దళాల్లో సుస్థిర కొలువుతోపాటు ఉన్నత విద్యకు మార్గం
- శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 పొందే అవకాశం

ఎన్‌డీఏ(నేషనల్ డిఫెన్స్ అకాడమీ), ఎన్ఏ (నేవల్ అకాడమీ).. ఈ రెండూ కూడా దేశ భద్రతలో కీలక పాత్ర పోషించే త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు అభ్యర్థులకు శిక్షణనిచ్చే వేదికలు. వీటిలో ప్రవేశించడానికి నిర్వహించే పరీక్షే.. ఎన్‌డీఏ, ఎన్ఏ ఎగ్జామినేషన్. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) ఎన్‌డీఏ, ఎన్ఏ నోటిఫికేషన్‌ను ఏటా రెండుసార్లు విడుదల చేస్తుంది.

### మూడంచెల ఎంపిక ప్రక్రియ

ఎన్‌డీఏ, ఎన్ఏకు అభ్యర్థులను ఎంపికచేసే ప్రక్రియ మూడు దశల్లో జరుగుతుంది. తొలిదశలో యూపీఎస్సీ దేశవ్యాప్తంగా రాత పరీక్ష నిర్వహిస్తుంది. ఈ రాత పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు మలిదశ ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

### పీఏటీ, ఇంటెలిజెన్స్ టెస్ట్

మలిదశలో సర్వీస్ సెలక్షన్ బోర్డ్ ఆధ్వర్యంలో.. ఫిజికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (పీఏటీ), ఇంటెలిజెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ముందుగా ఫిజికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో రాణించిన వారికి తర్వాత దశలో ఇంటెలిజెన్స్ టెస్ట్ జరుగుతుంది. అయిదు రోజులపాటు జరిగే ఈ ఎంపిక ప్రక్రియలో వివిధ నైపుణ్యాలను పరీక్షిస్తారు. ఇందుకోసం ఇంటెలిజెన్స్ టెస్ట్, మానసిక సామర్థ్యం, గ్రూప్ డిస్కషన్, వ్యక్తిగత సంభాషణలు వంటి టాస్క్‌లను అభ్యర్థుల ముందుంచుతారు. ఎయిర్ ఫోర్స్ విభాగాన్ని ప్రాథమ్యంగా ఎంచుకున్న అభ్యర్థులు కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్ పేరుతో మరో ప్రత్యేక పరీక్షలో విజయం సాధించాల్సి ఉంటుంది.

### నిర్ణీత వ్యవధిలో శిక్షణ.. బ్యాచిలర్ డిగ్రీ

ఇలా అన్ని దశల్లోనూ (రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలలో) విజయం సాధించిన అభ్యర్థులకు వారు ఎంపికైన విభాగం(ఆర్మీ/నేవీ/ఎయిర్‌ఫోర్స్/నేవల్ అకాడమీ)లో నిర్ణీత వ్యవధిలో శిక్షణ ఇస్తారు.

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ-పుణెలో శిక్షణ ఉంటుంది. వ్యవధి మూడేళ్లు. ఈ శిక్షణ ఆసాంతం అకడమిక్‌గా, ఫిజికల్ ఫిట్‌నెస్‌పైనే జరుగుతుంది. మొదటి రెండున్నరేళ్లు మూడు విభాగాల అభ్యర్థులకు ఒకే తరహా శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ పూర్తిచేసుకున్న వారికి బ్యాచిలర్ డిగ్రీ సర్టిఫికెట్‌లు సైతం అందజేస్తారు.
- ఆర్మీ కేడెట్స్‌కు బీఎస్సీ/బీఎస్సీ(కంప్యూటర్స్)/బీఏ సర్టిఫికెట్ లభిస్తుంది. నేవల్ కేడెట్స్, ఎయిర్ ఫోర్స్ కేడెట్స్‌కు బీటెక్ డిగ్రీ అందిస్తారు.
- నేవీ,నేవల్ క్యాడెట్స్‌కు ఇండియన్ నేవల్ అకాడమీ(ఎజిమల)..ఆర్మీ క్యాడెట్స్‌కు ఇండియన్ మిలటరీ అకాడమీ(డెహ్రాడూన్), ఎయిర్‌ఫోర్స్ క్యాడెట్స్‌కు ఎయిర్‌ఫోర్స్ అకాడమీ(హైదరాబాద్)లలో మరోసారి శిక్షణ ఉంటుంది. 18 నెలలపాటు కొనసాగే ఈ శిక్షణ పూర్తి చేసుకుంటే.. ఆయా విభాగాల్లో లెఫ్టినెంట్, సబ్ లెఫ్టినెంట్, ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాల్లో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకుతో కొలువులో చేరొచ్చు. శిక్షణ సమయంలోనే నెలకు రూ.56,100 స్టైపెండ్ అందుతుంది.

### ఎన్‌డీఏ, ఎన్ఏ.. ఎంపిక విధానం

ఎన్‌డీఏ-ఎన్ఏ ఎంపిక రెండంచెలుగా ఉంటుంది. అవి.. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ. రాత పరీక్ష రెండు విభాగాల్లో నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్ 300 మార్కులకు రెండున్నర గంటలపాటు జరుగుతుంది. అలాగే జనరల్ ఎబిలిటీ టెస్ట్ పరీక్ష 600 మార్కులకు రెండున్నర గంటలు ఉంటుంది. మొత్తంగా రాత పరీక్షకు 900 మార్కులు ఉంటాయి. రాత పరీక్ష తర్వాత ఎస్ఎస్‌టీ టెస్ట్/ఇంటర్వ్యూ 900 మార్కులకు జరుగుతుంది.

### రాత పరీక్షలో విజయానికి

రాత పరీక్ష మ్యాథమెటిక్స్ పేపర్‌లో రాణించాలంటే.. పదో తరగతి వరకు మాత్రికలు, ఆల్జీబ్రా, ట్రిగ్నామెట్రీ, అనలిటికల్ జామెట్రీ, స్టాటిస్టిక్స్, అర్థమెటిక్ తదితర విభాగాలపై పట్టు సాధించాలి. ముఖ్యంగా జామెట్రీ నుంచి టు, త్రీ డైమెన్షన్లు, స్టాటిస్టిక్స్ నుంచి మీన్, మీడియంకు సంబంధించిన అంశాలు.. అర్థమెటిక్‌లో కాలాలు, సగటు, శాతాలు, నిష్పత్తులపై దృష్టిసారించాలి.

### జనరల్ ఎబిలిటీ టెస్ట్‌కు ఇలా

- అభ్యర్థుల్లో సమకాలీన అంశాలు, లాంగ్వేజ్ నైపుణ్యాలను పరీక్షించే పేపర్.. జనరల్ ఎబిలిటీ టెస్ట్. మొత్తం ఆరు వందల మార్కులకు నిర్వహించే ఈ పేపర్‌ను రెండు పార్ట్‌లు (పార్ట్-ఎ, పార్ట్-బి)గా వర్గీకరించారు.
- పార్ట్-ఎ.. ఇంగ్లిష్ నైపుణ్యాలకు సంబంధించింది. దీనికి కేటాయించిన మార్కులు 200. ఇందులో మంచి మార్కుల కోసం బేసిక్ గ్రామర్, యాంటానిమ్స్, సినానిమ్స్, కరక్షన్ ఆఫ్ సెంటెన్స్‌పై చక్కని అవగాహనతో పాటు ఇంగ్లిష్‌ను అర్థం చేసుకునే పరిజ్ఞానం తప్పనిసరి.
- పార్ట్-బి జనరల్ ఎబిలిటీ టెస్ట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్, జాగ్రఫీ, కరెంట్ ఈవెంట్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. పార్ట్-బికి కేటాయించిన మార్కులు 400. పార్ట్-బిలో పేర్కొన్న సబ్జెక్ట్‌లకు సంబంధించి ఒక్కో టాపిక్‌కు ప్రశ్నల పరంగా నిర్దిష్ట వెయిటేజీ ఉంటుంది. ఫిజిక్స్‌కు 25 శాతం; కెమిస్ట్రీకి 15 శాతం; జనరల్ సైన్స్‌కు 10 శాతం; సోషల్ స్టడీస్‌కు 20 శాతం; జాగ్రఫీకి 20 శాతం; కరెంట్ ఈవెంట్స్‌కు 10 శాతం చొప్పున వెయిటేజీ ఉంది. ఈ పేపర్‌లో మెరుగైన మార్కులు సాధించాలంటే.. సోషల్ స్టడీస్ కోసం 6 నుంచి పదో తరగతి.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జాగ్రఫీ కోసం 8 నుంచి పదో తరగతి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదవడం ఉపకరిస్తుంది. సోషల్ స్టడీస్‌లో ప్రధానంగా స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించిన ఘటనలపై పట్టు సాధించాలి.



### త్రివిధ దళాల్లో కెరీర్ గ్రాఫ్

- ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఎన్‌డీఏ, ఎన్ఏ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి.. ఎన్‌డీఏ-పుణెలో అడుగుపెట్టిన అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న విభాగం ఆధారంగా అత్యున్నత స్థానాలకు చేరుకునే అవకాశముంది. 19 ఏళ్ల వయసులోనే ఎన్‌డీఏలో చేరితే త్రివిధ దళాల్లో అత్యున్నత స్థాయిలుగా పేర్కొనే జనరల్, అడ్మిరల్, ఎయిర్ చీఫ్ మార్షల్ వంటి హోదాలను చేరుకోవచ్చు.
- **ఆర్మీలో కెరీర్:** లెఫ్టినెంట్, కెప్టెన్, మేజర్, లెఫ్టినెంట్ కల్నల్, కల్నల్, కల్నల్ (టైమ్ స్కేల్), బ్రిగేడియర్, మేజర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్, జనరల్ హోదాలను సొంతం చేసుకోవచ్చు.
- **నేవీ కెరీర్:** సబ్ లెఫ్టినెంట్, లెఫ్టినెంట్, లెఫ్టినెంట్ కమాండర్, కమాండర్, కెప్టెన్, కెప్టెన్ (టైమ్ స్కేల్), కమొడోర్, రేర్ అడ్మిరల్, అడ్మిరల్ హోదాలు లభిస్తాయి.
- **ఎయిర్ ఫోర్స్ కెరీర్ గ్రాఫ్:** ఫ్లయింగ్ ఆఫీసర్; ఫ్లయిట్ లెఫ్టినెంట్, స్క్వాడ్రన్ లీడర్, వింగ్ కమాండర్, గ్రూప్ కెప్టెన్, గ్రూప్ కెప్టెన్ (టైమ్ స్కేల్), ఎయిర్ కమొడోర్, ఎయిర్ వైస్ మార్షల్, ఎయిర్ మార్షల్, ఎయిర్ చీఫ్ మార్షల్.

### ఎన్‌డీఏ, ఎన్ఏ(2)-2019 నోటిఫికేషన్ వివరాలు

**మొత్తం పోస్టుల సంఖ్య:**
- **ఎన్‌డీఏ:** 370 (ఆర్మీ-208; నేవీ-42; ఎయిర్ ఫోర్స్-120).
- **నేవల్ అకాడమీ** (10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్): 45.

**అర్హత**
- **ఆర్మీ విభాగం:** 10+2 తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- **ఎయిర్‌ఫోర్స్, నేవల్ విభాగాలు:** ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌లతో 10+2 ఉత్తీర్ణత.
- 10+2 ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వారు 2020, జూన్ 24 లోపు 10+2 ఉత్తీర్ణత సాధించి సర్టిఫికెట్ అందించాల్సి ఉంటుంది.
- **వయసు:** అభ్యర్థులు జనవరి 2, 2001, జనవరి 1, 2004 మధ్య జన్మించి ఉండాలి. అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

**దరఖాస్తు విధానం**
- అభ్యర్థులు **www.upsconline.nic.in** వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబర్ 3, 2019.
- **పరీక్ష తేదీ:** నవంబర్ 17, 2019.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం.
- **వివరాలకు వెబ్‌సైట్: www.upsc.gov.in**
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: www.upsconline.nic.in**

---

# మా గెలుపు మార్గం ఇదే!

## సీఏ ఫౌండేషన్ ర్యాంకర్ల విజయ రహస్యాలు

### అకౌంట్స్, మ్యాథ్స్‌పై దృష్టి



మాది శ్రీకాకుళం. నాన్న అప్పారావు అకౌంటెంట్. అమ్మ నాగరత్నం గృహిణి. నా చిన్నప్పటి నుంచే నాన్న చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) కోర్సుపై అవగాహన కల్పించారు. తర్వాత మాస్టర్ మైండ్స్‌లో చేర్పించారు. కోర్సులో భాగంగా ప్రతి సబ్జెక్టును పూర్తి ఏకాగ్రతతో చదివాను. అకౌంట్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులకు అధిక సమయం కేటాయించాను. ప్రతి కాన్సెప్టును అర్థం చేసుకుంటూ అధ్యయనం చేశాను. ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన అన్ని రివిజన్ టెస్ట్‌లు రాశా. రోజూ తప్పనిసరిగా తరగతులకు హాజరై, ఉపాధ్యాయులు చెప్పిన ముఖ్యాంశాలను ప్రత్యేకంగా నోట్ చేసుకున్నాను. వీటన్నిటి ఫలితమే ఫౌండేషన్‌లో ఉన్నత విజయం. 400 మార్కులకు 344 మార్కులు సాధించి అఖిల భారత స్థాయిలో రెండో ర్యాంకు సాధించాను. హార్డ్‌వర్క్ చేసే స్వభావం ఉంటే సీఏలో తప్పనిసరిగా విజయం సొంతమవుతుంది.

**– కె.సాయిశ్రీకర్**, ఆలిండియా 2వ ర్యాంకు.

### సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాది శ్రీకాకుళం. నాన్న పట్టాభి రామారావు ఇంజనీర్. అమ్మ లక్ష్మి గృహిణి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఇంటర్ ఎంపీసీ తర్వాత సీఏ కోర్సులో చేరా. నేను కళాశాలలో అందించిన మెటీరియల్‌ను మాత్రమే చదివాను. అకౌంట్స్‌కు సంబంధించిన లెక్కలను ప్రత్యేకంగా నోట్‌బుక్‌లో ప్రాక్టీస్ చేశా. రోజూ తప్పనిసరిగా తరగతులకు హాజరయ్యాను. కళాశాలలో నిర్వహించిన అన్ని పరీక్షలు రాశాను. ఫలితాలను విశ్లేషించుకొని, ఎప్పటికప్పుడు తప్పులు సరిదిద్దుకున్నాను. సీఏ ఫౌండేషన్‌లో ఆలిండియా 37వ ర్యాంకు సాధించాను. సీఏ కోర్సు పూర్తిచేసి, ఉన్నత ఉద్యోగంలో స్థిరపడాలనేది నా లక్ష్యం. చాలామంది అనుకుంటున్నట్లు సీఏ పెద్ద కష్టమైన కోర్సు కాదు. ఓ ప్రణాళిక ప్రకారం క్రమశిక్షణతో చదివితే విజయవంతంగా కోర్సును పూర్తిచేయొచ్చు. కోర్సులో భాగంగా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**– నారాయణశెట్టి హర్షిత**, ఆలిండియా 37వ ర్యాంకు.

### ఆసక్తి ప్రధానం



మాది కాకినాడ. ఇంటర్ ఎంపీసీ తర్వాత సీఏ కోర్సులో చేరాను. ఫౌండేషన్ సన్నద్ధతలో భాగంగా కాలేజీ నిర్వహించిన అన్ని పరీక్షలు రాశాను. అకౌంట్స్, ఎం.లాకు అధిక సమయం కేటాయించాను. కాలేజీలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు, మోటివేషన్ తరగతులకు హాజరవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరిగింది. వారాంతపు పరీక్షలన్నీ రాశాను. రివిజన్ ఎగ్జామ్స్ రాయడం వల్ల 95 శాతం సిలబస్‌ను పూర్తిచేయగలిగాను. దీంతో తొలిదశను మొదటి ప్రయత్నంలోనే పూర్తిచేయడంతో పాటు ఆలిండియా 42వ ర్యాంకు సాధించాను. ఇదే విధంగా మిగిలిన దశలను విజయవంతంగా పూర్తిచేసి మంచి సీఏగా రాణించాలనేది నా లక్ష్యం. సీఏ కోర్సులో విజయం సాధించాలంటే తొలుత కోర్సుపై ఆసక్తి ఉండాలి. మంచి శిక్షణ సంస్థను ఎంపిక చేసుకోవడమూ ముఖ్యమే.

**– కడియాల సురేంద్ర**, ఆలిండియా 42వ ర్యాంకు.

● సన్నద్ధతకు సూచనలు

### కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి

కొత్తగా సీఏ కోర్సులో ప్రవేశించాలనుకునే వారు పదో తరగతి పూర్తికాగానే ఇంటర్ ఎంఈసీతో పాటు సీఏ ఫౌండేషన్‌కు సిద్ధమవడం మంచిది. దీనివల్ల సమయం ఆదా అవుతుంది. అంతేకాకుండా అకౌంట్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టులపై మరింత పట్టు సాధించొచ్చు. సన్నద్ధత సమయంలో ప్రత్యేకంగా టైంటేబుల్‌ను రూపొందించుకొని, దాన్ని అనుసరించాలి. ప్రాబ్లమాటిక్ పేపర్లలోని ముఖ్యాంశాలను మెటీరియల్/నోట్స్‌లో హైలెట్ చేయాలి. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకోవడం ముఖ్యం. కాన్సెప్ట్‌లపై పట్టు సాధించడం ద్వారా విజయాన్ని అందుకోవచ్చు.

**– ఎం.ఎస్.ఎస్.ప్రకాశ్**, డైరెక్టర్, మాస్టర్‌మైండ్స్.

---

# ప్రతిభకు పట్టం




- కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్ టెస్ట్‌లకు దరఖాస్తుల ఆహ్వానం
- 8,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు సువర్ణావకాశం
- ఎన్ఎంఎంఎస్, ఎన్‌టీఎస్ఈలకు నోటిఫికేషన్ విడుదల

**ఆర్థిక సమస్యల కారణంగా ప్రతిభావంతులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయి స్కాలర్‌షిప్స్‌ను అందిస్తోంది. అందుకోసం 8వ తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం ఎగ్జామినేషన్(ఎన్ఎంఎంఎస్).. అలాగే 10వ తరగతి విద్యార్థుల కోసం నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ (ఎన్‌టీఎస్ఈ) ను నిర్వహిస్తోంది. 2019-20 విద్యాసంవత్సరానికి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఎన్ఎంఎంఎస్, ఎన్‌టీఎస్ఈ స్కాలర్‌షిప్స్ వివరాలు.. దరఖాస్తు.. పరీక్ష తీరు.. ప్రిపరేషన్ గైడెన్స్...**

### ఎన్‌టీఎస్ఈ

దేశవ్యాప్తంగా నిర్వహించే ఎన్‌టీఎస్ఈ రాత పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు పదో తరగతి తర్వాత నుంచి ఇంటర్మీడియట్ ఫైనల్ వరకు నెలకు రూ.1250 చెల్లిస్తారు. డిగ్రీ, పీజీ(పోస్ట్ గ్రాడ్యుయేషన్) చేస్తే నెలకు రూ.2000. అలాగే ఈ విద్యార్థులు పీహెచ్‌డీ చేసినట్లయితే యూజీసీ నిర్ణయం ప్రకారం స్కాలర్‌షిప్‌ను అందజేస్తారు.

### ఎన్ఎంఎంఎస్

ఈ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు (9,10,11, 12) వరకు ఏటా రూ.12000 స్కాలర్‌షిప్‌గా అందిస్తారు.

### అర్హతలు

- ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతుండాలి.
- ఎన్‌టీఎస్ఈకి దరఖాస్తు చేసుకునే వారు పదో తరగతి, ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 8వ తరగతి చదువుతున్నవారై ఉండాలి.
- తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ.1,50,000 మించకుండా ఉండాలి. అలాగే తల్లిదండ్రులు ప్రభుత్వం లేదా ప్రైవేటు రంగాల్లో పనిచేసే వారైతే మండల రెవెన్యూ ఆఫీసర్ జారీచేసిన ఆదాయ ధృవీకరణ పత్రం ఉండాలి.

### ఎంపిక విధానం

ఎన్‌టీఎస్ఈ, ఎన్ఎంఎంఎస్‌కు రాత పరీక్ష రెండు దశల్లో జరుగుతుంది. స్టేజ్-1(ప్రిలిమినరీ), స్టేజ్-2(మెయిన్స్) పరీక్షల్లో అర్హత సాధించిన వారినే స్కాలర్‌షిప్‌కు అర్హులుగా ఎంపిక చేస్తారు. రాత పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. విద్యార్థి ఆసక్తిని బట్టి తెలుగు/ఇంగ్లిష్/ఉర్దూ లేదా హిందీలలో ఏదైనా ఒక మీడియంను ఎంచుకోవచ్చు.

**రెండు దశలు**
- స్టేజ్-1లో మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (మ్యాట్), స్కాలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(శాట్ ) అనే రెండు విభాగాలు ఉంటాయి.
- స్టేజ్-2లో కూడా మెంటల్ ఎబిలిటీ టెస్ట్(మ్యాట్), స్కాలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(శాట్ ) అనే రెండు విభాగాలు ఉంటాయి.
- స్టేజ్-1లో వచ్చిన మార్కులు, రిజర్వేషన్లకు అనుగుణంగా రెండో దశ స్టేజ్-2కు విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకే స్కాలర్‌షిప్ లభిస్తుంది.

### మ్యాట్

- ఎన్‌టీఎస్ఈకు సంబంధించిన మ్యాట్‌లో మొత్తం 100 ప్రశ్నలకు 100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం రెండు గంటలు.
- ఎన్ఎంఎంఎస్‌కు సంబంధించిన మ్యాట్‌లో మొత్తం 90 ప్రశ్నలు 90 మార్కులకు పరీక్షను నిర్వహిస్తారు.
- ఎన్‌టీఎస్ఈ, ఎన్ఎంఎంఎస్ రెండింటికి నిర్వహించే మ్యాట్‌లోనూ విద్యార్థి ఆలోచనా శక్తిని, నైపుణ్యాలను పరీక్షించేలా ప్రశ్నపత్రం ఉంటుంది. ముఖ్యంగా ఈ విభాగంలో విద్యార్థి మానసిక సామర్థ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. మ్యాట్ ప్రశ్నపత్రంలో రెండు విభాగాలు ఉంటాయి. సాధారణ విభాగం-కోడింగ్, డీకోడింగ్, మిస్సింగ్ లెటర్స్, నంబర్, పదాల భిన్న పరీక్ష, నంబర్ సిరిస్, ఆల్ఫాబెట్ శ్రేణి, అంకెల సామర్థ్యం, సంఖ్యల భిన్న పరీక్ష, పజిల్ టెస్ట్, బ్లడ్ రిలేషన్స్, నంబర్, ఆల్ఫాబెట్ అనాలజీ. రెండోది బొమ్మల విభాగంలో.. బొమ్మలను గుర్తించడం, లెక్కించడం, అద్దంలోని బొమ్మలను గుర్తించడం, పేపర్ ఫోల్డింగ్,పేపర్ కటింగ్ తదితర అంశాల నుంచి ప్రశ్నల వస్తాయి.

### శాట్

- ఎన్‌టీఎస్ఈ శాట్‌లో మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలను అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్ష ప్రధాన ఉద్దేశం విద్యార్థికి పదోతరగతి సబ్జెక్ట్‌లపై ఉన్న పరిజ్ఞానాన్ని తెలుసుకోవడం. ఇందులో రాణించేందుకు విద్యార్థులు గత ప్రశ్నపత్రాలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
- ఎన్ఎంఎంఎస్ శాట్‌లో మొత్తం 90 ప్రశ్నలకు 90 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఇది విద్యార్థికి 8వ తరగతి సబ్జెక్ట్‌లపై ఉన్న పరిజ్ఞానాన్ని తెలుసుకోవడానికి ఉద్దేశించిన పరీక్ష.

### ఎగ్జామ్ టిప్స్

- మ్యాట్, శాట్‌లలో విద్యార్థి మానసిక సామర్థ్యాలను, అన్వయ నైపుణ్యాలను ప్రధానంగా పరీక్షించడం జరుగుతుంది. ఈ పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించాలంటే విశ్లేషణ సామర్థ్యాన్ని పెంచుకోవాలి.
- ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు ఎక్కువగా 7వ,8వ తరగతి.. ఎన్‌టీఎస్ఈ రాసే విద్యార్థులకు ఎక్కువగా 9, 10వ తరగతుల నుంచి ప్రశ్నలను అడిగే అవకాశం ఉంటుంది.
- ఎన్‌టీఎస్ఈ విద్యార్థులు ముందుగా పదోతరగతి సిలబస్ పూర్తిచేసి.. ఆ తర్వాత 9వ తరగతిలోని అంశాలను ప్రాక్టీస్ చేయాలి.
- ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసే వారు 7, 8వ తరగతి సబ్జెక్టులను ఎక్కువగా చదవాలి.
- వీలైనన్ని మాక్‌టెస్ట్‌లు రాయాలి. పరీక్ష సమయాన్ని దృష్టిలో ఉంచుకొని బిట్స్ ప్రాక్టీస్-వేగంగా చేయడం నేర్చుకోవాలి.
- రిఫరెన్స్ బుక్స్ – స్టేట్‌బోర్డ్, సీబీఎస్ఈ, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదవడం మేలు చేస్తుంది.

### దరఖాస్తు విధానం



- ఏపీలో ఎన్‌టీఎస్ఈ, ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సెప్టెంబర్ 5, 2019 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. తెలంగాణలో దరఖాస్తులకు చివరితేదీ ఆగస్టు 29, 2019
- **వెబ్‌సైట్:** http://main.bseap.org/, https://www.bse.telangana.gov.in/ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
- పరీక్ష ఫీజు (ఎన్‌టీఎస్ఈ), దరఖాస్తు ఫీజును రూ.200 సీఎఫ్ఎమ్ఎస్ ద్వారా చలానా రూపంలో: ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు మాత్రం రూ.100 (ఓసీ), రూ.50 (ఎస్సీ,ఎస్టీ,దివ్యాంగులు) ఫీజును ఎన్‌బీఐ ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబర్ 07, 2019లోపు చెల్లించాలి.

### పరీక్ష తేదీలు



- **మొదటి దశ రాత పరీక్ష తేదీ:** నవంబర్ 3, 2019.
- **రెండో దశ రాత పరీక్ష:** మే 5, 2020.
- ఎన్ఎంఎంఎస్ రెండు విభాగాలను (మ్యాట్, శాట్) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు.
- ఎన్‌టీఎస్ఈ మ్యాట్ పరీక్షను ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకూ.. అదే రోజు శాట్ పరీక్షను మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తారు.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
19-8-2019

## సామ సాత్విక-మహెక్ జైన్ జంటకు డబుల్స్ టైటిల్



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి సామ సాత్విక డబుల్స్ టైటిల్‌ను సాధించింది. కెన్యా రాజధాని నైరోబిలో జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో సాత్విక-మహెక్ జైన్ (భారత్) ద్వయం 6-4, 6-2తో భారత్‌కే చెందిన శ్రావ్య శివాని-స్నేహల్ జోడీపై గెలిచింది. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాత్విక-మహెక్ జోడీ రెండు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. ఇదే టోర్నీ మహిళల సింగిల్స్ టైటిల్‌ను మహెక్ జైన్ గెల్చుకుంది. ఫైనల్లో మహెక్ 6-1, 6-1తో సదా నహిమానా (బురుండి)పై విజయం సాధించింది.

# నిరీక్షణ ఫలించేనా?



సాయిప్రణీత్

సమీర్ వర్మ

ప్రణయ్

సింధు

సైనా



శ్రీకాంత్

- నేటి నుంచి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్
- పురుషుల సింగిల్స్‌లో 36 ఏళ్లుగా అందని పతకం
- బరిలో శ్రీకాంత్, సాయిప్రణీత్, ప్రణయ్, సమీర్ వర్మ
- మహిళల సింగిల్స్ పసిడి వేటలో సింధు, సైనా
- డబుల్స్‌లో ఆశలు అంతంతే

గత ఐదు ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లలో మహిళల సింగిల్స్ విభాగంలో భారత్‌కు కనీసం కాంస్యం లేదంటే రజతం వచ్చింది. గత రెండు పర్యాయాల్లోనైతే త్రుటిలో స్వర్ణ పతకాలు చేజారాయి. అందని ద్రాక్షగా ఉన్న పసిడి పతకాన్ని ఈసారైనా చేజిక్కించుకోవాలనే పట్టుదలతో భారత స్టార్స్ పీవీ సింధు, సైనా నెహ్వాల్ బరిలోకి దిగుతుండగా... పురుషుల సింగిల్స్ విభాగంలో 36 ఏళ్ల పతక నిరీక్షణకు తెరదించాలనే లక్ష్యంతో కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, హెచ్‌ఎస్ ప్రణయ్, సమీర్ వర్మ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అయితే ఈ ఏడాది మహిళల సింగిల్స్‌తో పాటు పురుషుల సింగిల్స్‌లోనూ భారత స్టార్స్ ప్రదర్శన అంత గొప్పగా లేకపోవడంతో తుది ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూడాలి.

**బాసెల్ (స్విట్జర్లాండ్):** ఈ సీజన్‌లో నిరాశాజనక ఫలితాలు లభించినా... వాటన్నింటినీ మర్చిపోయేలా... తాజా ప్రదర్శనను అభిమానులందరూ గుర్తుపెట్టుకునేలా... తమపై పెట్టుకున్న అంచనాలను నిజం చేయాలనే పట్టుదలతో... నేటి నుంచి మొదలయ్యే ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు బరిలోకి దిగనున్నారు. తొలి రోజు పురుషుల సింగిల్స్‌లో భారత టాప్-4 క్రీడాకారులు కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, ప్రణయ్, సమీర్ వర్మ పోటీపడనున్నారు. ప్రపంచ 81వ ర్యాంకర్ ఎన్‌హట్ ఎన్గుయెన్ (ఐర్లాండ్)తో పదో ర్యాంకర్ శ్రీకాంత్... 34వ ర్యాంకర్ లోకీన్ యెవ్ (సింగపూర్)తో 14వ ర్యాంకర్ సమీర్ వర్మ... 66వ ర్యాంకర్ జేసన్ ఆంథోని హో షుయె (కెనడా)తో 19వ ర్యాంకర్ సాయిప్రణీత్; 93వ ర్యాంర్ ఈటు హీనో (ఫిన్‌లాండ్)తో 30వ ర్యాంకర్ ప్రణయ్ తలపడనున్నారు. అత్యున్నతస్థాయి టోర్నీ కావడంతో ప్రత్యర్థులను తక్కువ అంచనా వేయకుండా భారత ఆటగాళ్లందరూ జాగ్రత్తగా ఆడాల్సిన అవసరం ఉంది. లేదంటే తొలి రౌండ్‌లోనే ఎదురుదెబ్బ తగిలే ప్రమాదముంది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్, సాయిప్రణీత్‌లకు క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. తొలి రౌండ్ అడ్డంకిని అధిగమిస్తే రెండో రౌండ్‌లో చైనా దిగ్గజం లిన్ డాన్‌తో ప్రణయ్... లీ డాంగ్ కెయున్ (కొరియా)తో సాయిప్రణీత్ ఆడే అవకాశముంది. రెండో రౌండ్‌ను కూడా దాటితే మూడో రౌండ్‌లో ప్రణయ్‌కు డిఫెండింగ్ చాంపియన్ కెంటో మొమోటా (జపాన్); సాయిప్రణీత్‌కు ఆరో సీడ్ ఆంథోనీ జిన్‌టింగ్ (ఇండోనేసియా) ఎదురుకావొచ్చు. మరోవైపు శ్రీకాంత్‌కు క్వార్టర్ ఫైనల్ వరకు కఠిన ప్రత్యర్థి దారిలో లేడు. క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్‌కు రెండో సీడ్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ) ఎదురయ్యే చాన్స్ ఉంది. ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ గెలిస్తే పతకం ఖాయమవుతుంది. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో పురుషుల సింగిల్స్‌లో భారత అత్యుత్తమ ప్రదర్శన కాంస్య పతకం. 1983లో ప్రకాశ్ పదుకొనే సెమీస్‌లో ఓడి కాంస్య పతకాన్ని సాధించాడు. ఆ తర్వాత పురుషుల సింగిల్స్‌లో ఇప్పటివరకు భారత్ నుంచి ఎవ్వరూ సెమీఫైనల్ చేరుకోలేదు. 2018లో సాయిప్రణీత్... 2017లో శ్రీకాంత్... 2013లో పారుపల్లి కశ్యప్... 2007లో అనూప్ శ్రీధర్.. 2001లో పుల్లెల గోపీచంద్ క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయి త్రుటిలో పతకాలకు దూరమయ్యారు.

**ఒకే పార్శ్వంలో సింధు, సైనా**

మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్ సింధు, ఎనిమిదో సీడ్ సైనా ఒకే పార్శ్వంలో ఉండటంతో వీరిద్దరు సెమీఫైనల్లో ఎదురయ్యే అవకాశముంది. తొలి రౌండ్‌లో వీరిద్దరికీ 'బై' లభించడంతో నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడతారు. రెండో రౌండ్‌లో సబ్రీనా (స్విట్జర్లాండ్)తో సైనా... పాయ్ యు పో (చైనీస్ తైపీ)తో సింధు ఆడే చాన్స్ ఉంది. క్వార్టర్ ఫైనల్లో సైనాకు నాలుగో సీడ్ చెన్ యుఫె (చైనా)... సింధుకు రెండో సీడ్ తై జు యింగ్ (చైనీస్ తైపీ) ప్రత్యర్థులుగా ఉండే అవకాశముంది. మరో పార్శ్వం నుంచి టాప్ సీడ్ అకానె యామగుచి (జపాన్), మాజీ విశ్వవిజేత ఒకుహారా (జపాన్) సెమీస్ చేరుకోవచ్చు.

**మిక్స్‌డ్ డబుల్స్‌లో లేని ప్రాతినిధ్యం...**

డబుల్స్ విషయానికొస్తే భారత్‌కు ఈసారీ పతకావకాశాలు లేవనే చెప్పవచ్చు. ఇటీవల థాయ్‌లాండ్ ఓపెన్‌లో పురుషుల డబుల్స్ టైటిల్ గెలిచిన సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట చివరి నిమిషంలో ఈ మెగా ఈవెంట్ నుంచి వైదొలిగింది. సుమీత్ రెడ్డి-మనూ అత్రి... శ్లోక్ రామచంద్రన్-అర్జున్ జోడీలు బరిలో ఉన్నా... రెండో రౌండ్‌లోనే వీరికి చైనా జంటలు ఎదురుకానున్నాయి. మహిళల డబుల్స్‌లో సిక్కి రెడ్డి-అశ్విని పొన్నప్ప; మేఘన-పూర్విషా; సంజన-పూజ జోడీలు రెండో రౌండ్ దాటిముందుకెళ్లడం కష్టమే. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఈసారి భారత ప్రాతినిధ్యం లేదు. వాస్తవానికి అశ్విని-సాత్విక్; సిక్కి రెడ్డి-ప్రణవ్ చోప్రా జోడీలకు ఎంట్రీ లభించినా... సాత్విక్, ప్రణవ్‌లకు గాయాలు కావడంతో ఈ రెండు జోడీలు వైదొలిగాయి.

**4** ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సింధు నెగ్గిన పతకాల సంఖ్య. సింధు 2017, 2018లలో రజతాలు సాధించగా... 2013, 2014లలో కాంస్యాలు సొంతం చేసుకుంది.

**2** ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సైనా సాధించిన పతకాలు. సైనా 2015లో రజతం, 2017లో కాంస్యం గెల్చుకుంది.

**8** ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్‌కు లభించిన మొత్తం పతకాలు. సింధు, సైనా ఇద్దరు కలిసి ఆరు పతకాలు గెలిచారు. పురుషుల సింగిల్స్‌లో ప్రకాశ్ పదుకొనే (1983లో) కాంస్యం సాధించాడు. మహిళల డబుల్స్‌లో గుత్తా జ్వాల-అశ్విని పొన్నప్ప జోడీ కాంస్యం గెలిచింది.

## భళా... లబషేన్

- కాంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చి ఆసీస్‌ను గట్టెక్కించాడు
- మలుపులతో సాగి 'డ్రా'గా ముగిసిన యాషెస్ రెండో టెస్టు
- ఆల్‌రౌండర్ స్టోక్స్ అజేయ శతకం

దాదాపు రెండు రోజులు వర్షం అడ్డుకుంది. మరో రెండు రోజులు బౌలర్లు ఆడుకున్నారు. మధ్యలో స్టీవ్ స్మిత్ పోరాటంతో ఆకట్టుకున్నాడు. ఆర్చర్ బుల్లెట్ బంతులతో బెంబేలెత్తించాడు. ఐదో రోజుకు వచ్చేసరికి ఓ దశలో ఫలితం తేలేలానూ కనిపించింది. కానీ; చరిత్రలో తొలిసారి కాంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ఆసీస్ ఆటగాడు మార్నస్ లబషేన్ (100 బంతుల్లో 59 ; 8 ఫోర్లు) మరో మలుపు తిప్పాడు. ఆర్చర్ భీకర బౌలింగ్‌కు ఆరు ఓవర్ల పైగా ఎదురొడ్డి చివరకు 'డ్రా'గా ముగిసేలా చేశాడు. లార్డ్స్ మైదానంలో యాషెస్ రెండో టెస్టు సాగిన తీరిది. విజయం కోసం పట్టు విడవకుండా ప్రయత్నించిన ఇంగ్లండ్ ఉసూరుమంటే... ఓటమి తప్పించుకున్న ఆస్ట్రేలియా హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకుంది.

**లండన్:** యాషెస్ సిరీస్ అంటేనే ఉత్కంఠకు లోటు లేకుండా సాగే పోటాపోటీ మ్యాచ్‌లు. ఫలితం 'డ్రా'నే అయినా... లార్డ్స్‌లో రెండో టెస్టు దీనికి ఏమాత్రం తగ్గకుండా నడిచింది. అదెలాగంటే... 8 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం; ఓవర్‌నైట్ స్కోరు 96/4తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ (165 బంతుల్లో 115 నాటౌట్; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడైన సెంచరీ సాయంతో 258/5 వద్ద డిక్లేర్‌చేసింది. అతడికి బట్లర్ (31), బెయిర్‌స్టో (30 నాటౌట్) సహకరించారు. దీంతో ఆసీస్ ఎదుట 48 ఓవర్లలో 267 పరుగుల విజయ లక్ష్యం నిలిచింది. కాస్త తెగించి వన్డే తరహాలో ఆడితే ఈ స్కోరు ఛేదించదగ్గదే. కానీ, గాయంతో ప్రధాన బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్ దూరమవడంతో కంగారూలు ముందే ఆత్మ రక్షణలో పడ్డారు. మరోవైపు పేసర్ జోఫ్రా ఆర్చర్ (3/32); స్పిన్నర్ జాక్ లీచ్ (3/37) వారిని బెంబేలెత్తించారు. కీలకమైన ఓపెనర్



వార్నర్ (5), వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ ఖాజా (2)లను ఆర్చర్ కుదురుకోనివ్వలేదు. మరో ఓపెనర్ బాన్‌క్రాఫ్ట్ (16)ను లీచ్ ఔట్ చేశాడు. 14 ఓవర్లలో 47/3తో ఓటమి బాటలో నిలిచిన ఆసీస్‌ను లబషేన్ అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. ట్రావిస్ హెడ్ (90 బంతుల్లో 42 నాటౌట్; 9 ఫోర్లు) అండగా జట్టును ఒడ్డున పడేశాడు. అయితే, లబషేన్, వేడ్ (1)లను లీచ్; కెప్టెన్ పైన్ (4)ను ఆర్చర్ వెంటవెంటనే ఔట్ చేసి అనూహ్యం చేసేలా కనిపించారు. హెడ్, కమిన్స్ (17 బంతుల్లో 1 నాటౌట్)లు ప్రత్యర్థికి ఆ అవకాశం ఇవ్వలేదు. 154/6తో ఆసీస్ మ్యాచ్‌ను ముగించి బతుకు జీవుడా అంటూ బయటపడింది. మూడో టెస్టు 22 నుంచి హెడింగ్లీలో జరుగుతుంది.

**తొలి కాంకషన్ లబషేన్...**

శనివారం ఆర్చర్ బౌలింగ్‌లో గాయపడిన స్టీవ్ స్మిత్... తల నొప్పి కారణంగా ఆదివారం మైదానంలోకి దిగలేదు. దీంతో ఐసీసీ కొత్తగా ప్రవేశపెట్టిన కాంకషన్ సబ్‌స్టిట్యూట్ వెసులుబాటును ఆస్ట్రేలియా వినియోగించుకుంది. మ్యాచ్ రిఫరీ అనుమతితో స్మిత్ స్థానంలో ఆ జట్టు లబషేన్‌ను ఆడించింది. నిబంధనల ప్రకారం తల లేదా మెడ భాగంలో గాయాలతో మైదానంలోని ఒక ఆటగాడు దూరమైతే కాంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చే ఆటగాడు బ్యాటింగ్, బౌలింగ్ చేయొచ్చు. గతంలో సబ్‌స్టిట్యూట్‌ను ఫీల్డింగ్ వరకే అనుమతించేవారు.

**సంక్షిప్త స్కోర్లు**

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 258; ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 250; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 258/5 డిక్లేర్డ్ (స్టోక్స్ 115 నాటౌట్; కమిన్స్ 3/35); ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 154/6 (47.3 ఓవర్లలో).

## టీమిండియాకు నిండైన ప్రాక్టీస్

- సెంచరీ బాదిన చతేశ్వర్ పుజారా
- రాణించిన ఇషాంత్, ఉమేశ్, కుల్దీప్



ఇషాంత్

**కూలిడ్జ్ (అంటిగ్వా):** కరీబియన్ పర్యటనలో టెస్టు సిరీస్‌కు ముందు టీమిండియాకు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సరైన ప్రాక్టీస్ లభించింది. వెస్టిండీస్ 'ఎ'తో ఇక్కడ జరుగుతున్న మూడు రోజుల మ్యాచ్‌లో మన జట్టు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. కీలక బ్యాట్స్‌మన్ పుజారా (187 బంతుల్లో 100 రిటైర్డ్ నాటౌట్; 8 ఫోర్లు, సిక్స్) సెంచరీ; తెలుగు ఆటగాడు హనుమ విహారి (101 బంతుల్లో 37 నాటౌట్; 2 ఫోర్లు); రిషభ్ పంత్ (53 బంతుల్లో 33; 4 ఫోర్లు, సిక్స్)రాణించడంతో భారత్ తొలి రోజు శనివారం 5 వికెట్ల నష్టానికి 297 పరుగులు చేసింది. ఇదే స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విండీస్ 'ఎ'ను పేసర్లు ఇషాంత్ శర్మ (3/21), ఉమేశ్ యాదవ్ (3/19); స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/35) కుప్పకూల్చారు. దీంతో ప్రత్యర్థి టీ విరామానికి ముందు 56.1 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులో ఓపెనర్ హడ్జ్ (51) అర్ధసెంచరీ సాధించాడు. భారత్‌కు 116 పరుగుల ఆధిక్యం లభించింది.

## తులసీ చైతన్యకు ఆరు పతకాలు



**సాక్షి, హైదరాబాద్:** ప్రపంచ పోలీసు క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన విజయవాడ స్విమ్మర్ తులసీ చైతన్య అద్భుత ప్రదర్శన చేశాడు. చైనాలోని చెంగ్డూలో జరిగిన ఈ క్రీడల్లో తులసీ చైతన్య ఒకస్వర్ణం, రెండు రజతాలు, మూడు కాంస్యాలతో కలిపి మొత్తం ఆరు పతకాలు సాధించాడు. విజయవాడలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే తులసీ చైతన్య ట్రయాథ్లాన్ టీమ్ ఈవెంట్‌లో పసిడి పతకం గెల్చుకోగా... 4x50 మిక్స్‌డ్ ఫ్రీస్టయిల్ రిలేలో, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రజత పతకాలు సాధించాడు. 1500 మీటర్ల ఫ్రీస్టయిల్, 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 4x50 మీటర్ల ఫ్రీస్టయిల్ రిలేలో తులసీ చైతన్య కాంస్య పతకాలను సొంతం చేసుకున్నాడు. ఓవరాల్‌గా ఇప్పటివరకు తులసీ చైతన్య మూడుసార్లు (2013, 2017, 2019) ప్రపంచ పోలీసు క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి 20 పతకాలు సాధించాడు.

## లంకకు ఘనమైన గెలుపు

- సెంచరీతో రాణించిన కెప్టెన్ కరుణరత్నె
- తొలి టెస్టులో న్యూజిలాండ్‌పై 6 వికెట్లతో విజయం
- ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో పాయింట్ల బోణీ



**గాలే:** సొంతగడ్డపై సాధికార విజయంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో శ్రీలంక బోణీ కొట్టింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', కెప్టెన్ దిముత్ కరుణరత్నె (243 బంతుల్లో 122; 6 ఫోర్లు, సిక్స్) సెంచరీతో ముందుండి నడిపించడంతో న్యూజిలాండ్‌పై తొలి టెస్టును ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఓవర్‌నైట్ స్కోరు 133/0తో ఆదివారం మ్యాచ్ ఐదో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ జట్టు 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 268 పరుగుల లక్ష్యాన్ని అందుకుంది. మరో ఓపెనర్ తిరిమన్నె (64) తొందరగానే ఔటవడంతో తొలి వికెట్ భాగస్వామ్యానికి 161 పరుగుల వద్ద తెరపడింది. అయితే, వ్యక్తిగత స్కోరు 71 నాటౌట్‌తో క్రీజులో దిగిన ఓపెనర్ కరుణరత్నె 216 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టెస్టుల్లో అతడికిది తొమ్మిదో శతకం. గెలుపు ఖాయమైన పరిస్థితుల్లో ధాటిగా ఆడే ప్రయత్నం చేసి కుశాల్ మెండిస్ (10), కుశాల్ పెరీరా (23) వెనుదిరిగారు. ఆల్ రౌండర్ మాథ్యూస్ (28 నాటౌట్), ధనంజయ డిసిల్వా (14 నాటౌట్) లాంఛనాన్ని పూర్తి చేశారు. ఈ విజయం ద్వారా టెస్టు చాంపియన్‌షిప్‌లో లంక ఖాతాలోకి 60 పాయింట్లు చేరాయి. ఇరు జట్ల మధ్య ఆఖరిదైన రెండో టెస్టు గురువారం నుంచి ప్రారంభమవుతుంది.

**సంక్షిప్త స్కోర్లు**

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 249; శ్రీలంక తొలి ఇన్నింగ్స్: 267; న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: 285; శ్రీలంక రెండో ఇన్నింగ్స్: 268/4 (86.1 ఓవర్లలో) (కరుణరత్నె 122, తిరిమన్నె 64).

## ఆసీస్‌ను నిలువరించిన భారత్



**టోక్యో:** ఒలింపిక్ టెస్ట్ ఈవెంట్ హాకీ టోర్నమెంట్‌లో భారత మహిళల జట్టు ప్రపంచ రెండో ర్యాంకర్ ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌ను 2-2తో 'డ్రా'గా ముగించింది. భారత్ తరఫున వందన కటారియా (36వ నిమిషంలో), గుర్జీత్ కౌర్ (59వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఆస్ట్రేలియా జట్టుకు కైట్లిన్ నోబ్స్ (14వ నిమిషంలో), గ్రేస్ స్టీవార్ట్ (43వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. ఇదే టోర్నీలో భారత పురుషుల జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 1-2తో ఓడిపోయింది. రెండో నిమిషంలో హర్మన్‌ప్రీత్ చేసిన గోల్‌తో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే కివీస్ ప్లేయర్ జేకబ్ స్మిత్ 47వ నిమిషంలో గోల్ చేసి స్కోరును సమం చేశాడు. చివరి నిమిషంలో స్యామ్ లేన్ గోల్ సాధించి న్యూజిలాండ్ విజయాన్ని ఖాయం చేశాడు.

## హిమ దాస్‌కు స్వర్ణం



**న్యూఢిల్లీ:** భారత యువ మహిళా అథ్లెట్ హిమ దాస్ మరోసారి మెరిసింది. చెక్ రిపబ్లిక్‌లో జరిగిన అథ్లెటికీ మిటింక్ రీటెర్ మీట్‌లో 300 మీటర్ల విభాగంలో స్వర్ణ పతకాన్ని సాధించింది. గత నెలన్నర వ్యవధిలో యూరోపియన్ సర్క్యూట్‌లో హిమ దాస్‌కిది ఆరో స్వర్ణం కావడం విశేషం. అయితే వచ్చే నెలలో దోహాలో జరిగే ప్రపంచ చాంపియ న్‌షిప్‌కు మాత్రం హిమ ఇంకా అర్హత సాధించలేదు.

## సూపర్ సిద్ధార్థ్

**తెలుగు టైటాన్స్‌ను గెలిపించిన స్టార్ రైడర్**



**చెన్నై:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో తెలుగు టైటాన్స్ రైడర్ సిద్ధార్థ్ దేశాయ్ సత్తా చాటాడు. హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళ్తున్న హరియాణా స్టీలర్స్‌ను తన రైడ్లతో మట్టికరిపించాడు. మ్యాచ్‌లో సూపర్ 'టెన్' (మొత్తం 16 పాయింట్లు)తో అదరగొట్టాడు. దీంతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 40-29తో హరియాణా స్టీలర్స్‌పై ఘన విజయం సాధించింది. ప్రత్యర్థిని నాలుగు సార్లు ఆలౌట్ చేసిన టైటాన్స్ ఈ లీగ్‌లో రెండో విజయాన్ని నమోదు చేసింది. పుణేరి పల్టన్, తమిళ్ తలైవాస్ మ్యాచ్ 30-30తో 'డ్రా'గా ముగిసింది. సీజన్‌లో ఇది ఐదో 'టై' కావడం విశేషం. తలైవాస్ తరఫున అజయ్ ఠాకూర్, రాహుల్ చౌదరిలు చెరో 8 పాయింట్లతో రాణించారు. **నేటి మ్యాచ్‌ల్లో యు ముంబాతో హరియాణా స్టీలర్స్; యూపీ యోధతో జైపూర్ పింక్ పాంథర్స్ తలపడతాయి.**

epaper.sakshi.com

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39 ▲ | 18 ▲ |
| 37,350 | 11,048 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం...
www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,896 | ▲ 129 |
| డోజోన్స్ | 25,887 | ▲ 307 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,117 | ▲ 50 |
| డాక్స్ | 11,563 | ▲ 150 |
| షాంఘై | 2,824 | ▲ 8 |
| నిక్కాయ్ | 20,416 | ▲ 13 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.65 | 72.29 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.89 | 87.94 |
| యూరో | ఎస్‌బీఐ | 77.89 | 80.78 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 66.05 | 68.55 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.48 | 49.66 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.65 | 52.40 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.20 | 19.96 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.63 | 20.19 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.84 | 9.48 |

# ఐటీ రిటర్న్ దాఖలు ఆలస్యమైతే...



## నష్టాలకు క్యారీ ఫార్వార్డ్ ఉండదు

- ఇంటిపై నష్టాలకు మాత్రం మినహాయింపు
- జరిమానా చెల్లించుకోవాల్సి రావచ్చు
- ఆలస్యమైన కాలానికి పన్ను మొత్తంపై వడ్డీ
- గడువులోపు దాఖలుతో ఎన్నో ప్రయోజనాలు
- తప్పులుంటే సవరణ రిటర్నులు



**ఆదాయపన్ను రిటర్నుల (ఐటీఆర్) దాఖలు విషయంలో అశ్రద్ధ వహించి గడువులోపు ఆ పనిచేయకపోతే కొన్ని పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఐటీఆర్ దాఖలకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు ఇచ్చింది. ఈ లోపు దాఖలు చేయకపోతే పెనాల్టీ చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 234 ఎఫ్ 2017 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ సెక్షన్ కింద ఐటీఆర్ ఆలస్యంగా దాఖలు చేసిన వారికి రూ.10,000 వరకు జరిమానా విధించేందుకు అవకాశం ఉంటుంది. ఎప్పుడు రిటర్నులు దాఖలు చేశారన్న దానిపై ఈ పెనాల్టీ మొత్తం ఆధారపడి ఉంటుంది. ఇక ఆలస్యంగా ఐటీఆర్ దాఖలు చేస్తే చెల్లించాల్సిన పన్ను మొత్తంపై వడ్డీ అదనంగా చెల్లించుకోవాలి. అంతేకాదు కొన్ని రకాల ప్రయోజనాలను కూడా కోల్పోవాల్సి వస్తుంది. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సకాలంలో రిటర్నులు దాఖలు చేయడమే సరైనది.**

### సెక్షన్ 139

ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 139 ఆలస్యంగా దాఖలు చేసే వివిధ రకాల రిటర్నుల వ్యవహారాలకు సంబంధించినది. ఓ వ్యక్తి లేదా సంస్థ నిర్దేశిత గడువులోపు రిటర్నులు దాఖలు చేయకపోతే ఈ సెక్షన్ తగిన మార్గదర్శకాలను తెలియజేస్తోంది. ఈ సెక్షన్‌లో ఉప సెక్షన్లు కూడా ఉన్నాయి. ఇవి విడిగా భిన్న రిటర్నుల వ్యవహారాల పరిష్కారానికి సంబంధించినవి. కనుక వీటిపై ఓ సారి దృష్టి సారించాలి.

### సెక్షన్ 139(1)

ఈ సెక్షన్ కింద వ్యక్తులు ఐటీఆర్ దాఖలు చేయడం తప్పనిసరి. చట్టం అనుమతించిన బేసిక్ పరిమితికి మించి ఆదాయం ఉన్న వారు గడువులోపు ఐటీఆర్ దాఖలు చేయాలి. భారత్‌కు వెలుపల ఏదైనా ఆస్తి ఉన్న వారు (ఏదైనా సంస్థతో ఆర్థిక ప్రయోజనం ముడిపడి ఉన్నా) లేదా విదేశీ ఖాతాకు సంబంధించి సంతకం చేసే అధికారం కలిగి ఉంటే అప్పుడు ఆదాయం ఎంతన్నదానితో సంబంధం లేకుండా రిటర్నులు తప్పనిసరిగా దాఖలు చేయాల్సిందే. ఇక చట్టంలోని నిబంధనల మేరకు ఐటీఆర్ దాఖలు చేయాల్సిన అవసరం లేకపోయినా కానీ ఆ పనిచేస్తే స్వచ్ఛంద రిటర్నులుగా పరిగణిస్తారు. ఇవి చట్టం ప్రకారం చెల్లుబాటయ్యే రిటర్నులు. ఈ సెక్షన్ కొన్ని రకాల వ్యక్తులను పన్ను రిటర్నుల దాఖలు నుంచి మినహాయింపు కూడా ఇస్తోంది.

### సెక్షన్ 139 (3)

పన్ను చెల్లింపుదారులు గత ఆర్థిక సంవత్సరంలో నష్టాన్ని ఎదుర్కొన్నప్పుడు రిటర్నులు దాఖలు చేయడం వల్లే ప్రయోజనం పొందగలరు. అందుకే ఈ విషయంలో కొన్ని నిబంధనలను దృష్టిలో ఉంచుకోవాలి. 'క్యాపిటల్ గెయిన్స్' (మూలధన లాభాలు), 'ప్రాఫిట్స్ అండ్ గెయిన్స్ ఆఫ్ బిజినెస్ అండ్ ప్రొఫెషన్' కింద నష్టాలను ఎదుర్కొన్న వారు, వాటిని తదుపరి ఆర్థిక సంవత్సరాల ఆదాయంలో సర్దుబాటు చేసుకోదలిస్తే తప్పనిసరిగా గడువులోపే ఐటీఆర్ దాఖలు చేయాలి. ఒకవేళ ఇంటిపై నష్టం ఎదురైతే మాత్రం గడువు దాటిన తర్వాత రిటర్నులు దాఖలు చేసినా గానీ, ఆ నష్టాన్ని తదుపరి ఆర్థిక సంవత్సరాలకు బదిలీ చేసుకునేందుకు ఈ సెక్షన్ అనుమతిస్తోంది. ఇక ఇతరత్రా ఏ నష్టమైనా కానీ సకాలంలో రిటర్నులు దాఖలు చేసినా, చేయకపోయినా వాటిని సెట్ ఆఫ్ (ఆదాయంలో సర్దుబాటు) చేసుకోవచ్చు.

### సెక్షన్ 139(4)

పన్ను చెల్లింపుదారులు సెక్షన్ 139(1)లో పేర్కొన్న మేరకు గడువులోపు రిటర్నులు దాఖలు చేయకపోతే, అసెస్‌మెంట్ సంవత్సరం నుంచి ఏడాదిలోపు ఆలస్యపు రిటర్నులను దాఖలు చేయవచ్చు. లేదా సెక్షన్ 144 ప్రకారం మదింపు పూర్తవకముందు దాఖలు చేయవచ్చు. కాకపోతే సెక్షన్ 271ఎఫ్‌లో పేర్కొన్న ప్రకారం రూ.5,000 జరిమానా చెల్లించుకోవాల్సి వస్తుంది. సెక్షన్ 139(1) కింద రిటర్నులు దాఖలు చేయాల్సిన అవసరం లేని వారు అసెస్‌మెంట్ సంవత్సరం ముగిసిన తర్వాత రిటర్నులు దాఖలు చేసినప్పటికీ పెనాల్టీ ఉండదు.

### సెక్షన్ 139(5)

గడువులోపు ఐటీఆర్ దాఖలు చేసిన వారు, ఆ తర్వాత అందులో ఏదైనా తప్పున్నట్టు గుర్తిస్తే, సవరణ రిటర్నులు సమర్పించే హక్కు ఉంటుంది. అసెస్‌మెంట్ సంవత్సరం ముగిసిన తర్వాత ఏడాదిలోపు ఈ పని చేయవచ్చు లేదా ఐటీఆర్ అసెస్‌మెంట్ పూర్తి కాకముందు వీటిల్లో ఏది ముందు అయితే అదే అమల్లోకి వస్తుంది. ఈ గడువులోపు ఎన్ని సార్లయినా సవరణ రిటర్నులు ఫైల్ చేసుకోవచ్చు. ఈ విషయంలో పరిమితి లేదు. అయితే, ఆలస్యంగా రిటర్నులు దాఖలు చేయడం వల్ల ఈ సెక్షన్ పరిధిలోకి రారు. సవరణ రిటర్నులు దాఖలు చేసుకునే అవకాశం కూడా ఉండదు. సవరణ రిటర్న్ దాఖలు చేయడం ఆలస్యం సెక్షన్ 139(5) కింద అదే అప్పటి నుంచి అమల్లోకి వస్తుంది. అంతకుముందు సెక్షన్ 139(1) కింద దాఖలు చేసినది అమల్లో ఉండదు. అయితే, అంతకుముందు దాఖలు చేసిన రిటర్నుల్లో లోపాలు లేదా తప్పుడు ప్రకటనలన్నవి ఉద్దేశపూర్వకంగా చేయకపోతేనే సవరణ రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఉద్దేశపూర్వకంగా లోపాలు లేదా తప్పిదాలతో దాఖలు చేసినా, మోసానికి పాల్పడినా పెనాల్టీ చెల్లించుకోవాల్సి వస్తుంది.

### సెక్షన్ 139 (9)

లోపాలతో కూడిన ఐటీ రిటర్ను దాఖలు చేసి, అవసరమైన డాక్యుమెంట్లను జత చేయనప్పుడు సెక్షన్ 139(9) మార్గదర్శకాలను తెలుసుకోవాలి. ఉదాహరణకు కొన్ని పూర్తి చేయాల్సిన కాలమ్స్‌ను వదిలి వేయడం లోపంగానే పరిగణిస్తారు. టీడీఎస్ మినహాయించిన సందర్భాల్లో ఆధారం జత చేయకపోయినా దాన్ని లోపంతో కూడిన రిటర్న్‌గానే చూస్తారు. పన్ను అధికారి ఇలా గుర్తించిన సందర్భంలో ఈ సమాచారం పన్ను చెల్లింపుదారునికి తెలియజేస్తారు. అప్పటి నుంచి 15 రోజుల్లోపు ఆ తప్పులను సవరించుకోవాల్సి ఉంటుంది. అయితే, దరఖాస్తు ద్వారా ఈ గడువు పొడిగించాలని కోరొచ్చు. పన్ను అధికారి ఇచ్చిన సమయంలోపు తప్పులను సవరిస్తూ రిటర్ను ఫైల్ చేయకపోతే, అంతకుముందు దాఖలు చేసిన రిటర్న్ చెల్లుబాటు కాదని గుర్తుంచుకోవాలి.

### ఆలస్యం చేయడం వల్ల ప్రతికూలతలు

- గడువులోపు రిటర్నులను దాఖలు చేయకపోతే కొన్ని ప్రతికూలతలు ఎదుర్కోవాల్సి రావచ్చు. సెక్షన్ 234ఎఫ్ ప్రకారం సకాలంలో రిటర్నులు దాఖలు చేయడంలో విఫలం చెందితే.. రూ.10,000 వరకు జరిమానా చెల్లించుకోవాల్సి వస్తుంది. సాధారణ గడువు ముగిసిన తర్వాత, అసెస్‌మెంట్ సంవత్సరం డిసెంబర్ 31 లోపు రిటర్ను దాఖలు చేస్తే రూ.5,000 జరిమానా చెల్లించాలి. అదే జనవరి 1 తర్వాత రిటర్ను ఫైల్ చేస్తుంటే ఈ జరిమానా రూ.10,000. అయితే, రిటర్ను దాఖలు చేసే వారి వార్షికాదాయం రూ.5 లక్షల్లోపు ఉంటే, జరిమానా కేవలం రూ.1,000 మాత్రమే ఉంటుంది. తక్కువ పన్ను పరిధిలో ఉన్న వారిపై భారం ఎక్కువ ఉండకూడదని తక్కువగా నిర్ణయించారు.
- గడువులోపు రిటర్నులు దాఖలు చేయకపోతే, మూలధన నష్టాలను, వ్యాపారం, వృత్తి ద్వారా వచ్చిన నష్టాలను తదుపరి ఆర్థిక సంవత్సరాలకు బదిలీ చేసుకునేందుకు వీలుండదు.
- ఆలస్యంగా రిటర్నులు దాఖలు చేస్తే, అంతకాలానికి నిర్ణీత పన్నుపై వడ్డీ కూడా చెల్లించుకోవాలి.
- ఆలస్యంగా రిటర్నుల వల్ల, రిఫండ్ వచ్చేది ఉంటే ఆ మొత్తంపై వడ్డీ రాదని గుర్తుంచుకోవాలి.

### ఆలస్యపు రిటర్నుల్లో పన్నుపై వడ్డీ

ఆలస్యపు రిటర్నుల్లో జరిమానాకు తోడు పన్ను మొత్తంపై ఆలస్యమైన కాలానికి వడ్డీ చెల్లించాలి. సెక్షన్ 234ఏ కింద నెలకు ఒక శాతం వడ్డీ ఉంటుంది. నిర్ణీత గడువు, దాఖలు చేసిన గడువు మధ్య కాలానికి దీన్ని వసూలు చేస్తారు. ఉదాహరణకు గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిటర్నుల దాఖలు గడువు ఆగస్టు 31. ఈ నెల 31లోపు దాఖలు చేయకుండా వచ్చే డిసెంబర్ 30న దాఖలు చేశారనుకోండి. రూ.1,00,000 పన్ను చెల్లించాల్సి ఉంటే, ఈ మొత్తంపై ఒక శాతం వడ్డీ చొప్పున నాలుగు నెలలకు రూ.4,000 చెల్లించుకోవాల్సి ఉంటుంది.

## పసిడి.. పటిష్టమే!

- ఆర్థిక అనిశ్చితి నేపథ్యం
- భారత్‌లోనూ ఇదే ధోరణి
- రూపాయి బలహీనతతో మెరుపు



బంగారం అటు అంతర్జాతీయంగా, ఇటు దేశీయంగా పటిష్ట ధోరణినే కనబరుస్తోంది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి పరిస్థితులు, అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం తీవ్రత, దీనికితోడు భౌగోళిక ఉద్రిక్తతలు, వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు సైతం తమ పసిడి నిల్వలను పెంచుకోవడం వంటి అంశాలు యెల్లో మెటల్‌కు ఊతం ఇస్తున్నాయి. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులకు పసిడిని తక్షణ సురక్షిత మార్గంగా ఎంచుకుంటున్నారు.

**దేశీయంగానూ పరుగే...**

దేశీయంగా చూస్తే, పసిడి పూర్తి బుల్లిష్ ధోరణిలో కనిపిస్తోంది. ఒకపక్క అంతర్జాతీయ పటిష్ట ధోరణితో పాటు, దేశీయంగా ఈక్విటీ మార్కెట్ల పతనం, విదేశీ నిధులు వెనక్కు మరలడం, డాలర్ మారకంలో రూపాయి బలహీనపడటం వంటి అంశాలు దేశీయంగా పసిడి ధరలకు ఊతం ఇస్తున్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో రూపాయి 74కుపైగా బలహీనపడింది. క్రూడ్ ధరల భారీ పతనం, మోదీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందన్న అంచనాలతో రూపాయి 68 స్థాయికి తిరిగి బలోపేతమైనా ఆ స్థాయికన్నా ఎక్కువకు బలోపేతం కాలేకపోయింది. ప్రస్తుతం 70–72 శ్రేణిలో తిరుగుతోంది. ముమ్మందూ రూపాయి బలహీనధోరణే ఉన్నందున దేశీయంగా పసిడిది పటిష్ట స్థాయేనని నిపుణుల అభిప్రాయం.

**ప్రస్తుత ధరల శ్రేణి..**

అంతర్జాతీయంగా నైమెక్స్‌లో పసిడి ఔన్స్ (31.1గ్రా) ధర శుక్రవారంతో ముగిసిన వారంలో వారంవారీగా దాదాపు 20 డాలర్ల లాభంతో 1,523 డాలర్ల స్థాయిలో ముగిసింది. ప్రస్తుతం ఇది ఆరేళ్ల గరిష్ట స్థాయి. 1,360, 1,450, 1,500 డాలర్ల స్థాయిలో పసిడికి పటిష్ట మద్దతు ఉందన్నది నిపుణుల అభిప్రాయం. ఇక దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో పసిడి ధర శుక్రవారంతో ముగిసిన వారంలో 10 గ్రాములకు రూ.37,938 వద్ద ఉంది.

# ఇన్‌స్టంట్ లోన్... ఒక్క నిమిషం.!

**కేవలం కొన్ని నిమిషాలు వెచ్చిస్తే చాలు... ఆన్‌లైన్లో అప్పటికప్పుడు కోరినంత రుణాన్ని (పర్సనల్ లోన్) పొందే ఆప్షన్లు నేడు ఎన్నో. అవసరానికి అరువు లభిస్తుంది కదా అని సరైన విచారణలు చేసుకోకపోతే ఆ తర్వాత విచారించాల్సి వస్తుంది. ఇన్‌స్టంట్ పర్సనల్ లోన్ ఒక్క క్లిక్‌తో అంటూ మీ మెయిల్ బాక్స్‌కి వచ్చే సందేశాలను చూసే ఉంటారు. ఆ సమయంలో డబ్బు అవసరాలు ఉన్న వారు అయితే ఆ అవకాశాన్ని సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. నేటి తరం యువత ఆన్‌లైన్‌లో సునాయాసంగా లభించే ఇన్‌స్టంట్ రుణాల పట్ల ఎంతో ఆకర్షితులు అవుతున్నారు. ఎందుకుంటే ఉన్న చోట నుంచి కదలక్కర్లేదు. డాక్యుమెంట్లు పట్టుకుని రుణం కోసం తిరగాల్సిన శ్రమ కూడా ఇందులో ఉండదు. రుణానికి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ అంతా స్మార్ట్‌ఫోన్ నుంచే పూర్తి చేసుకోవచ్చు. రోజుల నుంచి, నెలల వ్యవధిలో తీసుకున్న రుణాన్ని తీర్చి వేయవచ్చు. కానీ, వీటి విషయంలో తగినంత సమాచారాన్ని తెలుసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవడం మంచిదన్నది నిపుణుల సూచన.**

## ఆన్‌లైన్‌లో నిమిషాల్లోనే రుణాలు

- పెద్దగా శ్రమ కూడా అక్కర్లేదు
- కానీ, రుణ ఒప్పందంలో ఎన్నో షరతులు
- ముందస్తు చెల్లింపు చార్జీలు
- ఆలస్యపు చెల్లింపులపై పెనాల్టీలు
- ప్రాసెసింగ్ ఫీజులు, వడ్డీ రేటు
- అన్నీ పరిశీలించుకున్నాకే నిర్ణయం
- ప్రతికూల షరతుల రుణానికి దూరంగా ఉండాలి




### పెద్దగా కష్టం లేకుండానే...

''సులభంగా, తక్షణమే రుణాలు కోరుకునే వారికి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఎక్కువ పేపర్ పని లేకుండా, తిరగాల్సిన శ్రమ ఇందులో ఉండదు''అని మైలోన్ కేర్ డాట్ ఇన్ వ్యవస్థాపకుడు, సీఈవో గౌరవ్‌గుప్తా తెలిపారు. కొన్ని సంస్థలు క్రెడిట్ హిస్టరీ లేని వారికి కూడా రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తుండడం గమనార్హం. ''ఇన్‌స్టంట్ ఆన్‌లైన్ రుణాలు వేగంగా ప్రాసెస్ చేసి జారీ చేసేవి. దీంతో అర్హతల నిబంధనలు మరింత సులభంగా ఉంటున్నాయి. అప్పటి వరకు ఎటువంటి రుణాలు తీసుకోని కొత్త వారికి క్రెడిట్ హిస్టరీ కూడా ఏర్పడడం లేదు'' అని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్‌శెట్టి తెలిపారు.

### పరిశీలించిన తర్వాతే...

ఆన్‌లైన్‌లో ఎంతో సులభంగా, సౌకర్యంగా రుణం లభిస్తుంటే ఎవరైనా కాదనగలరా..? కానీ, ఒక్క క్లిక్‌తో రుణం తీసుకోకుండా, దానికి ముందు చూడాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. రుణం ఎటువంటిది అయినా కానీ, దానిపై వడ్డీ, ఇతర చార్జీలను తీసుకునే వారు భరించాల్సి ఉంటుంది. తీసుకునే మొత్తాన్ని తాము సకాలంలో తిరిగి చెల్లించగలమా..? అన్న పరిశీలన కూడా అవసరం. ''మీకు అవసరం ఉన్నంత వరకే రుణం తీసుకోవాలి. అంతేకానీ, అర్హత ఉన్నంత తీసుకోరాదు. తిరిగి చెల్లించే ప్రణాళిక కూడా మీ వద్ద ఉండాలి. సకాలంలో ఈఎంఐలు కూడా చెల్లించడం ఎంతో ముఖ్యం. ఆలస్యపు చెల్లింపులు, సకాలంలో చెల్లించకపోవడాలు, పరిష్కారాలు అన్నీ కూడా క్రెడిట్ స్కోరును దెబ్బతీసేందుకు కారణమవుతాయి. దీంతో భవిష్యత్తులో రుణం పొందడం కష్టంగా మారుతుంది'' అని ఆదిల్ శెట్టి వివరించారు.

### భిన్న చార్జీలు

ఆన్‌లైన్లో వేగంగా రుణం తీసుకునే హడావుడిలో ఈఎంఐకు అదనంగా చెల్లించాల్సిన చార్జీల గురించి కొందరు తెలుసుకునే ప్రయత్నం చేయరు. ఆన్‌లైన్ లెండింగ్ ప్లాట్‌ఫామ్‌లు రిజిస్ట్రేషన్ ఫీజు లేదా ప్రాసెసింగ్ ఫీజును వసూలు చేస్తుంటాయి. రుణంతోపాటు కలిపి వీటిని రుణగ్రహీతల నుంచే వసూలు చేస్తాయి. ఈ చార్జీలపై అవగాహన లేకపోతే రుణం తీసుకోవడానికి ముందుగా సంబంధిత సంస్థను అడిగి పూర్తి వివరాలు తెలుసుకోవాలి. మెయిల్ బాక్స్‌లో లేదా మొబైల్‌కు ఎస్ఎంఎస్ రూపంలో వచ్చిన లోన్ ఆఫర్‌ను చూసి తొందరపడిపోకుండా, అది మంచి ఆఫర్ అవునో, కాదో విచారించుకోవడం ఎంతో అవసరం. కొన్ని సందర్భాల్లో మంచి ఆఫర్ వచ్చే అవకాశం కూడా లేకపోలేదు. ''ఇన్‌స్టంట్ రుణాలు కూడా ఇతర రుణాల మాదిరే. వీటిని తీసుకునే ముందు తగినంత అధ్యయనం, రుణ నిబంధనలు, వడ్డీ రేటు, ప్రాసెసింగ్ ఫీజు, ఇన్సూరెన్స్ ప్రీమియం, ముందస్తు చెల్లింపులపై పెనాల్టీ వంటి చార్జీలను ఇతర సంస్థలతో పోల్చి చూసుకోవాలి'' అని గౌరవ్‌గుప్తా సూచించారు. రుణం తీసుకుంటే, ప్రతి నెలా నిర్ణీత మొత్తం ఈఎంఐ రూపంలో చెల్లించేందుకు చట్టబద్ధంగా కట్టుబడినట్టేనని గుర్తించాలి. అంతేకాదు, తిరిగి మీ చెల్లింపుల సామర్థ్యం ఆ మేరకు లాక్ అయినట్టు భావించాలి. ఉదాహరణకు ప్రతీ నెలా ఈఎంఐ రూపంలో మీరు రూ.20,000 చెల్లించగలరని అనుకుంటే, అప్పటికే కొంత రుణం తీసుకుని రూ.4,000 చెల్లిస్తుంటే, అప్పుడు మీ మిగిలిన చెల్లింపుల సామర్థ్యం రూ.16,000గానే అనుకోవాలి.

### అవసరం లేకపోతే...

నిజమైన అవసరం లేకపోయినా కొన్ని సందర్భాల్లో సంపన్న అవసరాల కోసం రుణాలు తీసుకునే వారూ ఉన్నారు. కానీ, దీని వల్ల వైద్య చికిత్సల వంటి అత్యవసర సందర్భాల్లో రుణానికి ఇబ్బందులు ఎదురుకావచ్చు. ''వివేకంతో రుణాలు తీసుకోవడం ఆస్తులు సమకూర్చుకోవడానికి సాయపడొచ్చు. సకాలంలో చెల్లించడం వల్ల క్రెడిట్ స్కోరును కూడా పెంచుకోవచ్చు. సకాలంలో చెల్లింపులు చేయకపోతే విధించే పెనాల్టీలు భారీగా ఉంటాయి. మీ ఆదాయంలో రుణ ఈఎంఐ 25–40 శాతం మించకుండా చూసుకోవడం మంచిది. ఇంతకు మించితే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది'' అని ఆదిల్ శెట్టి సూచించారు. చాలా సందర్భాల్లో రుణాలిచ్చే సంస్థలు ముందుగా రుణాన్ని తీర్చివేస్తే భారీ చార్జీల విధింపు వంటి షరతులు పెడుతున్నాయి. ఇలాంటి షరుతులు రుణాన్ని ఖరీదుగా మార్చేస్తాయని తెలుసుకోవాలి. కొన్ని సంస్థలు అయితే ముందుగా ఓ నిర్ణీత కాలం వరకు రుణాన్ని తీర్చివేసేందుకు కూడా అనుమతించడం లేదు. ఈ తరహా ప్రతికూల షరతులు రుణ ఒప్పందంలో ఉన్నాయా, లేవా అన్న నిర్ధారణ రుణం తీసుకోవడానికి ముందు తెలుసుకోవాలి.

## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (ఆగస్టు-16-2019 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు- ఏడాది | 1–2 ఏళ్లు | 3–5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 6.6 | 6.8 | 6.75 |
| యాక్సిస్ బ్యాంక్ | 6.75 | 7.2 | 7 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 6.25 | 6.6 | 6.45 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.5 | 6.5 |
| కెనరా బ్యాంక్ | 6.2 | 6.5 | 6.4 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.25 | 6.6 | 6.45 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.35 | 7 | 6.5 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 6.75 | 7.3 | 7.25 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6.5 | 7.1 | 7 |
| ఐడీబీఐ బ్యాంక్ | 6.5 | 7.1 | 6.85 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 7 | 7.5 | 7.5 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 6.75 | 6.9 | 6.75 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 6.25 | 6.8 | 6.7 |
| పీఎన్‌బీ | 6.3 | 6.75 | 6.5 |
| ఎస్‌బీఐ | 6.25 | 6.8 | 6.6 |
| సిండికేట్ బ్యాంక్ | 6 | 6.7 | 6.5 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.75 | 7.25 |

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

# ఈక్విటీల్లో పెట్టుబడులు... అయినా రిస్క్ తక్కువే!

## ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ సేవింగ్స్




ఈక్విటీల్లో కొంత ఇన్వెస్ట్ చేయాలి, అదే సమయంలో పెట్టుబడులకు రిస్క్ కొంత తక్కువగా ఉండాలని ఆశించే వారు ఈక్విటీ, డెట్ కలయికతో కూడిన ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ సేవింగ్స్ పథకం రాబడుల విషయంలో మెరుగ్గా ఉంది. ఈక్విటీ, డెట్‌తోపాటు, ఆర్బిట్రేజ్ అవకాశాల్లోనూ ఈ పథకం ఇన్వెస్ట్ చేస్తుంటుంది. గతంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ ఇన్‌కమ్ పేరుతో ఈ పథకం కొనసాగింది.

**రాబడులు..:** ఈ పథకం 2014లో ఆరంభం కాగా, అప్పటి నుంచి చూసుకుంటే మంచి రాబడులను ఇచ్చింది. ఈక్విటీ సేవింగ్స్ విభాగం సగటు రాబడులతో పోల్చి చూసినప్పుడు ఈ పథకంలో రాబడులు ఎక్కువగా ఉన్నాయి. ఏడాది కాలంలో ఈ పథకం 8.5 శాతం, రెండేళ్లలో వార్షికంగా 6.8 శాతం, మూడేళ్లలో వార్షికంగా 9.2 శాతం చొప్పున ప్రతిఫలాన్నిచ్చింది. ఈ విభాగం సగటు రాబడులు ఏడాదిలో 5.2 శాతం, రెండేళ్లలో 5.1 శాతం, మూడేళ్లలో 7.4 శాతంగానే ఉన్నాయి. ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టాలి, అదే సమయంలో రిస్క్ తక్కువగా ఉండాలనుకునే వారికి ఈక్విటీ సేవింగ్స్ పథకాలు అనుకూలంగా ఉంటాయి. రిస్క్ ఆధారిత రాబడుల విషయంలో ఈ విభాగం అటు కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్, ఇటు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌కు మధ్యస్థంగా ఉంటాయి. ఈ పథకం ఈక్విటీ, ఈక్విటీ ఆర్బిట్రేజ్‌కు కనీసం 65 శాతం కేటాయింపులు చేస్తుంది. పన్ను పరంగా ఈక్విటీ ఆర్బిట్రేజ్ పెట్టుబడులు కూడా ఈక్విటీగానే పరిగణించబడతాయి. డివిడెండ్, మూలధన లాభాలపై పన్ను ఉంటుంది. ఇన్వెస్టర్ల లక్ష్యాలను బట్టి కనీసం మూడేళ్లు, అంతకు మించిన కాలానికి ఈ పథకాలను పరిశీలించొచ్చు.




**పెట్టుబడుల విధానం..:** ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ సేవింగ్స్ పథకం ఈక్విటీలకు 15–50 శాతం వరకు పెట్టుబడులను కేటాయిస్తుంది. డెట్‌కు 10–35 శాతం వరకు కేటాయింపులు చేస్తుంది. మార్కెట్ పరిస్థితులను బట్టి 25–75 శాతం మధ్య ఆర్బిట్రేజ్ వ్యూహాలకు కేటాయించడం ద్వారా రాబడులు పొందే ప్రయత్నం కూడా చేస్తుంటుంది. ఈక్విటీ డెరివేటివ్స్‌లో హెడ్జ్ పొజిషన్ల ద్వారా రాబడులపై అస్థిరతలను తగ్గించడంతోపాటు, కొంచెం అదనపు రాబడులను ఇచ్చే వ్యూహం ఈ పథకంలో గమనించొచ్చు. 43 శాతం పెట్టుబడులను ఈక్విటీ హెడ్జ్ పొజిషన్ల కోసం, 24 శాతం పెట్టుబడులను పూర్తిగా ఈక్విటీ ఎక్స్‌పోజర్ రూపంలో నిర్వహిస్తుంటుంది. మల్టీ క్యాప్ విధానంలో, ఎక్కువగా లార్జ్‌క్యాప్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. ఈక్విటీల కోసం చేసిన మొత్తం కేటాయింపుల్లో 83 శాతం లార్జ్‌క్యాప్‌లోనే ఉండగా, మిడ్‌క్యాప్‌లో 10 శాతం, స్మాల్‌క్యాప్‌లో 7 శాతం చొప్పున ఉన్నాయి. అస్థిరతల మార్కెట్లలో లార్జ్‌క్యాప్ కంపెనీలు కొంచెం స్థిరంగా, సౌకర్యంగా ఉంటాయని తెలిసిందే. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఇంధన రంగ స్టాక్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడాన్ని గమనించొచ్చు.

## ఈక్విటీ టాప్ హోల్డింగ్స్

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| ఎన్‌టీపీసీ | 5.44 |
| టీసీఎస్ | 4.40 |
| యాక్సిస్‌బ్యాంకు | 4.30 |
| సన్‌ఫార్మా | 3.20 |
| ఎస్‌బీఐ | 2.71 |
| టాటా కెమికల్స్ | 2.65 |
| రిలయన్స్ ఇండస్ట్రీస్ | 2.65 |
| ఐసీఐసీఐ బ్యాంకు | 2.64 |
| జీ ఎంటర్‌టైన్‌మెంట్ | 2.36 |
| ఐటీసీ | 2.28 |



మరింత ఉన్నత స్థానానికి చేరడానికి
ప్రస్తుత సౌలభ్య స్థితిని వదిలేందుకు భయపడొద్దు!
- జాన్ డీ. రాక్‌ఫెలర్, అమెరికా వ్యాపారవేత్త

## బొమ్మ-బొరుసు



# అంతర్జాతీయ అంశాలే దిక్సూచి..!

- బుధవారం ఎఫ్ఓఎంసీ జూలై సమావేశపు మినిట్స్ వెల్లడి
- శుక్రవారం జరిగే అమెరికా సెంట్రల్ బ్యాంక్ వార్షిక సదస్సులో పావెల్ ప్రసంగం
- ఆర్‌బీఐ ద్రవ్య విధాన సమీక్ష సమావేశ మినిట్స్ ఈవారంలోనే..



**ముంబై:** సూపర్ రిచ్ ట్యాక్స్ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన తుది నిర్ణయాన్ని తేల్చిచెప్పకపోడం, ఆర్థిక వ్యవస్థలో జవసత్వాలు నింపే విధంగా ప్రకటనలు చేయకపోవడం వంటి నిరాశాపూరిత వాతావరణంలో గతవారం దేశీ ప్రధాన స్టాక్ సూచీలు నష్టాలను నమోదుచేశాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐ) అమ్మకాల ధాటికి అంతక్రితం వారంలో గడించిన లాభాల్లో కొంత కోల్పోయినప్పటికీ.. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరుకు లభించిన కొనుగోలు మద్దతుతో భారీ నష్టాలకు అడ్డుకట్టపడింది. వారాంతాన నిఫ్టీ 11వేల పాయింట్ల సైకిలాజికల్ మార్కుకు ఎగువన నిలిచింది. ఈ ముగింపుతో కన్సాలిడేషన్ సూచనలు కనిపిస్తుండడం కాస్త సానుకూల అంశంగానే ఉండగా.. ఫలితాల సీజన్ నిరాశపరచడం, అమెరికా–చైనాల మధ్య కొనసాగుతోన్న వాణిజ్య యుద్ధం ప్రపంచ వృద్ధికి సవాలు విసురుతుండటం వంటి ప్రతికూలతల నేపథ్యంలో ఇక్కడ నుంచి మార్కెట్ ఏ దిశగా ప్రయాణిస్తుందనే అంశానికి, అంతర్జాతీయ అంశాలే ఈవారంలో అత్యంత కీలకంగా ఉందని దలాల్ స్ట్రీట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**ఎఫ్ఓఎంసీ మినిట్స్, పావెల్ ప్రసంగంపై ఇన్వెస్టర్ల దృష్టి..**

జాక్సన్ హోల్ ఎకనామిక్ పాలసీ సదస్సులో అమెరికా ఫెడరల్ బ్యాంక్ చైర్మన్ జెరోమ్ పావెల్ ఈనెల 23న(శుక్రవారం) ప్రసంగం చేయనున్నారు. తదుపరి వడ్డీరేట్ల అంశంపై ఈయన ప్రసంగం ద్వారా పలు సూచనలు అందే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఇక్కడ జరగనున్న పరిణామాలపై దృష్టిసారించారు. ఇక బుధవారం ఎఫ్ఓఎంసీ జూలై సమావేశ మినిట్స్ వెల్లడికానుండగా.. అమెరికాలో ఇప్పటికే ఉన్న గృహ అమ్మకాల డేటా కూడా ఇదే రోజున వెల్లడికానుంది. గురువారం యూఎస్ సర్వీసెస్ పీఎంఐ, ఇనీషియల్ జాబ్‌లెస్ క్లెయిమ్స్ గణాంకాలు విడుదలకానున్నాయి. శుక్రవారం నూతన గృహ అమ్మకాల డేటా విడుదలకానుంది. దేశీయంగా ఆర్‌బీఐ తాజా ద్రవ్య విధాన సమీక్ష సమావేశ మినిట్స్ బుధవారం వెల్లడికానున్నాయి. ఈ పరిణామాలపై ఈవారంలో ఇన్వెస్టర్లు దృష్టిసారించారని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా అన్నారు.

# రంగాలవారీగానే తోడ్పాటు..

**ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీపై కేంద్రం విముఖత**

- ఆటోమొబైల్ రంగానికి విధానాలపరమైన వెసులుబాట్లు
- సూపర్ రిచ్ పన్ను కొన్నాళ్ల పాటు వాయిదా యోచన
- ఎన్‌బీఎఫ్‌సీలకూ ఊరటనిచ్చే చర్యలు పరిశీలనలో




**న్యూఢిల్లీ:** డిమాండ్ మందగించి, సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న వివిధ రంగాలు ఉద్దీపన ప్యాకేజీలు కోరుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ అవకాశాలన్నీ పరిశీలిస్తోంది. ఖజానాకొచ్చే ఆదాయంపై ప్రతికూల ప్రభావం చూపే ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీలాంటిది కాకుండా.. సంక్షోభంలో ఉన్న విభాగాలకు మాత్రమే పరిమితమయ్యేలా రంగాలవారీగానే రాయితీలు, తోడ్పాటు అందించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా రంగాలవారీ విధానపరమైన ప్యాకేజీలను సాధ్యమైనంత త్వరగా ప్రకటించేందుకు ప్రధాని కార్యాలయం, రిజర్వ్ బ్యాంక్‌లతో ఆర్థిక శాఖ ముమ్మరంగా చర్చలు జరుపుతోంది. సంక్షోభంలో ఉన్న ఆటోమొబైల్ తదితర రంగాలు కోరుతున్నట్లుగా రిజర్వ్ బ్యాంక్ పరిధిలో ప్రత్యేక రీఫైనాన్స్ విండో ప్రారంభించడం వంటి విధానపరమైన చర్యల గురించి చర్చలు జరుగుతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆటోమొబైల్ రంగం కోరుతున్నట్లు ద్విచక్రవాహనాలపై జీఎస్‌టీ (వస్తు, సేవల పన్ను)ని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించే అవకాశాలు లేనట్లేనని తెలుస్తోంది. ఒకవేళ తగ్గించిన పక్షంలో ప్రభుత్వానికి ఏటా రూ. 6,000 కోట్ల మేర ఆదాయం తగ్గనుండటంతో ప్రభుత్వం దీనివైపు మొగ్గు చూపడం లేదని సమాచారం. గరిష్ట శ్లాబు 28 శాతం పరిధిలో గతంలో 235 ఉత్పత్తులు ఉండగా.. ప్రస్తుతం 30 ఉత్పత్తుల స్థాయికి సంఖ్య తగ్గింది. అయితే ఆటోమొబైల్, అనుబంధ రంగాలకు రుణ సౌలభ్యాన్ని మెరుగుపర్చేలా ప్రభుత్వ బ్యాంకులతో ఆర్‌బీఐ, కేంద్రం కూడా చర్చలు జరుపుతున్నాయి. మొండిబాకీల పరిస్థితి మరింత దిగజారకుండా చూసుకుంటూ.. ఈ రంగాల సంస్థల అవసరాలకు అనుగుణంగా కస్టమైజ్డ్ రుణాలను అందించే అంశాన్ని పరిశీలించాలంటూ బ్యాంకులకు ప్రభుత్వం సూచించనున్నట్లు తెలుస్తోంది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల సమస్యలు పరిష్కరించి.. ఆటోమొబైల్ రంగానికి రుణ లభ్యత మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్వదేశీ జాగరణ్ మంచ్ కన్వీనర్ అశ్విన్ మహాజన్ చెప్పారు. ఒకవేళ ప్యాకేజీలు ఇచ్చేలా ఆర్థిక పరిస్థితి సహకరించకపోతే.. విధానపరమైన తోడ్పాటు చర్యలైనా తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఎన్‌బీఎఫ్‌సీల సమస్యలకు పరిష్కార మార్గాలు**

నిధులు దొరక్క నానా తంటాలు పడుతున్న నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలకు (ఎన్‌బీఎఫ్‌సీ) కూడా ఊరటనిచ్చే అంశంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఆర్థిక రంగం అభివృద్ధి మండలి (ఎఫ్ఎస్‌డీసీ) ఇందుకోసం కేంద్రం ముందు ఒక ప్రతిపాదన పెట్టింది. ఎన్‌బీఎఫ్‌సీలకు కూడా ముద్రా స్కీమ్ కింద రీఫైనాన్స్ సదుపాయం లభించేలా చూడటంతో పాటు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ)లాగా ఆర్‌బీఐలో శాశ్వత ప్రాతిపదికన రీఫైనాన్స్ విండో కూడా ఏర్పాటు చేయొచ్చని పేర్కొంది. దీంతో ఎన్‌బీఎఫ్‌సీల అవసరాలకు అనుగుణంగా నిధుల లభ్యత మెరుగుపడగలదని వివరించింది. అలాగే, బ్యాంకింగ్ వ్యవస్థ మాత్రమే కాకుండా ఇతరత్రా ప్రత్యామ్నాయ మార్గాల నుంచి కూడా ఎన్‌బీఎఫ్‌సీలు నిధులు సమీకరించుకునే వెసులుబాటు ఉంటే ఉపయోగకరంగా ఉంటుందని ఇటీవలే ఆర్థిక శాఖకు ఎఫ్ఎస్‌డీసీ తెలిపింది. మందగమన ప్రభావాలను అత్యధికంగా ఎదుర్కొంటున్న ఆటోమొబైల్ రంగంలోని చిన్న సంస్థలకు (ఎంఎస్ఎంఈ) కూడా ఇది తోడ్పాటునివ్వగలదని పేర్కొంది.

**ఎఫ్‌పీఐలకు ఊరట..**

అధికాదాయ వర్గాలపై అదనపు పన్ను (సూపర్ రిచ్ ట్యాక్స్) పరిధి నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు (ఎఫ్‌పీఐ) పూర్తి మినహాయింపు ఇచ్చే అవకాశం లేకపోయినప్పటికీ.. ప్రత్యామ్నాయంగా ఇతరత్రా మార్గాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. సూపర్ రిచ్ ట్యాక్స్ నోటిఫై చేయడాన్ని కొన్నాళ్ల పాటు వాయిదా వేయడం లేదా దీన్ని వర్తింపచేసే గడువును మరికొన్నాళ్ల పాటు పొడిగించడం వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. సూపర్ రిచ్ ట్యాక్స్‌ను పూర్తిగా ఎత్తివేయకుండా... ప్రత్యామ్నాయంగా ఏయే చర్యలు తీసుకోవచ్చన్న దానిపై ప్రధాని కార్యాలయం, ఆర్థిక శాఖ మధ్య చర్చలు జరుగుతున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. సూపర్ రిచ్ ట్యాక్స్ భయాలతో ఎఫ్‌పీఐలు అమ్మకాలకు తెగబడుతుండటంతో దేశీ స్టాక్ మార్కెట్ పరిస్థితి అస్తవ్యస్తంగా మారిన సంగతి తెలిసిందే.

## చిన్న స్థాయి వారికి రుణమాఫీ..

సంక్షోభంలో చిక్కుకున్న చిన్న స్థాయి రుణగ్రహీతలకు దివాలా స్మృతి (ఐబీసీ) పరిధిలో రుణ మాఫీని అమలు చేయాలని కేంద్రం యోచిస్తున్నట్లు కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ తెలిపారు. ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) చెందిన ఈ తరహా రుణగ్రహీతలకు రుణమాఫీ ప్రతిపాదనపై సూక్ష్మ రుణ పరిశ్రమ వర్గాలతో ప్రభుత్వం చర్చలు జరిపినట్లు ఆయన వివరించారు. ఐబీసీలో 'ఫ్రెష్ స్టార్ట్' నిబంధన కింద ఈ మాఫీని ప్రకటించే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీని కింద ఒకసారి రుణ మాఫీని గానీ వినియోగించుకున్న పక్షంలో మరో అయిదేళ్ల పాటు మరోసారి ఉపయోగించుకోవడానికి ఉండదని, మైక్రోఫైనాన్స్ పరిశ్రమ ప్రయోజనాలన్నీ పరిరక్షించే విధంగా తగు జాగ్రత్త చర్యలన్నీ తీసుకుని ఈ నిబంధనలు రూపొందించడం జరిగిందని శ్రీనివాస్ తెలిపారు. సొంత ఇల్లు లేకుండా ఆస్తుల విలువ కేవలం రూ. 20,000 లోపే ఉండి, మొత్తం రుణాలు రూ. 35,000 దాటని వారు మాత్రమే ఫ్రెష్ స్టార్ట్ కింద రుణ మాఫీకి అర్హులయ్యే అవకాశం ఉంది.

## అమెరికా ప్రభుత్వ సెక్యూరిటీల్లో

# పెరుగుతున్న భారత్ పెట్టుబడులు



**వాషింగ్టన్:** అమెరికా ప్రభుత్వ సెక్యూరిటీల్లో భారత పెట్టుబడులు ఇతోధికమవుతున్నాయి. జూన్ చివరికి 6 బిలియన్ డాలర్ల మేర పెరిగి 162.7 బిలియన్ డాలర్లకు చేరాయి. అమెరికా ఖజానా విభాగం తాజా గణాంకాలను పరిశీలిస్తే... అమెరికా ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడుల పరంగా అగ్రస్థానంలో జపాన్ ఉంది. ఆ దేశ పెట్టుబడులు 1.122 లక్షల కోట్ల (ట్రిలియన్ ) డాలర్లు మేర ఉండగా, ఆ తర్వాత చైనా 1.112 లక్షల కోట్ల డాలర్లతో రెండో స్థానంలో ఉంది. అమెరికా ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పెట్టుబడుల పరంగా భారత్ 162.7 బిలియన్ డాలర్లతో 13వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మే చివరికి 156.9 బిలియన్ డాలర్లు, ఏప్రిల్ చివరికి 155.3 బిలియన్ డాలర్లతో పోలిస్తే క్రమంగా పెరిగినట్టు తెలుస్తోంది. 2018 జూన్ నాటికి ఉన్న 147.3 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో పోల్చి చూసుకుంటే సుమారు 10 శాతానికి పైగా పెరిగాయి. అంతర్జాతీయ ఆర్థిక రంగం ఎన్నో సమస్యలతో సతమతం అవుతున్న సమయంలోనూ భారత ఎక్స్‌పోజర్ అధికం కావడం గమనార్హం. బ్రిటన్ 341.1 బిలియన్ డాలర్లు, బ్రెజిల్ 311.7 బిలియన్ డాలర్లు, ఐర్లాండ్ 262.1 బిలియన్ డాలర్లు, స్విట్జర్లాండ్ 232.9 బిలియన్ డాలర్లు, హాంకాంగ్ 215.6 బిలియన్ డాలర్లు, బెల్జియం 203.6 బిలియన్ డాలర్లు, సౌదీ అరేబియా 179.6 బిలియన్ డాలర్లు, తైవాన్ 175.1 బిలియన్ డాలర్లతో భారత్ కంటే ముందున్నాయి.

# అమ్ముడుపోని 4 లక్షల ఫ్లాట్లు

**9 పట్టణాల్లో అందుబాటు ధరల గృహాల పరిస్థితి**



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా 9 పట్టణాల్లో రియల్ ఎస్టేట్ డెవలపర్ల వద్ద అమ్ముడుకాని అందుబాటు ధరల ఫ్లాట్లు 4.12 లక్షలు ఉన్నట్టు ప్రాప్ టైగర్ డాట్ కామ్ తెలిపింది. ఇవన్నీ కూడా రూ.45 లక్షల ధరల్లోపువేనని పేర్కొంది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, పుణే, అహ్మదాబాద్, ముంబై, కోల్‌కతా, నోయిడా, గుర్‌గ్రామ్‌లో అమ్ముడు కాకుండా డెవలపర్ల వద్ద మొత్తం 7,97,623 గృహ యూనిట్లు ఉన్నాయి. ఇందులో అందుబాటు ధరల్లోనివి (రూ.45 లక్షల్లోపు) 4,12,930. హైదరాబాద్‌లో అమ్ముడవకుండా ఉన్న అందుబాటు ధరల ఫ్లాట్లు 4,881. అత్యధికంగా ముంబైలో 1,39,984 యూనిట్లు ఉన్నాయి.

## 'ఐడియా'లపై ప్రభుత్వరంగ బ్యాంకుల సమావేశాలు

**న్యూఢిల్లీ:** ఆర్థికాభివృద్ధికి సంబంధించి కేంద్రానికి సలహాలు ఇవ్వడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సహా ఇతర ప్రభుత్వరంగ బ్యాంకులు తమ శాఖల స్థాయిల్లో అధికారులతో తొలి విడత సమాలోచనలు నిర్వహించాయి. రానున్న ఐదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.350 లక్షల కోట్లు) స్థాయికి తీసుకెళ్లేందుకు గాను, బ్యాంకింగ్ రంగాన్ని మరింత పటిష్ట పరచాలని, భవిష్యత్తుకు అనుగుణంగా తీర్చిదిద్దాలని కేంద్రం భావించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగ బ్యాంకులన్నీ ఓ నెల రోజుల పాటు బ్రాంచ్‌ల స్థాయిలో అధికారులతో సంప్రదింపుల ప్రక్రియను చేపట్టి.. వారి సలహాలు స్వీకరించాలని కేంద్ర ఆర్థిక శాఖ కోరింది. శనివారాల్లో దీన్ని చేపట్టాలని వారిచ్చిన సూచనలను, బ్యాంకింగ్ రంగ భవిష్యత్తు వృద్ధికి రోడ్‌మ్యాప్ రూపకల్పనలో వినియోగించాలని సూచించింది. దీంతో ఎస్‌బీఐ 502 రీజినల్ బిజినెస్ కార్యాలయాల్లో నిర్వహించగా, 15,000 మందికిపైగా అధికారులు పాల్గొన్నట్టు బ్యాంకు ఎండీ పీకే గుప్తా తెలిపారు.

## పీఎన్‌బీ, బీవోఐ చీఫ్‌ల పోస్టులకు నోటిఫికేషన్

**న్యూఢిల్లీ:** పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ ఇండియాల(బీవోఐ)కు ఎండీ, సీఈవో పదవుల నియామకానికి గాను బ్యాంకు బోర్డ్ బ్యూరో (బీబీబీ) దరఖాస్తులు ఆహ్వానించింది. సెప్టెంబర్ 16 వరకు దరఖాస్తుల దాఖలుకు గడువు ఇచ్చింది. మూడేళ్ల కాలానికి ఈ నియామకాలు జరుగుతాయని తెలిపింది.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 19-8-2019

| | |
|---|---|
| విశాఖ | 359-00 |
| చిత్తూరు | 353-00 |
| వరంగల్ | 342-00 |
| విజయవాడ | 346-00 |
| నమక్కల్ | 360-00 |
| గోదావరి | 341-00 |
| చెన్నై | 360-00 |
| ముంబై | 390-00 |
| 18-8-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 339-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.00 |
| బెంగళూరు | 350-00 |
| ఢిల్లీ | 342-00 |
| కోల్‌కతా | 380-00 |

**స్టాక్స్ వ్యూ**

## గ్రాసిమ్ ఇండస్ట్రీస్

**బ్రోకరేజ్ సంస్థ: ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్** — **కొనొచ్చు**

**ప్రస్తుత ధర:** రూ.752 **టార్గెట్ ధర:** రూ.1,057

**ఎందుకంటే:** ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన ఈ కంపెనీ టెక్స్‌టైల్స్ కంపెనీగా తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. ఇప్పుడు టెక్స్‌టైల్స్‌తో పాటు సిమెంట్, రసాయనాలు, వీఎస్ఎఫ్(విస్కోస్ స్టేపుల్ ఫైబర్–దుస్తుల తయారీలో ఉపయోగించే ఒక రకమైన ఫైబర్) విభాగాల్లో కూడా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. భారత్‌లోనే అతిపెద్దదైన అల్ట్రాటెక్ సిమెంట్‌లో గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌కు 60.2 శాతం వాటా ఉంది. ఉత్పత్తి సంబంధిత సమస్యల కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరలో ఈ విభాగం అమ్మకాలు 4 శాతమే పెరగగలవని భావిస్తున్నాం. అయితే కాస్టిక్ సోడా, కర్ర గుజ్జు ధరలు తక్కువగా ఉండటం కంపెనీకి కలిసివచ్చే అంశం. రెండేళ్లలో ఉత్పత్తి సామర్థ్యం 38 శాతం మేర పెరగనుండటం కూడా సానుకూలాంశమే. భారత్‌లో వీఎస్ఎఫ్ విభాగంలో ఈ కంపెనీదే గుత్తాధిపత్యం. ఫలితంగా అంతర్జాతీయంగా ధరల ఒడుదుడుకులను ఈ కంపెనీ తట్టుకోగలదు. ఇక కెమికల్స్ విభాగం ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా రెండేళ్లలో 27 శాతం మేర పెంచుకోనున్నది. సిమెంట్‌కు దీర్ఘకాలంలో డిమాండ్ నిలకడగానే కొనసాగుతుందన్న అంచనాలున్నాయి. మధ్యకాలానికి ఆర్థిక సేవల విభాగం వ్యాపారం కూడా నిలకడైన వృద్ధిని సాధించగలదని భావిస్తున్నాం. ఇతర గ్రూప్ కంపెనీలైన వొడాఫోన్ ఐడియాలో ఇటీవలే రూ.2,900 కోట్లు పెట్టుబడులు పెట్టింది.. ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్(ఏబీసీఎల్)లో కూడా పెట్టుబడులు పెట్టనున్నది. ఈ పెట్టుబడులు.. సమీప కాలంలో షేర్ ధరపై ఒకింత ప్రతికూల ప్రభావం చూపించవచ్చు.

## అల్ట్రాటెక్ సిమెంట్

**బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్** — **కొనొచ్చు**

**ప్రస్తుత ధర:** రూ.4,207 **టార్గెట్ ధర:** రూ.5,350



**ఎందుకంటే:** మార్జిన్లు ఆరోగ్యకరంగా ఉండటం, లాభదాయకతలో మంచి వృద్ధి కారణంగా రియలైజేషన్ ఒక్కో టన్నుకు 14 శాతం వృద్ధితో రూ.5,484కు పెరిగింది. అయితే పశ్చిమ బెంగాల్, ఆంధ్ర, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ఇసుక సంబంధిత సమస్యలు, సాధారణ ఎన్నికలు, మౌలిక ప్రాజెక్టుల్లో మందగమనం తదితర కారణాల వల్ల అమ్మకాలు 2 శాతమే పెరిగి 17.9 మిలియన్ టన్నులకు చేరాయి. నిర్వహణ లాభం ఒక్కో టన్నుకు రూ.1,428కు పెరిగింది. కంపెనీ చరిత్రలో ఇదే అత్యధిక నిర్వహణ లాభం. కీలకం కాని ఆస్తుల విక్రయం, ఫ్రీ క్యాష్ ఫ్లోస్ వినియోగం ద్వారా రుణ భారం తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్యూ1లో రూ.1,022 కోట్ల రుణాలను తీర్చేసింది. నిర్వహణ లాభానికి రెండు రెట్లకు మించి రుణభారం ఉండకూడదనేది కంపెనీ లక్ష్యం. లిక్విడిటీ సమస్యలు, వర్షాలు అంతంతమాత్రంగానే ఉండటంతో సమీప భవిష్యత్తులో సిమెంట్ డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం ఉండొచ్చు. సెంచరీ కంపెనీ నుంచి కొనుగోలు చేసిన ప్లాంట్ల పూర్తి స్థాయి విలీనం ఈ ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్‌లో పూర్తవుతుంది. జేపీ అసోసియేట్స్ నుంచి కొనుగోలు చేసిన ప్లాంట్లు ఈ క్యూ1లోనే బ్రేక్‌ఈవెన్ సాధించాయి. తక్కువ బరువున్న సిమెంట్ క్యారియర్ల తయారీ కోసం హిందాల్కోతో కలసి ప్రయత్నాలు చేస్తోంది. ఫలితంగా రవాణా వ్యయాలు తగ్గుతాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2,000 కోట్ల మేర పెట్టుబడులు పెడుతోంది.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

# రూ.2,500 కోట్లు రికవరీ:బీవోఐ

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,500 కోట్లు రికవరీ అయ్యే అవకాశం ఉందని బ్యాంక్ ఆఫ్ ఇండియా భావిస్తోంది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ వద్ద 8–10 ఎన్‌పీఏ కేసులు పరిష్కారం కావొచ్చని బ్యాంకు ఈడీ సి.జి.చైతన్య తెలిపారు. తెలంగాణ జోనల్ మేనేజర్ ఎల్.మురళీ కృష్ణ రాజు, డిప్యూటీ జోనల్ మేనేజర్ సి.శోభారాణితో కలిసి ఆదివారమిక్కడ మీడియాతో మాట్లాడారు. 'ఈ కేసులు పరిష్కారం అవడం వల్ల లాభాలకు రూ.1,500 కోట్లు జతకూడనున్నాయి. శాఖల విస్తరణ కంటే డిజిటైజేషన్‌పై అధికంగా ఫోకస్ చేస్తున్నాం. 2018–19లో రుణాలు 11 శాతం వృద్ధి చెందాయి. 2019–20లో రుణాల్లో 11–15 శాతం వృద్ధి ఆశిస్తున్నాం' అని వివరించారు.




మీడియా సమావేశంలో మురళీ కృష్ణ రాజు, చైతన్య, శోభారాణి (ఎడమ నుంచి)

# ఎక్స్‌పెన్స్ రేషియో అధికం... ఇన్వెస్ట్ చేయాలా? వద్దా?




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

**పరాగ్ పరీక్ లాంగ్ టర్మ్ ఈక్విటీ ఫండ్ కాకుండా అంతర్జాతీయంగా షేర్లలో ఇన్వెస్ట్ చేసే ఫండ్స్ ఇంకా ఏమైనా ఉన్నాయా ? అసలు మన ఫండ్స్‌కు విదేశీ షేర్లలో ఇన్వెస్ట్ చేసే అవకాశం, అనుమతులు ఉన్నాయా? విదేశీ షేర్లలో ఇన్వెస్ట్ చేసే ఫండ్స్‌కు సంబంధించి పన్ను నియమాలు ఎలా ఉంటాయి? ఈ పరాగ్ ఫండ్‌కు సంబంధించిన డైరెక్ట్ ప్లాన్ ఎక్స్‌పెన్స్ రేషియో అధికంగా ఉంది. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేటప్పుడు ఎక్స్‌పెన్స్ రేషియోను కూడా పరిగణనలోకి తీసుకోవాలా?** –రవీందర్ జైన్, సికింద్రాబాద్

పరాగ్ పరీక్ లాంగ్ టర్మ్ ఈక్విటీ ఫండ్‌కు విదేశీ షేర్లలో ఇన్వెస్ట్ చేసే అనుమతి ఉంది. తన కార్పస్‌లో 35 శాతం మేర విదేశీ షేర్లలో ఇన్వెస్ట్ చేసే వెసులుబాటు ఈ ఫండ్‌కు ఉంది. గతంలో కూడా ఈ ఫండ్ తన కార్పస్‌లో 20-25 శాతం మేర విదేశీ షేర్లలో ఇన్వెస్ట్ చేసింది. ఇలా విదేశీ షేర్లలో ఇన్వెస్ట్ చేయడానికి అనుమతులు ఉన్న మరో రెండు, మూడు ఫండ్స్ కూడా ఉన్నాయి. అయితే వీటితో పోల్చితే ఈ పరాగ్ ఫండ్ నిరంతరాయంగా విదేశీ షేర్లలో ఇన్వెస్ట్ చేస్తోంది. ఇక ఈ ఫండ్‌కు సంబంధించి పన్ను నిబంధనలు ఇతర ఈక్విటీ ఫండ్స్ పన్ను నిబంధనలుగానే ఉంటాయి. ఈ ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో 1.5 శాతంగా ఉంది. ఇది మరీ ఎక్కువేమీ కాదని నా అభిప్రాయం. తన నిర్వహణ ఆస్తులు పెరిగితే, ఎక్స్‌పెన్స్ రేషియోను తగ్గిస్తానని తన ఆఫర్ డాక్యుమెంట్‌లో పరాగ్ ఫండ్ పేర్కొంది. ఎక్స్‌పెన్స్ రేషియోకు సంబంధించిన పన్ను నిబంధనలను ఇటీవలే మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ సవరించింది. ఈ మేరకు ఎక్స్‌పెన్స్ రేషియోలో త్వరలోనే ఈ ఫండ్ మార్పులు, చేర్పులు చేసే అవకాశాలు ఉన్నాయి. కొంత కాలం ఎదురు చూడండి. ఇక ఒక ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయడానికి ఎక్స్‌పెన్స్ రేషియోను పరిగణనలోకి తీసుకోవలసిందే. అయితే ఎక్స్‌పెన్స్ రేషియో అధికంగా ఉందన్న ఒక్క కారణంగా ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాలను వాయిదా వేయడం సరికాదు. డెట్ ఫండ్స్ విషయంలో ఎక్స్‌పెన్స్ రేషియో చాలా ముఖ్యమైన అంశం. ఈ ఫండ్స్ రాబడులు అధికంగా వచ్చే అవకాశాలు లేనందున పరిమిత ప్రభావం చూపే ఎక్స్‌పెన్స్ రేషియో డెట్ ఫండ్స్ విషయంలో కీలకమైన అంశమే. అయితే ఈక్విటీ ఫండ్స్‌లో రాబడులు అధికంగా వస్తాయి. కాబట్టి, ఎక్స్‌పెన్స్ రేషియోను పెద్దగా పట్టించుకోవలసిన అవసరం లేదు.

**వాల్యూ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి ఇది సరైన సమయమేనా? మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి ప్రభుత్వానికి పన్ను ఆదాయం భారీగానే వస్తుందా?** –కిరీటి, విజయవాడ

వాల్యూ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలంటే, చాలా ఓపిక కావాలి. వాల్యూ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి ఇప్పటికైతే సరైన సమయం రాలేదని చెప్పొచ్చు. వాల్యూ ఫండ్సే కాదు, గ్రోత్ ఫండ్స్‌లో కూడా ఇన్వెస్ట్ చేయడానికి ఇది సరైన సమయం కాదు. కంపెనీల ఆర్థిక ఫలితాలు బాగుండి, నికర లాభాలు మెరుగుపడితేనే, కంపెనీల షేర్లు పెరుగుతాయి. అప్పుడు మాత్రమే గ్రోత్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి వీలవుతుంది. ఈ నేపథ్యంలో వాల్యూ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి ఇప్పుడు సరైన సమయం మాత్రం కాదు. ఈ ఫండ్స్ పోర్ట్‌ఫోలియోను పరిశీలిస్తే, కంపెనీలన్నీ సమతూకంగానే ఉన్నాయి. ఇన్వెస్టర్లు తమ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో కొంత మొత్తాన్ని వాల్యూ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం సముచితమే. ప్రస్తుతానికైతే మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి ప్రభుత్వానికి పెద్దగా ఆదాయం లభించదనే చెప్పవచ్చు. 2018, ఫిబ్రవరి నుంచి చూసినా, మ్యూచువల్ ఫండ్స్‌పై దీర్ఘకాలిక మూలధన లాభాలు.. పన్ను చెల్లించాల్సిన స్థాయిలో రాలేదని చెప్పొచ్చు. అందుకని ప్రభుత్వానికి ఫండ్స్ లాభాలపై విధించే మూలధన లాభాల పన్ను పెద్ద మొత్తంలో వచ్చే అవకాశాలు పెద్దగా లేవు.

**నా వయస్సు 50 సంవత్సరాలు. రిటైర్మెంట్ కోసం ఇప్పటిదాకా ఎలాంటి పొదుపు, మదుపు చేయలేదు. నేనే 65 లేదా 70 ఏళ్ల వరకూ పనిచేయగలను. నా రిటైర్మెంట్ అవసరాల కోసం ఎలా ప్లాన్‌చేసుకోవాలి?** –ఫయాజ్, విశాఖపట్టణం

రిటైర్మెంట్ అవసరాల కోసం సాధారణంగా 30 ఏళ్ల నుంచే ఇన్వెస్ట్ చేయడం ఆరంభించాలి. రిటైర్మెంట్ అనేది దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యం. ఇలాంటి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల కోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేయాలి. ఇక మీ విషయానికొస్తే, మీకు ఎంత సాధ్యమైతే అంత ఇన్వెస్ట్ చేయండి. ఏదైనా ఈక్విటీ ఫండ్‌ను గానీ, మల్టీ క్యాప్ ఫండ్‌ను గానీ ఎంచుకోండి. ఈ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే సొమ్ములను ఇతర అవసరాల కోసం వినియోగించవద్దు. ఇప్పటి నుంచి మీరు మరో పది పదిహేనేళ్లు పనిచేయగలరు అనుకుంటున్నారు. కాబట్టి, తర్వాతి 10–15 ఏళ్ల అవసరాల కోసం ఇప్పటి నుంచి 10–15 ఏళ్ల పాటు ఇన్వెస్ట్ చేయండి. ఫండ్స్‌లో సిప్ విధానంలో పదేళ్లకు మించి ఇన్వెస్ట్ చేస్తే, మంచి రాబడులే వస్తాయి.

# సెన్సెక్స్ కీలక మద్దతుశ్రేణి 37,000-36890

**మార్కెట్ పంచాంగం**

వాణిజ్య యుద్ధ ప్రభావంతో ఆర్థిక మాంద్యం ముంచుకొస్తుందన్న సంకేతాల్ని బాండ్ల మార్కెట్లు అందించడంతో గతవారంలో అమెరికా స్టాక్ సూచీలు పెద్ద పతనాన్ని చవిచూశాయి. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌కు రాజీ సంకేతాలు పంపారు. అందుకు చైనా పాజిటివ్‌గా స్పందించకపోయినా, పతనం నుంచి అమెరికా సూచీలతోపాటు ప్రపంచ సూచీలన్నీ కాస్త కోలుకోగలిగాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లకు కష్టకాలం తొలగిపోలేదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు మన మార్కెట్...కేంద్రం ప్రకటించే ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీ కోసం ఎదురుచూస్తూ ఆగస్టు తొలివారపు కనిష్టస్థాయిల నుంచి కొంతవరకూ రికవరీ అయ్యింది. రానున్న రోజుల్లో కేంద్రం ప్రకటిస్తుందని భావిస్తున్న పన్ను ఊరటలు, రంగాలవారీగా రాయితీలు మార్కెట్‌ను నిరుత్సాహపరిస్తే, భారత్ సూచీల్లో డౌన్‌ట్రెండ్ వేగవంతం కావొచ్చు. ఇక సూచీల సాంకేతికాంశాల విషయానికొస్తే...,

**సెన్సెక్స్ సాంకేతికాంశాలు...**




ఆగస్టు 16తో ముగిసిన మూడురోజుల ట్రేడింగ్ వారంలో తొలిరోజునే గతవారపు గరిష్ట, కనిష్టస్థాయిల్ని బీఎస్ఈ సెన్సెక్స్ నమోదుచేసింది. ఆ రోజున 37,755 పాయింట్ల వద్ద ప్రారంభమై, 36,888 పాయింట్ల స్థాయికి పడిపోయింది. అటుతర్వాత మిగిలిన రెండు రోజులు పరిమితశ్రేణిలో హెచ్చుతగ్గులకు లోనైన సెన్సెక్స్ చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే 232 పాయింట్ల నష్టంతో 37,350 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం సెన్సెక్స్‌కు 37,000–36,890 పాయింట్ల మద్దతుశ్రేణి కీలకం. ఈ శ్రేణిపై స్థిరపడితేనే రిలీఫ్‌ర్యాలీ జరిగే అవకాశం వుంటుంది. ఈ మద్దతుశ్రేణిని కోల్పోతే 36,650 పాయింట్ల వద్దకు వేగంగా పడిపోవొచ్చు. అటుతర్వాత ఆగస్టు 5నాటి కనిష్టస్థాయి అయిన 36,416 పాయింట్ల వద్దకు క్షీణించవచ్చు. పైన ప్రస్తావించిన తొలి మద్దతుశ్రేణిని పరిరక్షించుకున్నా, వారం ప్రారంభంలోనే పెరిగినా సెన్సెక్స్ తొలుత 37,480 పాయింట్ల వద్దకు చేరవచ్చు. ఈ స్థాయిని ఛేదిస్తే 37,750–37,810 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. కీలకమైన ఈ నిరోధశ్రేణిని దాటితేనే తదుపరి అప్‌ట్రెండ్ సాధ్యపడి 38,170–38,330 పాయింట్ల శ్రేణి వరకూ ర్యాలీ కొనసాగవచ్చు.

**నిఫ్టీ కీలక మద్దతుశ్రేణి 10,930-10,900**




క్రితం వారం ఎన్ఎస్ఈ నిఫ్టీ 200 రోజుల చలన సగటు రేఖ (200డీఎంఏ) కదులుతున్న సమీప స్థాయి నుంచి తీవ్రంగా 10,900 పాయింట్ల వద్దకు క్షీణించిన తర్వాత కొంతవరకూ నష్టాల్ని పూడ్చుకోగలిగింది.చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 62 పాయింట్ల నష్టంతో 11,048 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం నిఫ్టీకి 10,930–10,900 పాయింట్ల మద్దతుశ్రేణి కీలకం. గతవారంలో మూడు ట్రేడింగ్ రోజుల్లోనూ ఇదే శ్రేణి వద్ద మద్దతు లభించినందున, ఈ శ్రేణిని కోల్పోతే వేగంగా 10,840 పాయింట్ల వద్దకు పడిపోవొచ్చు. ఈ లోపున 10,780 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు. ఈ వారం తొలి మద్దతుశ్రేణిని పరిరక్షించుకోగలిగితే నిఫ్టీ క్రమేపీ 200 డీఎంఏ కదులుతున్న 11,180 పాయింట్ల వరకూ పెరిగే అవకాశం వుంటుంది. ఈ వారం నిఫ్టీ పెరిగితే తొలుత 11,080 పాయింట్ల స్థాయి నిరోధించవచ్చు. అటుపై 11,180 పాయింట్ల స్థాయి వరకూ పెరగవచ్చు. ఆపైన ముగిస్తే వేగంగా 11,265 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు.

– పి. సత్యప్రసాద్

## క్లుప్తంగా...

### ఎయిర్‌పోర్టులో ప్రయాణికుడి వద్ద బుల్లెట్లు

**శంషాబాద్:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి వద్ద బుల్లెట్లు లభ్యమయ్యాయి. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన అంకిత్‌సింగ్ మెహ్రా (35) ఓ ప్రముఖ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌కు వచ్చిన అతడు శనివారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఇండిగో విమానంలో ఢిల్లీ బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. అతడి బ్యాగేజీని అధికారులు తనిఖీ చేయగా వినియోగించని కేఎఫ్ 12 రకానికి చెందిన బుల్లెట్‌తోపాటు వినియోగించిన మరో 7.62 ఎంఎం బుల్లెట్ బయటపడింది. మెహ్రా వద్ద బుల్లెట్లకు సంబంధించిన సరైన ఆధారాలు లేకపోవడంతో ఆయుధ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పీజీఈసెట్ తొలిదశ సీట్ల కేటాయింపు పూర్తి

**సాక్షి, హైదరాబాద్:** ఇంజనీరింగ్ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి పీజీఈసెట్–2019 తొలివిడత సీట్ల కేటాయింపు పూర్తయింది. విద్యార్థులు ఎంపిక చేసుకున్న ఆప్షన్లను పరిశీలించి అర్హతల ఆధారంగా సీట్లను కేటాయించారు. ఈ మేరకు వివరాలను పీజీఈసెట్ కన్వీనర్ పి.రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఈసెట్ కింద మొత్తం 8,963 సీట్ల భర్తీకి చర్యలు చేపట్టారు. ఈ మేరకు అర్హత పరీక్ష నిర్వహించిన అనంతరం ర్యాంకుల ఆధారంగా ఆప్షన్లు ఇచ్చుకున్న వారికి సీట్లు కేటాయించారు. తొలి విడతలో 6,096 మందికి సీట్లు అలాట్ చేశారు. మరో 2,598 సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయి.

### 50 సీట్లతో ఎయిమ్స్ కళాశాల ప్రారంభం

**బీబీనగర్:** యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలంలోని రంగాపురం వద్ద నిమ్స్ భవనంలో ఈ నెల 27న ఎయిమ్స్ కళాశాలను ప్రారంభించనున్నట్లు ఎయిమ్స్ డైరెక్టర్ శర్మన్‌సింగ్ తెలిపారు. బీబీనగర్ నిమ్స్‌లో కొనసాగుతున్న ఎయిమ్స్ కళాశాల ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలి విడతలో 50 సీట్లతో ఎంబీబీఎస్ కళాశాలను ప్రారంభిస్తామని, తదుపరి 100 సీట్లకు పైగా పెంచుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రూ.1,028 కోట్లు మంజూరు చేయడంతో ఎయిమ్స్ కళాశాల ఏర్పాటుతో పాటు త్వరలో వైద్యశాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఎయిమ్స్ కళాశాలతోపాటు బాలుర, బాలికల వసతి గృహాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



**మంచి చెప్పడానికి మాటలక్కర్లేదు.. ఒక్కోసారి ఒక్క ఫొటో సరిపోతుంది..**

ఆదివారం.. సెంట్రల్ హాంకాంగ్.. ప్రజాస్వామ్య అనుకూల ర్యాలీ జరుగుతోంది.. ఎటు చూసినా జనసాగరం.. ఇంతలో అటుగా ఓ అంబులెన్స్.. ఆశ్చర్యం.. అంతటి నిరసనలోనూ.. అంతటి గందరగోళంలోనూ ఆ జనసాగరం ఒక్కసారిగా చీలింది.. అంబులెన్స్‌కు దారి చూపింది.. మంచికి మార్గం పరిచింది.. మరి మనం.. చూసి అచ్చెరువొందామా? ఆచరిద్దామా?

# కృష్ణాలో వరద తగ్గుముఖం

**సాక్షి, హైదరాబాద్:** కృష్ణాబేసిన్ ప్రాజెక్టుల్లో వరద ఉధృతి తగ్గుముఖం పడుతోంది. ఎగువ కర్ణాటక ప్రాజెక్టులకు మొన్నటివరకు 8 లక్షల క్యూసెక్కులు, నిన్నటివరకు 5 లక్షల క్యూసెక్కుల మేర వరద ఉధృతి ఉండగా, అది క్రమంగా 2 లక్షల క్యూసెక్కులకు చేరింది. తగ్గుతున్న వరదకు అనుగుణంగా ప్రాజెక్టుల గేట్లు ఒక్కొక్కటిగా మూసి వేస్తూ జలాశయాల్లో నిల్వలు పెంచుతున్నారు. మొన్నటివరకు ఆల్మట్టిలో 100 టీఎంసీల మేర నిల్వలు ఉంచగా ఆదివారం 112 టీఎంసీల నిల్వలు ఉంచి మిగతా నీటిని కిందికి వదులుతున్నారు. రాష్ట్ర పరిధిలోని జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకూ వరద ఉధృతి తగ్గింది. సాగర్‌లోకి 4.21 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదిలేస్తున్నారు.

**ప్రధాన జలాశయాల్లో నిల్వలు.. (నిల్వ-టీఎంసీల్లో)**
**(సాయంత్రం 5 గంటల అధికారిక బులిటెన్ ప్రకారం)**

| ప్రాజెక్టు | పూర్తి నీటినిల్వ | ప్రస్తుత నీటినిల్వ | ఇన్‌ఫ్లో(క్యూసెక్కుల్లో) | ఔట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 112.10 | 2,65,000 | 1,04,000 |
| నారాయణపూర్ | 37.646 | 32.95 | 2,00,000 | 2,01,600 |
| జూరాల | 9.65 | 8.14 | 3,85,000 | 3,67,757 |
| శ్రీశైలం | 215.807 | 198.36 | 5,79,320 | 5,65,137 |
| తుంగభద్ర | 100.86 | 100.51 | 40,933 | 51,425 |
| ఉజ్జయినీ | 117.24 | 117.24 | 12,351 | 11,050 |
| నాగార్జునసాగర్ | 312.045 | 301.36 | 4,21,838 | 4,21,838 |
| పులిచింతల | 45.77 | 33.59 | 5,29,635 | 5,55,0054 |
| కడెం | 7.60 | 6.88 | 888 | 818 |
| ఎల్లంపల్లి | 20.18 | 18.70 | 0 | 0 |
| ఎస్సారెస్పీ | 90.31 | 17.18 | 0 | 389 |

# ట్రాఫిక్ చిక్కులు.. తీర్చే దిక్కులు!

**సాక్షి, హైదరాబాద్:** కోటి జనాభా దాటిన మహానగరంలో 'ట్రాఫిక్'తీర్చలేని ప్రధాన సమస్య. 10 కిలోమీటర్ల ప్రయాణానికి 30 నుంచి 45 నిమిషాలు సమయం వెచ్చించాల్సిందే. రద్దీ సమయాల్లో గంట కంటే ఎక్కువే పడుతుంది. దీన్ని తగ్గించడం కోసం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) పలు కార్యక్రమాలు చేపడుతూనే ఉంది. ఇందులో భాగంగా వచ్చిన ఆలోచనే.. వస్తు నిల్వ కేంద్రాలు (లాజిస్టిక్ హబ్స్). నగరంలోకి భారీ వాహనాలు రాకుండా శివారు ప్రాంతాల్లోని హబ్స్‌లోనే ఆపేసి, వస్తువులను అక్కడే నిల్వ చేస్తారు. చిన్న వాహనాల్లో నగరంలోకి తీసుకొస్తారు. ఇలా మహానగరం నలువైపులా నయా హబ్స్ రానున్నాయి. మంగల్‌పల్లి, బాటసింగారం ప్రాంతాల్లో లాజిస్టిక్ హబ్స్ పనుల్లో వేగిరం పెరగగా... పటాన్‌చెరులో భూమిని చదును చేసి పనులు చేస్తున్నారు. అలాగే మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌పై పడుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు మియాపూర్‌లో ఇంటర్ సిటీ బస్‌టెర్మినల్ (ఐసీబీటీ) పనులపై కూడా హెచ్‌ఎండీఏ దృష్టి సారించింది. ఈ నాలుగు అందుబాటులోకొస్తే నగరంపై పడే సగం ట్రాఫిక్ తగ్గడంతో పాటు రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశముందని హెచ్‌ఎండీఏ అధికారులు చెబుతున్నారు. ఇవేకాక పెద్దఅంబర్‌పేటలో ఐసీబీటీ, శంషాబాద్‌లో మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు సాధ్యాసాధ్యాలపైనా దృష్టి సారించారు. శంషాబాద్, మనోహరాబాద్, పటాన్‌చెరు, శామీర్‌పేటలోనూ లాజిస్టిక్ హబ్‌లపై అధ్యయనం చేసి అందుకయ్యే వ్యయాన్ని అంచనా వేసే పనిలో హెచ్‌ఎండీఏ అధికారులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపడితే దాదాపు 200 కోట్ల వరకు వ్యయమవుతుందని అంచనా వేస్తున్నారు.

**బాటసింగారం(లాజిస్టిక్ హబ్)...**
**ప్రాంతం:** విజయవాడ హైవేపై ఓఆర్‌ఆర్‌కి 7కి.మీ. దూరంలోని హయత్‌నగర్ మండలం బాటసింగారం.
**విధానం:** పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం
**విస్తీర్ణం:** 40 ఎకరాలు
**వ్యయం:** రూ.35 కోట్లు
**ప్రారంభం:** 2017
**ప్రస్తుత స్థితి:** 70 శాతం పూర్తి
కమర్షియల్ ఆపరేషన్‌కు గ్రీన్‌సిగ్నల్

**మంగల్‌పల్లి(లాజిస్టిక్ హబ్)....**
**ప్రాంతం:** నాగార్జునసాగర్ హైవేపై ఓఆర్‌ఆర్ బొంగళూరు జంక్షన్ నుంచి 500 మీటర్ల దూరంలోని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మంగల్‌పల్లి.
**విధానం:** పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం
**విస్తీర్ణం:** 22 ఎకరాలు
**వ్యయం:** రూ.20 కోట్లు
**ప్రారంభం:** 2017
**ప్రస్తుత స్థితి:** 40 శాతం పూర్తి
మరో మూడు నెలలు పట్టే అవకాశం

**పటాన్‌చెరు(లాజిస్టిక్ హబ్)...**
**విధానం:** పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం
**విస్తీర్ణం:** 17 ఎకరాలు ● **ప్రస్తుత స్థితి:** 5 ఎకరాల్లో పార్కింగ్ పనులు పూర్తి ● **చేసిన ఖర్చు:** రూ.5 కోట్లు

**ప్రయోజనాలు ఇవి...:** బాటసింగారం, మంగల్‌పల్లి ప్రాంతాల్లోని లాజిస్టిక్ హబ్‌ల్లో అన్ని రకాల వస్తువులను నిల్వ చేయొచ్చు. పెద్దెత్తున సరుకులు తీసుకొచ్చిన భారీ వాహనాలు ఇక్కడే ఆగిపోతాయి. అక్కడి నుంచి నగర వ్యాపారులకు కావల్సినప్పుడు చిన్న వాహనాల్లో తీసుకెళ్లవచ్చు. తద్వారా కొంత వరకు రవాణా చార్జీలు తగ్గి సరుకుల ధరలూ తగ్గుతాయి. మినీ ట్రక్కులు, ఆటోలు, చిన్న వాహనాలకు గిరాకీ పెరుగుతుంది. భారీ వాహనాల రాక ఆగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. భారీ వాహనాల వల్లే అధిక ప్రమాదాలు జరుగుతుండటంతో అవీ తగ్గుతాయి.

**ప్రత్యేకతలు ఇవి...**
మంగల్‌పల్లి, బాటసింగారంలో ఒకేసారి 500 ట్రక్కులు పార్క్ చేయవచ్చు. ● 2 లక్షల చ.అ. గోదాములు, 10 వేల టన్నుల సామర్థ్యంతో కోల్డ్ స్టోరేజ్. ● ఆటోమొబైల్ సర్వీస్ కేంద్రం, పరికరాల నిల్వకు 10 వేల టన్నుల సామర్థ్యంతో గోదాములు. ● 100 మంది ఉండటానికి వీలుగా డార్మిటరీ, 5 వేల చ.అ. విస్తీర్ణంలో రెస్టారెంట్, 2,500 చ.అ.ల్లో పరిపాలన కార్యాలయం.

**మియాపూర్ (ఐసీబీటీ)...**
**విధానం:** పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం
**విస్తీర్ణం:** 55 ఎకరాలు ● **వ్యయం:** రూ.100 కోట్లు
**ప్రత్యేకతలు :** తమిళనాడులో 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఐసీబీటీని తలదన్నేలా దేశంలోనే నంబర్‌వన్‌గా మియాపూర్‌లో పనులు. ● ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ బస్సులు ఇక్కడ నిలపొచ్చు. ● ఇతర వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అందుబాటులో రెంటల్ సర్వీసు. వైద్యం వినోదం కోసం థియేటర్, డార్మిటరీలు, ఫుడ్‌కోర్ట్‌లు, సెలూన్‌లు, షాపింగ్ మాల్‌లు.. లాంటి సదుపాయాలు.

**2011లోనే ఆలోచన...**

ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి నగరానికి వస్తున్న వందలాది ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులతో ఎంజీబీఎస్‌పై విపరీతమైన రద్దీ పెరిగింది. దీన్ని నియంత్రించేందుకు మియాపూర్‌లో ఓ భారీ బస్టాండ్‌ను నిర్మించాలని 2011లో అప్పటి ప్రభుత్వం ఆలోచించింది. ఆయా రాష్ట్రాలు, జిల్లాల నుంచి ఐసీబీటీకి వచ్చివెళ్లే ప్రజలు నగరంలోకి వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు మెట్రో సర్వీసులు కూడా ఉండేలా చూసుకున్నారు. అయితే భూవివాదం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. ఏడాది క్రితమే పాత కంపెనీని రద్దు చేసిన హెచ్‌ఎండీఏ తాజా పరిస్థితులపై మళ్లీ అధ్యయనం చేసేందుకు ట్రాన్సక్షన్ అడ్వైజరీ కమిటీ నియమించారు. దీని నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొని ఐసీబీటీ పనులు ప్రారంభించనున్నారు.

# ఆనందకర జీవితమే బంగారు తెలంగాణ లక్ష్యం

**అసెంబ్లీ స్పీకర్ పోచారం**

**సాక్షి, హైదరాబాద్:** ప్రజలకు ఆనందకరమైన జీవితాన్ని అందించడమే బంగారు తెలంగాణ లక్ష్యమని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులాలతో సంబంధం లేకుండా అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాల లబ్ధి చేకూరుస్తోందన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఆధ్వర్యంలో ఆదివారం ఆబిడ్స్‌లో వివేకానంద విదేశీ విద్యాపథకం కింద ఎంపికైన విద్యార్థులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశాక, సభనుద్దేశించి ప్రసంగించారు. సరస్వతి ఉన్న దగ్గరే లక్ష్మి ఉంటుందని, సమాజంలో గౌరవం పొందే వ్యక్తులు విద్యావంతులు మాత్రమేనన్నారు. ఒక వ్యక్తిదగ్గర ఎంత ధనమున్నా వేదికపైకి పిలవరని, కానీ సరస్వతి పుత్రునికి మాత్రం సభా గౌరవం దక్కుతుందన్నారు. బ్రాహ్మణుల్లో కూడా పేదవారున్నారని, వారిని గుర్తించిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు.



ముఖ్యమంత్రి కేసీఆర్ బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఆలోచించిన ఏకైక సీఎం అని, తెలంగాణ గడ్డపై నివసించే ప్రతి వ్యక్తి సంతోషంగా జీవిస్తేనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. బ్రాహ్మణ, జర్నలిస్టు, న్యాయవాదుల సంక్షేమానికి నిధులిచ్చిన ప్రభుత్వం మనదేన్నారు. కులాలు, మతాలతో సంబంధం లేకుండా అన్ని సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, స్వచ్ భారత్‌పై దేశవ్యాప్తంగా 700 జిల్లాలలో సర్వే జరిగితే అందులో ఆరు తెలంగాణ జిల్లాలు ముందున్నాయన్నారు. పంచాయతీ చట్టాన్ని అమల్లోకి తెచ్చామని, పలు చట్టాల్లోనూ మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. యాదాద్రి గుడిలో అద్భుతమైన కట్టడాలు జరుగుతున్నాయని, చరిత్రలో నిలిచిపోయే గుడి నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రభుత్వం పురోహితులకు ఆర్థిక సహాయం చేస్తుందని, అన్ని దేవాలయాలకు ధూపదీప నైవేద్యం కింద నిధులిస్తున్నామన్నారు. అనంతరం బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ రమణాచారి మాట్లాడుతూ వివేకానంద విద్యా పథకం కింద 54 మంది ఎంపికయ్యారని, వీరిలో అమెరికాకు 27 మంది, ఆస్ట్రేలియాకు 12, కెనడాకు 8, ఫ్రాన్స్‌కు ఒకరు, జర్మనీకి నలుగురు, యూకేకు ఇద్దరు వెళ్తున్నారన్నారు. వీరికి రూ.10.80 కోట్ల విలువైన మంజూరీ పత్రాలు ఇచ్చామన్నారు. బ్రాహ్మణ పరిషత్ ద్వారా అమలయ్యే కార్యక్రమాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, వివిధ పథకాల కింద దరఖాస్తుకు సెప్టెంబర్ 20వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. విద్యాపథకం కింద ఒక్కో లబ్ధిదారుకు రూ.20లక్షల సాయం అందిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులు తక్కువగా వచ్చిన జిల్లాల నుంచి మరిన్ని స్వీకరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మీ కాంతరావు, ఎమ్మెల్సీ పురాణం సతీష్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

# ముక్కలుగా నరికి.. డ్రమ్ముల్లో కుక్కి..

- వృద్ధుడి దారుణ హత్య... కన్నకొడుకే కాలయముడు
- కుటుంబ సభ్యుల పాత్రను ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు
- రెండురోజులు ఇంట్లోనే.. దుర్వాసనతో బయటపడిన ఘటన



**హైదరాబాద్:** తండ్రి పాలిట కన్నకొడుకే కాలయముడయ్యాడు. కుటుంబసభ్యులతో కలిసి వృద్ధతండ్రిని దారుణంగా హత్య చేసి ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేసి ఉంచిన సంఘటన హైదరాబాద్ మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఏసీపీ సందీప్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ ఆదివారం వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన కిషన్ సుతార్ మారుతి(80) రైల్వే విభాగంలో గూడ్స్ డ్రైవర్‌గా పనిచేశాడు. 20 ఏళ్ల క్రితం మౌలాలి ఆర్టీసీ కాలనీలో స్థిరపడ్డాడు. అతనికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు చాలా ఏళ్ల క్రితమే అదృశ్యమయ్యాడు. పెద్ద కూతురు అనుపమ, భర్తతో కలిసి మారేడ్‌పల్లిలో ఉంటోంది. ఆర్టీసీకాలనీలో సుతార్ మారుతి, అతని భార్య గయ, కూతురు ప్రఫుల్, కుమారుడు కిషన్‌తో కలిసి ఉంటున్నాడు. తాగుడుకు బానిసైన సుతార్ మారుతి నిత్యం కుటుంబసభ్యులతో గొడవపడేవాడు. కుమారుడి ఆరోగ్యం కూడా బాగాలేదు. ఈ నెల 16వ తేదీ రాత్రి పది గంటలకు మద్యం సేవించి ఇంటికి వచ్చిన సుతార్ మారుతి భార్య, కొడుకు, కూతురుతో గొడవపడ్డాడు. అదేరాత్రి సుతార్ మారుతి హత్యకు గురయ్యాడు

**దుర్వాసనతో బయటపడ్డ సంఘటన**

రెండు రోజులుగా ఆ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు 100 నంబర్‌కు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ మన్మోహన్, ఎస్‌ఐ సంజీవరెడ్డిలు ఇంట్లోకి వెళ్లి పరిశీలించారు. సుతార్ మారుతి మృతదేహం ముక్కలు, ముక్కలుగా ఆరు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో వేసి ఉండటం చూసి కంగుతిన్నారు. సుతార్ మారుతీని పథకం ప్రకారమే హత్య చేశారని పోలీసులు అనుమానిస్తున్నారు. కుటుంబసభ్యులను తరచూ వేధించడం, కిషన్‌కు ఉద్యోగంలేదని గొడవపడుతుండటంతో సుతార్ మారుతీను హత్య చేసి ఉంటారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పకడ్బందీగా మృతదేహాన్ని తరలించేందుకు కొత్తగా ఆరు ప్లాస్టిక్ డమ్ములను వాడటం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. సంఘటనాస్థలానికి వచ్చిన క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. డాగ్‌స్క్వాడ్ శునకం ఇంట్లో నుంచి కొంత దూరం వెళ్లి తిరిగివచ్చింది.

**పోలీసుల అదుపులో నిందితులు?**

నిండుతులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ఉద్దేశపూర్వకంగా హత్య చేశారా లేక సుతార్ మారుతి, కిషన్ గొడవపడినప్పుడు కిందపడి ప్రమాదవశాత్తు చనిపోతే ఎవరికీ తెలియకుండా ప్లాస్టిక్ డ్రమ్ముల్లో తరలించడానికి ప్రయత్నించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చుట్టుపక్కల వారిని విచారించగా సుతార్ మారుతి కుటుంబసభ్యులు ఎవరితోనూ ఎక్కువగా కలిసేవారు కాదని తెలిపారు.

**కుటుంబ కలహాలే కారణం: ఏసీపీ సందీప్**

సుతార్ మారుతి హత్యకు కుటుంబ కలహాలే కారణమని ప్రాథమికంగా నిర్ధారించామని ఏసీపీ సందీప్ తెలిపారు. కొడుకుకు ఉద్యోగం లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో తరచూ తండ్రీకొడుకులు గొడవపడేవారన్నారు.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792